తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 23.12.2025 | సంపుటి : 12 సంచిక : 154 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






# మంత్రులంతా కష్టపడి ఉంటే మరిన్ని మెరుగైన ఫలితాలొచ్చేవి



- సమన్వయం లేక.. రెబెల్స్‌ను నివారించక కొన్నిచోట్ల నష్టం
- మరికొన్నిచోట్ల ఎమ్మెల్యేలు సైతం సరిగ్గా పనిచేయలేదు
- మంత్రులు, ముఖ్య నేతలతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటి

పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ దాదాపు 60%పైగా స్థానాలను దక్కించుకున్నప్పటికీ.. ఆ పార్టీలో సుదీర్ఘ విశ్లేషణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏయే జిల్లాల్లో వెనుకబడ్డాం.. ఎక్కడ ఆధిక్యత సాధించాం అనే అంశాలపై పార్టీ పెద్దలు నెమరువేస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఏఐసీసీ ఇన్‌చార్జి నటరాజన్ పలువురు ఎమ్మెల్యేలపై అసహనం వ్యక్తం చేయగా.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అంతర్గత సమీక్ష నిర్వహించినట్టు తెలిసింది. మంత్రులు, ఎమ్మెల్యే, ఇన్‌చార్జీలు కలిసికట్టుగా పనిచేసి వుంటే మరిన్ని మెరుగైన ఫలితాలొచ్చేవని విశ్లేషించినట్టు సమాచారం. భారీ విజయమే దక్కించుకున్నామని ఆయన ప్రకటించినా.. ఎక్కడెక్కడ లోపాలు జరిగాయో వాటిని రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పాఠాలుగా తీసుకోవాలని సూచించారట..!

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పాఠాలుగా తీసుకోవాలని సూచన
- పంచాయతీ ఫలితాలపై సీఎం సుదీర్ఘ విశ్లేషణలు

హైదరాబాద్, డిసెంబర్ 22 (జనంసాక్షి) : మంత్రులతో కీలక సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఫలితాలు ఇంకా ఆశించినంత రాలేదని అసంతృప్తి వెలిబుచ్చినట్టు తెలిసింది. కొన్ని నియోజకవర్గాల్లో (ముఖ్యంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న 18 చోట్ల) బీఆర్ఎస్ ఆధిక్యం సాధించడం పట్ల ఆయన సీరియస్ అయ్యారు. సమన్వయ లోపాలు, రెబల్స్‌ను నియంత్రించలేకపోవడం, కుటుంబ పాలన (నెపోటిజం), ఎమ్మెల్యేలు, మంత్రుల బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడం వల్ల కొంతమేర నష్టం జరిగిందని చెప్పారట. అదేవిధంగా 16 మంది ఎమ్మెల్యేలు, కొంతమంది మంత్రుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం ఎలా ఉందని మంత్రుల దగ్గర్నుంచి ఆరాతీసినట్టు సమాచారం. మున్ముందు రాబోయే ఎన్నికల్లో ఇప్పటి తప్పిదాలను పునరావృతం కాకుండా మిగతా 2లో..


## ప్రాజెక్టులు పూర్తి చేయకుండా మిమ్మల్ని ఎవరడ్డుకున్నారు?

### కేసీఆర్ ప్రాజెక్టులు కట్టింది కేవలం కమీషన్ల కోసమే..

- పాలమూరు ,ఎస్ఎల్‌బీసీని బీఆర్ఎస్ ఎందుకు పూర్తి చేయలేదు?
- రూ. లక్షల కోట్లతో కట్టిన కాళేశ్వరం వారి హయాంలోనే కూలింది
- వారు చేసిన అప్పులకు వడ్డీల కింద ఏటా రూ.16వేల కోట్లు చెల్లిస్తున్నాం
- పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు పూర్తిగా రాలేదు
- ప్రాజెక్టు పూర్తి చేయకుండా పాలమూరు ప్రజలకు అన్యాయం చేశారు
- పదేళ్లలో మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారు
- పెద్దపల్లి జిల్లాలో కూలిన చెక్‌డ్యామ్‌లపై విచారణ జరిపిస్తాం: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్(జనంసాక్షి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డిజైన్ చేసి.. నిర్మించిన కాళేశ్వరం వారి హయాంలోనే కూలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టు గురించి మాట్లాడటం ఆపి.. సిగ్గుతో తలదించుకోవాలని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " బీఆర్ఎస్ హయాంలో ఐదేళ్లలో వాడుకున్న నీరు 70, 80 టీఎంసీలే. రూ.1.80 లక్షల కోట్ల ప్రాజెక్టు నిరుపయోగం కావడం బీఆర్ఎస్ ఘనత. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు అనేది పదేళ్లకు అంగీకరించారు. పాలమూరు, ఎస్ఎల్‌బీసీని బీఆర్ఎస్ పూర్తి చేస్తుంటే ఎవరైనా అడ్డుకున్నారా? కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రూ. లక్షల కోట్లు అప్పులు చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీల కింద ఏటా రూ.16వేల కోట్లు చెల్లిస్తున్నాం. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు పూర్తిగా రాలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రూ.5 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే పాలమూరు ప్రజలకు అన్యాయం చేశారు" అని ఉత్తమ్ విమర్శించారు. రూ. లక్షల కోట్లు అప్పులు చేసిన వారు ఇప్పుడు మళ్లీ రంకెలు వేస్తున్నారని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డిజైన్ చేసి.. నిర్మించిన కాళేశ్వరం వారి హయాంలోనే కూలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టు గురించి మాట్లాడటం ఆపి.. సిగ్గుతో తలదించుకోవాలని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఐదేళ్లలో వాడుకున్న నీరు 70, 80 టీఎంసీలే. రూ.1.80 లక్షల కోట్ల ప్రాజెక్టు నిరుపయోగం కావడం బీఆర్ఎస్ ఘనత. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు అనేది పదేళ్లకు అంగీకరించారు. పాలమూరు, ఎస్ఎల్‌బీసీని బీఆర్ఎస్ పూర్తి చేస్తుంటే ఎవరైనా అడ్డుకున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీల కింద ఏటా రూ.16వేల కోట్లు చెల్లిస్తున్నాం. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు మిగతా 2లో..




## వార్డుల విభజనలో జోక్యం చేసుకోలేం

- భౌగోళికంగా, జనాభాపరంగా పునర్విభజన జరగలేదన్న పిటిషనర్ల వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం
- జీహెచ్ఎంసీ పునర్విభజనపై మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరణ

హైదరాబాద్(జనంసాక్షి):జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సోమవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. వాదనలు విన్న ధర్మాసనం ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీలో డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న మిగతా 2లో..





## ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

- ఢిల్లీకి పయనమైన ద్రౌపదీ ముర్ము
- వీడ్కోలు పలికిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ శీతాకాల విడిది ముగిసింది. ఈ నెల 17న హైదరాబాద్ చేరుకున్న ఆమె.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 19న రామోజీఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) ఛైర్‌పర్సన్ల జాతీయ మిగతా 2లో..



రేకుర్తి గ్రామంలో ఆగిన రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

## గ్లోబల్ సమ్మిట్‌తో పెరిగిన తెలంగాణ ప్రతిష్ట

అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ఇమేజ్



- సమ్మిట్ ద్వారా రూ.5లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు
- ఎంఓయూలపై కేసీఆర్ చులకనగా మాట్లాడటం సరికాదు
- మీ హయాంలో ఎంవోయూలపై పెట్టుబడులే లేవు
- కేసీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ వేదికగా జరిగిన గ్లోబల్ సమ్మిట్ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను పెంచిందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఇప్పుడు తెలంగాణ వైపు ఆసక్తిగా చూస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సమ్మిట్ విజయంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం కేసీఆర్‌కు ఇష్టం లేనట్లు ఆయన మాట లున్నాయని మంత్రి మండిపడ్డారు. ఈ సమ్మిట్ ద్వారా 5 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులకు సంబంధించి ఎంఓయూలు జరిగాయని, వీటిని కేసీఆర్ చాలా తేలికగా మాట్లాడటం తగదని శ్రీధర్ బాబు అన్నారు. 'కేసీఆర్ హయాంలోనూ అనేక ఒప్పందాలు జరిగాయి, కానీ అన్నీ కార్యరూపం దాల్చలేదు. మేము వాటి గురించి ఎప్పుడూ రచ్చ చేయలేదు. ఇప్పుడు మేము కుదుర్చుకున్న ప్రతి ఒప్పందాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు పక్కాగా మిగతా 2లో..

## రోడ్డెక్కిన రేకుర్తి

ఆపిన రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలి

తప్పుడు నివేదికలిచ్చిన అధికారులపై చర్యలు చేపట్టాలి • వందలాది మంది బాధితుల డిమాండ్

కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి) :కరీంనగర్ శివారులోని రేకుర్తి గ్రామంలో ఆగిన రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని వందలాది మంది బాధితులు రోడ్డెక్కారు. ఏండ్ల తరబడి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. ఈ మేరకు కరీంనగర్ కలెక్టర్ స్పందించి రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వివరాల్లోకెళ్తే.. రేకుర్తి శివారులోని భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు 1 నుంచి 230 వరకు ఉన్నాయి. ఈ మొత్తం సర్వే నెంబర్లు కలెక్టర్ ఆదేశాల మేరకు దాదాపు 6 నెలల నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. దీంతో గ్రామానికి సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్లు ఆగిపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ భూముల్లో ఇప్పటికే గ్రామస్తులు గ్రామ పంచాయతీ, పురపాలక సంఘం అనుమతులతో 80 శాతం ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. ఈ ఇండ్లకు ఇంటి పన్ను, అన్నిరకాల పన్నులు, గృహ రుణాలు కొన్ని మిగతా 2లో..





## రాష్ట్ర పరువు కాపాడండి

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేసీఆర్ మాట్లాడారు: హరీశ్‌రావు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర ప్రయోజనాల కోసం కోసమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆయన పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి సాధించిందని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మిగతా 2లో..

## భారత్-న్యూజిలాండ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది ఆర్థిక సంబంధాలు బలోపేతం చేసుకునే దిశగా, ఎగుమతిదారులకు మరింత మార్కెట్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నాయి. సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ ఫోన్‌లో సంభాషించుకున్న అనంతరం దీనిపై ప్రకటన చేశారు మార్చిలో న్యూజిలాండ్ ప్రధాని భారత పర్యటనకు వచ్చిన సమయంలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది నెలల్లోనే ఇది ఖరారవడంపై ఇరువురు నేతలు హర్షం వ్యక్తంచేశారు. దీనిపై మూడు నెలల్లో సంతకాలు చేసే అవకాశం ఉందని, వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రావొచ్చని భారత వాణిజ్య కార్యదర్శి వెల్లడించారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం వృద్ధి చెందుతోన్న తరుణంలో ఈ ఎఫ్‌టీఏ కుదిరింది. దీంతో న్యూజిలాండ్ కంపెనీలు తమ వస్తువులు, సేవలను భారత మార్కెట్‌లో విక్రయించుకోవడాన్ని సులభతరం చేయనుంది. ఆ దేశానికి చెందిన 95 శాతం ఎగుమతులపై సుంకాలు తగ్గనున్నాయి. దాంతో రానున్న రెండు దశాబ్దాల్లో భారత్‌కు తమ ఎగుమతుల విలువ పెరగనుందని, ఏటా 1.1 బిలియన్ డాలర్ల నుంచి 1.3 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశం ఉందని లక్సన్ పేర్కొన్నారు. "వాణిజ్యం పెరగడం అంటే మరిన్ని కివీ ఉద్యోగాలు, అధిక వేతనాలు, కష్టపడి పనిచేసే న్యూజిలాండ్ ప్రజలకు మరిన్ని అవకాశాలు" అని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. మిగతా 9లో..



నేషనల్ హెరాల్డ్ కేసు..

## సోనియా, రాహుల్‌కు నోటీసులు

బంగ్లాదేశ్‌లో ఆందోళనల వేళ

## మరో నేతపై కాల్పులు

నేషనల్ సిటిజన్ పార్టీకి చెందిన నేతపై గుర్తు తెలియని వ్యక్తుల ఘాతుకం

## మరోసారి విచారణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో రివ్యూ కమిటీలో ఉన్నవారిని మళ్లీ ప్రశ్నించిన సిట్

వివరాలు 2వ పేజీలో..

## ఆరోగ్యం, విద్య, ఉపాధి కల్పనే ప్రభుత్వ ఎజెండా

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించండి

డయాగ్నస్టిక్స్ విఫలమైతే వ్యవస్థ కుప్పకూలుతుంది : డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్(జనంసాక్షి): ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి సామాన్య జనుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా మా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందనీ, అదే మా ఎజెండా అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.సోమవారం బేగంపేటలోని హోటల్లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రెండవ శ్రేణి నగరాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో డయాగ్నస్టిక్స్ సెంటర్స్ ప్రారంభించాలని విజయ మెడికల్ సెంటర్ నిర్ణయించడం అభినందనీయం వారు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, అన్ని రకాల పరీక్షలను చేయాలని అందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. కొన్ని దశాబ్దాల క్రితమే లేజర్ వైద్యం ద్వారా మ్యాక్సీవిజన్ కాసు ప్రసాద్ రెడ్డి తన జ్ఞానాన్ని సమాజానికి ఇచ్చారు అని వివరించారు. సూర్యనారాయణ, ప్రసాద్ రెడ్డి, వేలు ముగ్గురు బాల్య స్నేహితులు కొన్ని దశాబ్దాల మిగతా 2లో..

స్టార్టప్ వీసా ప్రోగ్రామ్‌ను

## నిలిపేసిన కెనడా

ఆ స్థానంలో మరో కొత్త స్కీమ్‌ను తీసుకురానున్న ఆ దేశ ప్రభుత్వం

ఒట్టావా(జనంసాక్షి):స్టార్టప్ వీసా ప్రోగ్రామ్‌ను కెనడా నిలిపివేసింది ఆ స్థానంలో తమ దేశంలో వ్యాపారాలు ప్రారంభించే విదేశీయుల కోసం సరికొత్త స్కీమ్‌ను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2026లో పైలట్ ప్రాజెక్ట రూపంలో కొత్త స్కీమ్‌ను తీసుకురానున్నట్లు ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా అధికారులు వెల్లడించారు. కెనడాలోని వ్యాపార ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్‌లను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్న క్రమంలో స్టార్టప్ వీసా వర్క్ పర్మిట్ల దరఖాస్తులను నిలిపివేసినట్లు తెలిపారు. దీంతో ఇకపై మిగతా 2లో..



# రోడ్డెక్కిన రేకుర్తి

సంవత్సరాల నుంచి చెల్లించుకున్నారు. ఇంతకు ముందు కలెక్టర్ ఆదేశాలకు పూర్వం ఈ భూములన్నీ సబ్ రిజిస్ట్రార్ కరీంనగర్, గంగాధరలో రిజిస్ట్రేషన్లు కాబడ్డాయి. వాటన్నింటినీ అప్పటి ఎమ్మార్వో, ఆర్డీవోలు తమ పేర్ల మీద రెవెన్యూ రికార్డుల్లో జమాబందీ చేశారు. అకస్మాత్తుగా రిజిస్ట్రేషన్లు ఆగిపోవడం వల్ల గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. భూములు అమ్ముకోలేక చాలా పెండ్లీలు ఆగిపోయాయి. ఇలాగే కొనసాగితే చాలామంది ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని, కలెక్టర్ వెంటనే స్పందించి రేకుర్తిలో ఆపిన రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని కోరారు.. అదేవిధంగా 22ఏ కింద పెట్టిన పట్టా సర్వే నెంబర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో 19వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఏదుల్ల రాజశేఖర్, పాశం మోహన్ రెడ్డి, జాడి బాల్‌రెడ్డి, ఎంఎ రహీం, అందె శ్యాంసుందర్, ఆకుల కృష్ణ, టైగర్ శ్రీనన్న, బాయిల్ వర్మ, రవీందర్, నరేందర్, డి రవీందర్, కొలిపాక శ్రీనివాస్, గొల్లె తిరుపతి, రేకుర్తి గ్రామ ప్రజలు, దాదాపు 200 మంది బాధితులతో పాటు వినేశ్, కార్తిక్, రాజగోపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఈరవేణి అంజయ్య, వడ్ల అంజయ్య, మూడావపు శ్రీనివాస్, రవీంద్రాచారి, అజిత్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసు..

### సోనియా, రాహుల్‌కు నోటీసులు

**ఢిల్లీ(జనంసాక్షి):** నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ,రాహుల్ గాంధీలకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈడీ ఛార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకునేందుకు ట్రయల్ కోర్టు నిరాకరించింది. దీంతో ట్రయల్ కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో ఈడీ అప్పీల్ చేసింది. ఈ నేపథ్యంలో ఈడీ అప్పీలుపై స్పందన కోరుతూ సోనియా, రాహుల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపే ఏజెఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ. 90కోట్ల రుణం అందించింది. అందుకు బదులుగా ఏజెఎల్ కంపెనీ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకుంది. అయితే ఈవ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు మోతీలాల్ వోరా, అస్కార్ ఫెర్నాండేజ్, సుమన్ దుబే తదితరులు మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తుంది. ఏజెఎల్ కంపెనీ ఆస్తులను స్వాధీనం చేసుకున్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు ప్రధాన వాటాదారులు. ఈ సంస్థ కేవలం రూ. 50 లక్షలు చెల్లించి ఏజెఎల్‌కు చెందిన సూమారు. రూ. రెండువేల కోట్ల విలువైన ఆస్తులు పొందారని ఈడీ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. నేషనల్ హెరాల్డ్ పత్రికను 1938లో భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూతో పాటు ఇతర స్వాతంత్ర సమర యోధులు ప్రారంభించారు. దీని నిర్వాహణ బాధ్యతలు సంస్థ చూసుకునేది. ఈ పత్రికకు ఢిల్లీ, ముంబై, లక్నో వంటి నగరాల్లో ఆస్తులు ఉన్నాయి. కాగా ఆస్తుల బదిలీ విధానంలో అక్రమాలు జరిగాయని ఈడీ ఆరోపిస్తుంది. "గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధుల కరదీపిక" ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు. పంచాయతీరాజ్ చట్టం-2018, గ్రామపంచాయతీల విధులు, బాధ్యతలకు సంబంధించి సమగ్ర సమాచారంతో 292 పేజీల పుస్తకాన్ని రూపొందించిన తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ. గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు ఈ కరదీపికను అందించనున్న ప్రభుత్వం.

## బంగ్లాదేశ్‌లో ఆందోళనల వేళ మరో నేతపై కాల్పులు

### నేషనల్ సిటిజన్ పార్టీకి చెందిన నేతపై గుర్తు తెలియని వ్యక్తుల ఘాతుకం






**ఢాకా(జనంసాక్షి):**తీవ్ర నిరసనలు, అ శాంతితో భగ్గుమంటున్న బంగ్లాదేశ్‌లో మరోసారి కాల్పుల కలకలం రేగింది. నేషనల్ సిటిజన్ పార్టీకి చెందిన నేతపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. దీంతో ఆయనను వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. బంగ్లాదేశ్ ప్రస్తుతం నిరసనలతో అట్టుడుకుతుంది. కొద్దిరోజుల క్రితం ఆదేశానికి చెందిన రాడికల్ నేత ఉస్మాన్ హాదీ మరణం ఆ దేశంలో తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి. ఉస్మాన్ మృతితో ఆయన మద్దతుదారులు చెలరేగిపోయారు. ఢాకాలో మీడియా హౌజ్‌లపై దాడి చేస్తూ విధ్వంసం సృష్టించారు. అంతే కాకుండా దైవదూషణ చేశారనే నెపంతో ఓ హిందూ యువకుడిని అత్యంత దారుణంగా కొట్టిచంపారు. ఈ ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇదిలా ఉండగా ఈరోజు ఉదయం ఆదేశంలో నేషనల్ సిటిజన్ పార్టీకి చెందిన మహమ్మద్ మోతేలాబ్ సికిదార్ అనే నాయకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. దీంతో ఆయనను హుటాహుటీన దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు.

# మంత్రులంతా కష్టపడి వుంటే.. మరిన్ని మెరుగైన ఫలితాలొచ్చేవి

చూడాలని మంత్రులు, ఎమ్మెల్యేలను ఆదేశించిన సీఎం.. 42 శాతం రిజర్వేషన్ అమలుపైనా వారితో మంతనాలు జరిపినట్టు తెలుస్తోంది.

**ఎక్కడెక్కడ ఎలా ఉంది?**

ఇతర పార్టీలు బలపరిచిన అభ్యర్థుల ఫలితాలపై సీఎం రేవంత్ విశ్లేషించారట. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాలవారీగా ఫలితాలు ఎలా వచ్చాయనే దానిపై సమగ్రంగా చర్చించినట్టు తెలిసింది. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి వాటి వివరాలు కూడా సీఎం అడిగినట్టు





వినబడుతోంది. తన ఇలాకా కొడంగల్‌లో కాంగ్రెస్ దాదాపు 80శాతం గెలుపు బావుట ఎగురవేయడం పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని సీఎం భావిస్తున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సహా మున్సిపల్ ఎన్నికల్లోనూ మరింత చురుగ్గా కాంగ్రెస్ సైన్యం కదలాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో సీఎం ఆదేశించినట్టు తెలిసింది. పార్టీకి నష్టం చేసినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.

# ప్రాజెక్టులు పూర్తి చేయకుండా మిమ్మల్ని ఎవరడ్డుకున్నారు?

పర్యావరణ అనుమతులు పూర్తిగా రాలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రూ.5 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే పాలమూరు ప్రజలకు అన్యాయం చేశారని ఉత్తమ్ విమర్శించారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ చెప్పేవన్నీ అసత్యాలేనని విమర్శించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టారని.. అయిన 90 శాతం పనులు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.5 వేల కోట్లు పెండింగ్ బిల్లులు పెట్టిందని ఆరోపించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ రాలేదని చెప్పుకొచ్చారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయకుండా మహబూబ్‌నగర్ ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు సోమవారంపెద్దపల్లి జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించారు. ఈ సందర్భంగా గుంపుల, అడవి సోమనపల్లి గ్రామాల్లో కూలిపోయిన చెక్ డ్యాంలను పరిశీలించారు. ఈ ఘటనపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంపుల, అడవి సోమనిపల్లి గ్రామాల్లో కూలిపోయిన చెక్ డ్యాంలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామని తెలిపారు. ఈ పనులను నాసిరకంగా, నాణ్యతలేమితో నిర్మించినా లేదా ఎవరైనా కావాలనే ధ్వంసం చేసినట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని తమ ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని అన్నారు. ఈ విచారణను వేగవంతం చేసి బాధ్యులను గుర్తించాలని ఇప్పటికే విజిలెన్స్ అధికారులను ఆదేశించామని అన్నారు. రైతన్నలకు మేలు చేసే చెక్ డ్యాంలను ఎవరైనా కావాలని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే ఊపేక్షించబోమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. 'నీటి వాటాలో 71 శాతం మాకు 29శాతం ఏపీకి ఇవ్వాలని మేము పోరాడుతున్నాం. 17 జనవరి 2024, ఫిబ్రవరిలో కేఆర్ఎంబీకి లేఖ ఇచ్చాం. ఇరిగేషన్ కాంట్రాక్టర్ల లిస్ట్ తీయండి. కేసీఆర్ హయంలో లాగా ఏపీ కాంట్రాక్టర్లకు మేము ఇచ్చామా..? హరీశ్‌రావు పేరు మార్చుకుని గోబెల్స్ అని పెట్టుకోవాలి. కాళేశ్వరం విషయంలో పదే పదే అసత్యాలు మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు సిగ్గుతో తలవంచుకోవాలి. తెలంగాణ ప్రజల తలను తాకట్టు పెట్టి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్. కాళేశ్వరం నుంచి గత ఐదేళ్లలో 70 టీఎంసీల నీళ్లను మాత్రమే ఉపయోగించారు. హరీశ్‌రావు అతి తెలివితేటలు వాడటం ప్రజలు గమనిస్తున్నారు. కృష్ణా జలాల విషయంలో 2014 నుంచి 2020 వరకు జరిగిన అపెక్స్ కౌన్సిల్ భేటీల్లో కేసీఆర్ సంతకాలు పెట్టారని పస్తావించారు.

## రాష్ట్ర పరువు కాపాడండి: హరీశ్

హరీశ్ మాట్లాడారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. "బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అద్భుత ఆర్థిక ప్రగతి సాధించింది. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా కేసీఆర్ నిలిపారు. మూడురెట్ల జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పెరిగింది. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక అరాచకత్వం జరిగిందని రేవంత్ ఆరోపించారు. రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయొద్దని కోరుతున్నా. సొంత పార్టీ నేతలనే తొక్కుకుంటూ పెరిగినట్లు ఆయన స్వయంగా చెప్పారు. రూ.50కోట్లు పెట్టి రేవంత్ పీసీసీ పదవిని కొనుగోలు చేసినట్లు గతంలో కోమటిరెడ్డి చెప్పారు. నిజాయతీగా, త్యాగాల పునాదులపై ఎదిగిన నాయకత్వం మాది. ఎమ్మెల్యే, మంత్రి పదవులను గడ్డిపోచల్లా త్యాగాలు చేసిన చరిత్ర మా పార్టీ నేతలది" అని హరీశ్‌రావు అన్నారు.



## ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 21న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోమ్ నిర్వహించారు. ఆరు రోజుల శీతాకాల విడిది ముగించుకున్న రాష్ట్రపతి.. తాజాగా ప్రత్యేక విమానంలో ఢిల్లీ పయనమయ్యారు. ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర కిషన్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

## స్టార్టప్ వీసా ప్రోగ్రామ్‌ను నిలిపేసిన కెనడా

స్టార్టప్ వీసా ప్రోగ్రామ్‌లో వర్క్ పర్మిట్ కోసం చేసుకునే దరఖాస్తులను అంగీక రించబోమని ఐఆర్‌సీసీ ప్రకటించింది. అయితే ఈ వీసా ప్రోగ్రామ్ కింద ఇప్పటికే వర్క్ పర్మిట్ పొందినవారు దానిని పొడిగించుకోవడానికి చేసుకున్న దరఖాస్తులకు మినహాయింపు ఉంటుందని తెలిపింది. తాము తీసుకువచ్చే కొత్త ప్రోగ్రామ్ కెనడా దీర్ఘకాలిక ఇమిగ్రేషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని.. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. అయితే రెండు ప్రోగ్రామ్‌లకు ఉన్న తేడా ఏంటనే విషయాన్ని వెల్లడించలేదు. కొత్త స్టార్టప్ వీసా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను 2026లో వెల్లడిస్తామని పేర్కొంది.

## మరోసారి విచారణ

**హైదరాబాద్(జనంసాక్షి):** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రివ్యూ కమిటీలో ఉన్న వారిని సిట్ మరోసారి విచారించింది. ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్ చేసిన సమయంలో రివ్యూ కమిటీలో ఉన్న జీఏడీ సెక్రెటరీ, సీఎస్, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను మరోసారి ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్, ఐపీఎస్ అధికారి నవీన్ చంద్‌కు సైతం నోటీసులు ఇచ్చి సిట్ విచారించింది. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్ ఎదుట ప్రభాకర్‌రావును ఉంచి వివరాలడిగింది. రెండోసారి నవీన్ వద్దకు వెళ్లి ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి, అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్ స్టేట్‌మెంట్ కూడా మరోసారి రికార్డు చేసిన సిట్.. ఈ కేసులో అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తోంది.

యూనస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి

## బంగ్లాలో హింస పెరిగిపోయింది

### మారణహోమం ఆపడానికే దేశం వీడా.. భయపడి కాదు: షేక్ హసీనా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న ఉద్రిక్తతలపై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా స్పందించారు. గతేడాది దేశంలో జరిగిన మారణహోమాన్ని ఆపడానికే తాను దేశం వీడి భారత్‌కు వచ్చానని.. భయపడి కాదని అన్నారు. అయినప్పటికీ ఆ దేశంలో ఉద్రిక్తతలు చల్లారట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యూనస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో హింస పెరిగిపోయిందని.. ప్రభుత్వం బలహీనంగా మారిపోయిందని విమర్శించారు. అక్కడ చట్టాలు ఏవీ అమల్లో లేవని.. దేశంలో పాలన సరిగ్గా లేకపోతే అంతర్జాతీయంగా బంగ్లాదేశ్ పేరు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లర్లలో 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్ అనే మైనారిటీ యువకుడిని ఆందోళనకారులు దారుణంగా కొట్టి చంపి, నిప్పంటించడంపై హసీనా ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మైనారిటీల భద్రతను కాపాడడంలో తాత్కాలిక ప్రభుత్వం విఫలమయ్యిందని ఈ ఘటనతో స్పష్టమయ్యిందన్నారు. యూనస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భారత్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని.. కానీ పైకి మాత్రం భారత్‌తో స్నేహం కోరుకుంటున్నట్లు బూటకపు మాటలు చెబుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటువంటి ఎన్ని తాత్కాలిక ప్రభుత్వాలు వచ్చినా భారత్-బంగ్లా మధ్య ఉన్న బంధాన్ని బలహీనపరచలేవన్నారు. యూనస్‌కు అండగా ఉన్న తీవ్రవాదులు దేశ ప్రజల మధ్య వైరాన్ని సృష్టిస్తున్నారని.. వారే తన కుటుంబాన్ని, తనను ప్రాణాల కోసం పారిపోయేలా చేశారని హసీనా ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం దౌత్య కార్యకలాపాలను రక్షిస్తుందని.. వాటిని దెబ్బతీసే వారిపై చర్యలు తీసుకుంటుందన్నారు. కానీ అందుకు భిన్నంగా యూనస్ ప్రభుత్వం గూండాలకు మద్దతిస్తూ.. వారిని దేశ భక్తులుగా అభివర్ణిస్తోందని మండిపడ్డారు. తమ ప్రభుత్వ పాలనలో తీవ్రవాదులుగా గుర్తించి జైల్లో పెట్టినవారిని యూనస్ ప్రభుత్వం విడుదల చేసి, ప్రజా జీవితంలోకి అనుమతించిందని.. అందువల్లే బంగ్లాలో అల్లర్లు తీవ్రమవుతున్నాయన్నారు.

# వార్డుల విభజనలో మేం జోక్యం చేసుకోలేం

సంగతి తెలిసిందే. జీహెచ్ఎంసీడివిజన్ల పునర్విభజనను సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానంలో 80కి పైగా పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఎంసీహెచ్ఆర్‌డీలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమర్పించిన నివేదిక ఆధారంగా వార్డుల పునర్విభజన చేశామని ప్రభుత్వం చెబుతున్నా ఆ నివేదికను ఇంతవరకు బయటపెట్టలేదని, అభ్యంతరాల స్వీకరణకు తగినంత గడువు ఇవ్వలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. భౌగోళికంగా, జనాభాపరంగా పునర్విభజన జరగలేదని ధర్మాసనం వద్ద విన్నవించారు. చట్టపరిధిలోనే డీలిమిటేషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ప్రభుత్వం తరఫు న్యాయవాది గత బుధవారమే కోర్టుకు వివరించారు. దానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచామని, ఇప్పటివరకు అందిన 3,100 అభ్యంతరాలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రక్రియ ముగిసినందున దీంట్లో కల్పించుకోలేమంటూ హైకోర్టు పిటిషన్లను కొట్టివేసింది. జీహెచ్ఎంసీని దేశంలోనే అతి పెద్ద నగరంగా చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. గ్రేటర్ రూపురేఖలు మార్చాలనే సంకల్పంతో రాష్ట్ర సర్కారు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 27 నగర, పురపాలక సంస్థల విలీనం చేయాలని నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనికోసం మంత్రివర్గంలో చర్చించి శ్రీకారం చుట్టింది. విలీన ప్రక్రియ కోసం పురపాలక, జీహెచ్ఎంసీ చట్టాల సవరణ కూడా చేసింది. దీని ద్వారా గ్రేటర్‌లో కొత్తగా కలిపే ప్రాంతాల అభివృద్ధితో పాటు అక్కడి ప్రజలపై ఆస్తిపన్ను, భవన నిర్మాణ అనుమతుల ఫీజులు, ట్రేడ్ లైసెన్స్, ఇతర ఫీజుల భారం పడే అవకాశాలు ఉన్నాయి. అంతేకాదు మహానగరంలో రాజకీయ ముఖచిత్రం కూడా మారబోతుంది. గ్రేటర్‌లో శివారులోని పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేయాలన్న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపడంతో జీహెచ్ఎంసీ విస్తరణ ప్రక్రియ పూర్తయిన విషయం తెలిసిందే. దీంతో మొత్తం 27 స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను సైతం విడుదల చేసింది. డిసెంబరు 3వ తేదీ నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. విలీనమైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రికార్డులను స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ఈ బాధ్యతను మున్సిపల్? శాఖ డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు అప్పగించింది. పాత జీహెచ్ఎంసీ విస్తీర్ణం 650 చదరపు కిలో మీటర్లు. శివారులోని 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్‌లో విలీనం చేయడంతో ప్రస్తుత విస్తీర్ణం 2053 చదరపు కిలో మీటర్లకు పెరిగింది. ఇంత పెద్ద నగరాన్ని ఒకే గొడుగు కింద పాలించడం సాధ్యమా? అనే ప్రశ్నలు కూడా ప్రభుత్వం ముందున్నాయి. విశాల నగరాన్ని ఒకటిగా ఉంచాలా? రెండు లేదా మూడు నగరపాలక సంస్థలుగా విభజించాలా? అని ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. వాటిపై స్పష్టత వచ్చే వరకు ప్రస్తుత గ్రేటర్ హైదరాబాద్‌ను కొన్నాళ్లపాటు యథాతథంగా నడిపించాలని నిర్ణయం తీసుకుంది. వచ్చే ఎన్నికల్లోపే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన సైతం జరిగే అవకాశాలు ఉన్నాయి.

## గ్లోబల్ సమ్మిట్‌తో పెరిగిన తెలంగాణ ప్రతిష్ట

ఫాలో-అప్ చేస్తున్నాం' అని స్పష్టం చేశారు. ఈ పెట్టుబడుల ద్వారా 1.40 లక్షల మందికి ప్రత్యక్షంగా, మరో 2 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ త్వరలోనే ప్రపంచానికే 'జీసీసీ క్యాపిటల్' కాబోతోందని మంత్రి ప్రకటించారు. గడిచిన ఏడాది కాలంలోనే 75 అంతర్జాతీయ స్థాయి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను రాష్ట్రానికి తీసుకువచ్చామని వెల్లడించారు. ఐటీ, ఏరోస్పేస్, వ్యాక్సిన్ తయారీ రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ప్రపంచానికి అవసరమైన మూడు వంతుల వ్యాక్సిన్లు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతున్నాయని గుర్తుచేశారు. వ్యాపార సంస్కరణల అమలులో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ అవార్డు అందుకోవడం మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ బీఆర్ఎస్ పేటెంట్ అని చెప్పుకోవడంపై మంత్రి స్పందిస్తూ.. రక్షణ రంగంలో అలాగే ఐటీ , మ్యానిఫ్యాక్చరింగ్ రంగాలకు పునాది వేసింది కాంగ్రెస్ పార్టీయే. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు అసంపూర్తిగా ఉంటే, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సందర్శించి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించారు. పీఎం మిత్ర పథకం కింద కేంద్రం నుండి 30 కోట్ల నిధులు తెచ్చింది మేమని వివరించారు. మీరు హైప్ లో ఉన్నారు.. మేము ప్రజల్లో హోప్ క్రియేట్ చేస్తున్నాం అన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న 'గేట్ పాస్' కల్చర్‌ను రద్దు చేశామని, అందరినీ కలుపుకుని పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. కేవలం పరిశ్రమలు తేవడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి దక్కేలా ఐటీఐ లను ఏటీసీ లుగా మార్చామని మంత్రి తెలిపారు. ఎంఎస్ఎంఈల కోసం కొత్త పాలసీని తీసుకువచ్చామని, పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని నింపుతూ కక్షసాధింపులు లేని పాలనను అందిస్తున్నామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రాబోయే మూడేళ్లలో మరిన్ని భారీ పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ పారిశ్రామిక రాష్ట్రంగా నిలబెడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## 'ఆపరేషన్ సిందూర్' నుంచి పాక్‌ను కాపాడింది దైవిక సాయమే..

- దాన్ని మేం అనుభూతి చెందాం
- పాక్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఆసిమ్ మునీర్

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌కు గట్టి దెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. నాటి పరిణామాలకు సంబంధించి ఇటీవల పాక్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆ సమయంలో 'దైవిక సాయమే' తమ దేశాన్ని కాపాడిందంటూ మునీర్ వ్యాఖ్యానించారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో జరిగిన నేషనల్ ఉలెమా కాన్ఫరెన్స్‌లో ఆసిమ్ మునీర్ పాల్గొన్నారు. ఇందులో ఆయన చేసిన ప్రసంగానికి సంబంధించిన వీడియోలు తాజాగా వైరల్ అయ్యాయి. "భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్ ఘోరంగా దెబ్బతిన్న సమయంలో సాయుధ దళాలకు దైవిక సాయం అందింది. దాన్ని మేం ఫీల్ అయ్యాం" అని మునీర్ అన్నట్లుగా ఆ వీడియోలో ఉంది. ఆ కార్యక్రమంలో అఫ్గాన్‌తో ఘర్షణల గురించి కూడా మునీర్ మాట్లాడారు. "పాకిస్థాన్ చిన్నారుల రక్తాన్ని అఫ్గాన్ కళ్ల జూస్తోంది. మన దేశంలో పుట్టుకొస్తున్న తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ ముఠాల్లో 70శాతం అఫ్గాన్ పౌరులే ఉంటున్నారు. తాలిబన్ ప్రభుత్వం ఇకనైనా ఈ సీమాంతర ఉగ్ర దాడులను ప్రోత్సహించడం మానుకోవాలి" అంటూ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన భీకర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా మే 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్'తో భీకర దాడులు చేసింది.

## ఆరోగ్యం, విద్య, ఉపాధి కల్పనే ప్రజాప్రభుత్వం ఎజెండా

పాటు కలిసి ఉండటమే కాదు విజయవంతంగా వ్యాపారం నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థలో కీలకమైన తొలి రక్షణ అడుగును బలోపేతం చేసే ప్రయత్నమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. డయాగ్నోస్టిక్స్ సక్రమంగా పనిచేస్తే ఎలాంటి హడావిడి ఉండదని, కానీ అవి విఫలమైతే మొత్తం వ్యవస్థే కూలిపోతుందని అన్నారు. 2023 డిసెంబర్‌లో తమ ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రజలు ఆర్భాటం కోరలేదని, భరోసానే కోరారని తెలిపారు. ఆరోగ్యం లేకుండా గౌరవం ఉండదని, గౌరవం లేకుండా నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజా ఆరోగ్యాన్ని మౌలిక అంశంగా తీసుకుని ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వెలుపల ప్రాంతాల్లో నాణ్యమైన డయాగ్నోస్టిక్ సదుపాయాల విస్తరణ కీలకమన్నారు. డయాగ్నోస్టిక్స్ ఆరోగ్యం-వ్యాధి మధ్య, నివారణ%-%చికిత్స మధ్య కీలకంగా ఉంటాయని పేర్కొన్నారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి జిల్లాలకు అధునాతన డయాగ్నోస్టిక్ సదుపాయాలు చేరితే ప్రజలపై పడే ఆర్థిక, మానసిక భారం తగ్గుతుందని అన్నారు. ఆరోగ్య రంగంలో దూరం అనేది కేవలం కిలోమీటర్లలో కాదు, ఆందోళన, ఆలస్యం, ఖర్చుల రూపంలో ఉంటుందన్నారు. ఆధునిక వైద్యం ప్రారంభ దశలో వ్యాధి గుర్తింపుపై ఆధారపడి ఉంటుందని, విశ్వసనీయమైన డేటా లేకుండా ప్రజా ఆరోగ్య ప్రణాళికలు సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యం కొందరికే పరిమితమైన హక్కు కాదని, ప్రజా సంపదగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. వ్యాధిని చికిత్స చేయడమే కాదు, ముందే అంచనా వేసే దిశగా ప్రభుత్వ విధానం ఉందన్నారు. న్యూబర్గ్ డయాగ్నోస్టిక్స్, విజయా మెడికల్ సెంటర్‌ల విస్తరణకు డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. ఖచ్చితత్వం, నైతికత, సానుభూతితో తెలంగాణ ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేసే ప్రతి ప్రయత్నానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## సామాన్యులను దోచుకునే ఏ అవకాశాన్ని మోదీ వదలట్లేదు: ఖర్గే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రైల్వే ఛార్జీలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను దోచుకోవడానికి ఏ చిన్న అవకాశాన్ని కూడా వదలడం లేదని ఆరోపించారు. భారతీయ రైల్వే ప్రస్తుతం నిర్లక్ష్యం, ఉదాసీనత, నకిలీ ప్రచారాలకు అడ్డాగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌కు కొద్ది రోజుల ముందు ఛార్జీలు పెంచడం దారుణమని, ఇది ఏడాదిలో రెండోసారి చేసిన పెంపు అని గుర్తు చేశారు. రైల్వేకు ప్రత్యేక బడ్జెట్ రద్దు చేసినప్పటి నుంచి జవాబుదారీతనం పూర్తిగా నశించిందని ఖర్గే విమర్శించారు. రైల్వే భద్రతపైనా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. రైలు ప్రయాణం ఇప్పుడు సురక్షితం కాదని, అది ప్రాణాలతో చేసే జూదంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, 2014 నుంచి 2023 మధ్య కాలంలో రైలు ప్రమాదాల్లో ఏకంగా 2.18 లక్షల మంది మరణించారని గుర్తు చేశారు. 'కవచ్' భద్రతా వ్యవస్థ గురించి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, కానీ ఆచరణలో అది శూన్యమని విమర్శించారు. ఐదేళ్లుగా ప్రచారం చేస్తున్నా, కేవలం 3 శాతం రూట్లలో, 1 శాతం రైళ్లలో మాత్రమే కవచ్ అందుబాటులో ఉందని తెలిపారు.

# పోలీస్ బందోబస్త్ నడుమ దామరువంచలో ప్రమాణ స్వీకారం



గూడూరు, డిసెంబర్22 (జనంసాక్షి): ఎట్టకేలకు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నునుప సుజాత పోలీసుల బందోబస్తు మధ్య ప్రమాణ స్వీకారం చేశారు. దామరవంచ గ్రామ సర్పంచ్‌గా టిఆర్ఎస్ పార్టీకి చెందిన నునావత్ స్వాతి మొదట మూడు ఓట్లతో గెలిచిందని రిటర్నింగ్ ఆఫీసర్ విజయ ఇచ్చిందని మరల అధికార పార్టీ కాంగ్రెస్ బలవంతంతో మళ్లీ రీ కౌంటింగ్ చేపించి సనుప సుజాతను సర్పంచ్ గా ఎన్నిక చేస్తూ ధ్రువపత్రాన్ని ఇవ్వడం జరిగింది. అయితే ఈ విషయంలో రిటర్నింగ్ ఆఫీసర్ విజయ తాను టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన స్వాతికి ఎటువంటి సర్పంచ్ ఎన్నిక ధ్రువపత్రాన్ని ఇవ్వలేదని దానిని ఫోర్జరీ చేశారంటూ గూడూరు పోలీస్ స్టేషన్లో ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో టిఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపడుతారని ఉద్దేశంతో ముందస్తుగా పోలీసులు స్వాతిని పిలిపించి ఏదైనా ఉంటే కోర్టులో సమస్యను పరిష్కరించుకోవాలని ప్రమాణస్వీకారానికి ఎలాంటి ఆటంకాలు కలిగించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళన చేపడుతారనే నేపథ్యంలో పోలీసుల బందోబస్తు మధ్య కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ సనుప సుజాత తో పాటు ఉప సర్పంచ్, 4గురు వార్డ్ సభ్యులు,టిఆర్ఎస్ పార్టీకి చెందిన 5గురు వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఏలాంటి సంఘటనలు జరగకుండా గూడూరు సీఐ సూర్య ప్రకాష్,ఎస్ఐ గిరిధర్ రెడ్డి పోలీస్ బందోబస్త్ ను ఏర్పాటు చేశారు.

## నాడు చర్లపల్లి జీవిత ఖైదీ
# నేడు అంజనాపల్లి గ్రామ సర్పంచ్

- అదృష్టం వరించిన కందుల వెంకటేశ్వర్లు



కుషాయిగూడ డిసెంబర్ 22 (జనంసాక్షి) : తెలిసో తెలియకో క్షణికావేశం లో నేరాలకు పాల్పడి జైలుకు వస్తే జైలు సత్ప్రవర్తన కైదిగా తీర్చిదిద్ది బాహ్య ప్రపంచానికి తిరిగి పంపించేసింది ఆ ఖైదీ విడుదలైనప్పటి నుంచి సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉంటూనే రేషన్ డీలర్గా పనిచేస్తూ మళ్లీ మళ్లీ సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించి పదిమందికి మార్గదర్శకంగా నిలిచారు ఆ వ్యక్తి నేడు గ్రామ సర్పంచిగా 98 ఓట్లతో గెలుపొంది ప్రజల ఆదరభిమానాలు చెరుగొన్నాడు రిజర్వేషన్ కలసి రావడం మీద 98 ఓట్లతో గెలిచి అంజనపల్లికి గ్రామ సర్పంచిగా గెలుపొందారు వివరాల్లోకి వెళితే నల్గొండ జిల్లా త్రిపురాము మండలం అంజనా పల్లి గ్రామ సర్పంచ్ గా విజయ్ కేతనం ఎగురవేశారు కందుల వెంకటేశ్వర్లు. 2003లో ఓ హత్య కేసులో చర్లపల్లి జైలుకు జీవిత ఖైదీగా వచ్చారు జీవిత ఖైదీగా ఉంటూనే జైల్ అధికారుల ఆదర అభిమానాలు పొంది. చురగొని 2011లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి క్షమాభిక్ష ప్రసాదించడంతో జైలు నుండి కందుల వెంకటేశ్వర్లు విడుదలయ్యారు అప్పటినుండి నల్గొండ జిల్లాలో ఉంటూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉంటూ కుటుంబానికి పెద్దదిక్కయ్యారు సర్పంచ్ ఎన్నికల్లో రిజర్వేషన్ కలిసి రావడంతో సర్పంచిగా నిలిచారు 98 ఓట్లతో గెలిచి విజయ్ కేతనం ఎగురవేశారు నాడు చర్లపల్లి జైల్లో జీవిత ఖైదీగా ఉండే కందుల వెంకటేశ్వర్లు నేడు సర్పంచిగా గెల్పొందడంపై తోటి ఖైదీలు చర్చించుకోవడం కోసమెరుపు.

# హైదరాబాద్ బుక్‌ఫెయిర్ నూతన కమిటీ ఆరోపణలన్నీ అబద్ధాలే..

- బుక్‌ఫెయిర్ పూర్వ కార్యదర్శి కోయ చంద్రమోహన్, పూర్వ కోశాధికారి పీ రాజేశ్వర్‌రావు




హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ బుక్‌ఫెయిర్ పాత కమిటీ బాధ్యులపై ప్రస్తుత కమిటీ చేసిన ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని, కక్షపూరితంగా బుక్‌ఫెయిర్‌పై పెత్తనం కోసమే దిగజారి ఆరోపణలుచేస్తున్నారని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ పూర్వ కార్యదర్శి, పూర్వ కోశాధికారి ఘాటుగా విమర్శించారు. బుక్‌ఫెయిర్ పూర్వ కార్యదర్శి కోయ చంద్రమోహన్, పూర్వ కోశాధికారి పీ రాజేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. 'సొసైటీ నిబంధనల ప్రకారం, ఎన్నికలకు వెళ్లే ముందు అకౌంట్స్ ఆమోదమనేది తప్పనిసరి. గత పదేళ్లలో జనరల్ బాడీ సమావేశాలు, ఎన్నికలు జరిగాయి. జనరల్ బాడీ సమావేశాలో-ఆడిటర్ ఇచ్చిన ఆర్థికలావాదేవీల ఆమోదం తర్వాతనే ఎన్నికలు జరుగుతాయనేది తెలియదా?'' అని కొత్త కమిటీ సభ్యులనుద్దేశించి కోయ చంద్రమోహన్ ప్రశ్నించారు. పూర్వ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, కోయ చంద్రమోహన్, పీ రాజేశ్వరరావు, శృతికాంత్ భారతీలపై దుష్ప్రచారం చేయడం సరైంది కాదనిబీ ప్రస్తుత బుక్‌ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, ఉపాధ్యాక్షులు బాల్‌రెడ్డి, కార్యదర్శి వాసు చేసిన ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవమేనని కొట్టిపారేశారు. 'గతంలోనే పూర్వ కార్యదర్శి శృతికాంత్ భారతిని నెట్టారనే కారణంతో బాల్‌రెడ్డిపై పాత కమిటీ చర్యకు దిగింది. దీనిని మనసులో పెట్టుకోని వ్యక్తిగతకక్షలకు దిగుతున్నారు. ఇందులో భాగమే ఈ అసత్య- అసంబద్ధ ప్రచారాలు, స్టాల్ కేటాయించకుండా పొట్టకొట్టడం కూడా' అని అన్నారు. బుక్‌ఫెయిర్ పెత్తనమంతా తమ చేతులోనే ఉండాలనే దురుద్దేశంతో గోబెల్స్ ప్రచారం చేస్తూ దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. కేవలం కక్షపూరితంగా వ్యవహరించి తనకు స్టాల్ కేటాయించకపోగా, వివిధ ఆరోపణలు చేస్తూ వ్యక్తిత్వహననానికి దిగుతున్నారని కోయ చంద్రమోహన్ తీవ్ర ఆవేదనను వ్యక్తంచేశారు. 'నేను 2022లోనే కార్యదర్శి బాధ్యతల నుంచి వైదొలిగి, అప్పటి నూతన కార్యదర్శి శృతికాంత్ భారతికి అన్ని పత్రాలను అందించాను. కార్యదర్శి పదవికాలం ముగియగానే, వాసు బాధ్యతలను స్వీకరించారు. అయితే ఆ తర్వాత రిలీవయిన కార్యదర్శికి ఎటువంటి సమాచారమివ్వకుండానే ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఉన్నటువంటి పాత బుక్‌ఫెయిర్ కార్యాలయంలోని బీరువా, సామాగ్రి తీసుకెళ్లారు' అని గుర్తుచేశారు.

### ఆధారాలతోసహా పూర్వ కోశాధికారి పీ రాజేశ్వర్ రావు వివరణ

తాము తీసుకున్న ప్రతీ నిర్ణయం కమిటీలో ఆమోదించిన తర్వాతనే అమలు చేశామని పీ రాజేశ్వర్ రావు తెలియజేశారు. సంస్థకు కరెంట్ అకౌంట్ ఉండాలి కాబట్టి, నిబంధనలకు అనుగుణంగానే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)లో కరెంట్ అకౌంట్‌ను తెరిచినట్టుగా వెల్లడించారు. అలాగే ప్రత్యేకించి జీఎస్టీ పేమెంట్స్ కోసం ఐసీఐసీఐలో అకౌంట్ తీశామని, ఇవన్నీ కూడా ఆడిట్‌లో పొందుపరిచి ఉన్నాయని రాజేశ్వర్ రావు పేర్కొన్నారు. '2018లో కన్వెన్షన్ సెంటర్‌కు డబ్బులు చెల్లించారనే సుద్ద అబద్ధం. అది అన్నపూర్ణ గార్డెన్స్ అనే కంపెనీకు స్టాల్ నిర్మాణం రీత్యా చెక్కు రూపంలోనే చెల్లించినది. ఇది కూడా ఆడిట్‌లో పొందుపరచబడింది' అని రాజేశ్వర్‌రావు చెప్పారు. వాళ్లే గోబెల్స్ ప్రచారం చేస్తూ తామే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, ఇది పూర్తిగా తప్పుదారి పట్టించే చర్యని అన్నారు. ఇందులో భాగంగానే 2017-2018 ఆర్థిక సంవత్సరం- జిల్లాలలో ప్రభుత్వ సహకారంతో జరిగిన పుస్తక ప్రదర్శనలకు బ్యాంక్‌లో డబ్బులు జమ కాలేదని మరొక గోబెల్స్ ప్రచారంలో భాగమన్నారు. '2017-2018లో టీడీఎస్ కట్ కాగా మొత్తం బ్యాంక్ అకౌంట్లో జమైనది(వరంగల్- 4,98,190, మహబూబ్ నగర్ - 4,27,000, కామారెడ్డి - 2,45,000, సిద్ధిపేట-3,12,000). ప్రతీదీను అడిట్ రిపోర్ట్స్‌లో పొందుపరచబడింది'' అని కోశాధికారి రాజేశ్వరరావు తెలియజేశారు.

# జిరామ్‌జీ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాం

- నూతన చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతాం
- అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కారు చౌకగా కూలీలను సరఫరా చేసేందుకు నూతన చట్టం
- ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది
- గాంధీ భవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి కొప్పుల రాజు రాజుతో కలిసి మీడియా సమావేశంలో మంత్రి సీతక్క




హైదరాబాద్ (జనంసాక్షి) : గాంధీ భవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి కొప్పుల రాజు రాజుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క జాతీయ ఉపాధి హామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిదేనని ఆమె స్పష్టం చేశారు. వలసలను అరికట్టేందుకు, వెట్టి చాకిరి నుంచి గ్రామీణ ప్రజలను విముక్తి చేయాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. ఉపాధి హామీ చట్టం నుంచి గాంధీ పేరు తొలగించడం ద్వారా బీజేపీ మరోసారి గాంధీని హత్య చేసినట్లేనని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పని దినాలను తగ్గిస్తూ, గ్రామీణ కూలీల సొంత ఊర్లో పని చేసే హక్కును కాలరాస్తోందని అన్నారు. కార్పొరేట్ల మైనింగ్ అవసరాలకు తక్కువ కూలీకి కార్మికులను సరఫరా చేయాలనే ఉద్దేశంతోనే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ చట్టం రద్దయితే గ్రామాల్లో ఉపాధి లేక కూలీలు కార్పొరేట్ల దోపిడీకి గురవుతారని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం బిక్ష కాదని, హక్కుగా లభించాల్సిన పథకమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. నాలుగేళ్ల కష్టంతో రూపొందించిన చట్టాన్ని నాలుగు గంటల చర్చ కూడా లేకుండా కొత్త జీ?రామ్?జీ చట్టంగా తీసుకురావడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. గతంతో పోలిస్తే కోట్లాది పని దినాలు తగ్గించారని, 125 రోజుల పని అనే ప్రకటన పూర్తిగా బోగస్ అని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల్లో మహిళలు, ఎస్సీ?ఎస్టీలకు పెద్ద ఎత్తున ఉపాధి లభించిందని, తెలంగాణలో మహిళల భాగస్వామ్యం 62 శాతం, ఎస్సీఎస్టీలతో కలిపితే సుమారు 90 శాతం ఉందని తెలిపారు. కరోనా కాలం లో చదువుకున్న యువతకు కూడా ఉపాధి కల్పించిన ఘనత ఈ చట్టానిదేనని గుర్తు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడేందుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేసి కేంద్రానికి పంపిస్తామని తెలిపారు. జి రాంజీ చట్టాన్ని తమ ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. 27 లేదా 28 తేదీల్లో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు. నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సర్పంచులు, ఉపసర్పంచులకు మంత్రి సీతక్క అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పేదల హక్కులను హరించే మోడీ ప్రభుత్వ కుట్రలను ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కొని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించండి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన అధికారులు**



హైదరాబాద్ (జనంసాక్షి) : రెవెన్యూ మంత్రిని కలిసిన డీసీఏ, టీజీటీఏ, టిజీఆర్ఎస్ఏ నేతలు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీసిఎల్ఏకు విచ్చేసి రెవెన్యూ ఉన్నతాధికారులతో శాఖాపరమైన సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ లోకేష్ కుమార్ సమక్షంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిశారు. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తెచ్చారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లుగా మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు బాణాల రాంరెడ్డి, టీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ చౌహాన్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భిక్షం, కోశాధికారి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్నయ్య అరెస్టు అప్రజాస్వామికం

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**

హైదరాబాద్ (జనంసాక్షి) : సామాజిక కార్యకర్త, అనాధాశ్రమాన్ని నిర్వహిస్తున్న గాదె ఇన్నయ్యను ఎన్ఐఏ అధికారులు అప్రజాస్వామికంగా అరెస్టు చేయడం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఖండించారు. మావోయిస్టు నేత కాతా రామచంద్రారెడ్డి అంత్యక్రియలో పాల్గొని, అక్కడ జరిగిన సభలో మావోయిస్టులకు అనుకూలంగా మాట్లాడారనే నెపంతో ఈ అరెస్టు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారని, ఆపరేషన్ కగార్, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణులను వ్యతిరేకిస్తున్నవారిని, సామాజిక సమస్యలపై స్పందించే వ్యక్తులను అరెస్టులు చేయడం ప్రజాస్వామిక గొంతుకలను అణచివేయడమేనని తెలిపారు. ఇన్నయ్య అరెస్టును అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛపై జరిగిన దాడిగా భావించి ప్రజాస్వామిక వాదులందరూ వ్యతిరేకించాలని కోరారు.

# 'ఉపాధి' చట్టం మోడీ సర్కారుకిష్టం లేదు

- వామపక్షాలతో ఒత్తిడితో వచ్చినది కాబట్టే నిర్వీర్యానికి యత్నం
- పునరుద్ధరణ కోసం ఐక్య పోరాటాలు
- సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీ.వీ.రాఘవులు
- మోడీ సర్కారు గాంధీని మరోమారు హత్య చేసింది
- నరేగా చట్ట తీసుకురావడంలో ఏచూరి పాత్ర కీలకం
- స్వాతంత్ర్య సమరయోధులను వెనక్కినెట్టి గాడ్సే, సావర్కర్ల ప్రమోట్
- సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మెన్ నారాయణ
- సికింద్రాబాద్లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వామపక్షాల నిరసన




హైదరాబాద్ (జనంసాక్షి) : యూపీఏ1 ప్రభుత్వ హయాంలో వామపక్షాల ఒత్తిడితో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం ఉండటం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఇష్టం లేదనీ, అందుకే ఆ చట్టం నిర్వీర్యానికి మోడీ సర్కారు పూనుకున్నదని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీ. వీ. రాఘవులు విమర్శించారు. చట్టం తీసుకొచ్చే సమయంలో ప్రజల్లోగానీ, పార్లమెంట్లోగానీ సమగ్ర చర్చకు పెట్టకపోవడం దుర్మార్గమన్నారు. నరేగా చట్టం తీసుకొచ్చే సమయంలో ఏడాది పాటు ప్రజల్లో చర్చకు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఆనాడు పార్లమెంట్లో వామపక్షాల ఎంపీలు బలమైన చర్చపెట్టి ప్రజలకు అనుకూలమైన చట్టం తీసుకొచ్చారని వివరించారు. వామపక్ష పార్టీల ముద్ర బలంగా ఆ చట్టం ఉండటం బీజేపీకి ఏమాత్రం ఇష్టంలేదన్నారు. మరోవైపు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను కూడా క్రమంగా తొలగిస్తూ పోతున్నదనీ, మహాత్మాగాంధీ పేరు ఉండటం ఆ పార్టీకి ఏమాత్రం ఇష్టం లేదని విమర్శించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి 'విబి జి రామ్ జి' చట్టాన్ని తీసుకురావడాన్ని నిరసిస్తూ సోమవారం సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలనీ, పాత చట్టాన్ని కొనసాగించాలనీ, గాంధీ పేరును మార్చొద్దని నినదించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. కూలీలు అధిక వేతనం పొందడం, కొంత మేర జీవప్రమాణాలు మెరుగుపడటం గ్రామీణ ధనవంతులకు, కార్పొరేట్లకు ఏమాత్రం నచ్చడం లేదనీ, అందుకే ఆ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని ఒత్తిడి తీసుకురావడంతోనే మోడీ సర్కారు ఇలా చేస్తున్నదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టంలో కేంద్రం వాటాను తగ్గించి రాష్ట్రాల వాటా పెంచడం అంటే భారం మోపడమేననీ, ఇప్పటికే రాష్ట్రాల ఆర్థిక వనరుల పై దాడిచేస్తూ మున్సిపాల్టీల స్థాయికి మోడీ దిగజార్చిన విధానాన్ని వివరించారు. వేతనాన్ని ఏడు రోజుల్లోనే చెల్లింపు, 125 రోజులకు పని పెంపు అంటూనే పెద్ద ఎత్తున కూలీలను ఉపాధి హామీ చట్టం నుంచి తొలగించే పనికి మోడీ సర్కారు పూనుకున్నదని విమర్శించారు. 125 రోజుల పని అని చెబుతూ విషగుళికను మింగించే పనిలో ఉందన్నారు. పేదలకు ఇతోధికంగా దోహదపడుతున్న ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయనున్నట్టు ప్రకటించారు. రాజకీయంగా క్షేత్రస్థాయికి ఉద్యమాన్ని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నా పట్టనట్టు ఉంటున్న బీజేపీ, టీడీపీ, వైసీపీ, జనసేన, బీఆర్ఎస్, తదితర ప్రాంతీయ పార్టీలకు చెందిన నేతలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. అందర్నీ సమీకరిద్దాం..పోరాటాల ద్వారా ముందుకెళ్తాన్నారు.

సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మెన్ కె.నారాయణ మాట్లాడుతూ.. పార్లమెంట్ వామపక్షాల బలం తగ్గితే సామాన్యులకు, పేదలకు నష్టమనీ, లౌకిక వ్యవస్థలకు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని చెప్పారు. పార్లమెంట్ వామపక్షాలకు బలమైన ప్రాతినిధ్యం ఉంటే కేంద్రం ప్రవేశపెట్టిన 'విబి జి రామ్ జి' బిల్లును బలంగా అడ్డుకునేవారనీ, ఇప్పుడు ఆ లోటు కనబడుతున్నదని కొందరు కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు అంటున్నారని ప్రస్తావించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును విబిజి రామ్ జి గా మార్చి గాంధీని మరోమారు మోడీ హత్య చేశారని తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య, పోరాట యోధులను వెనక్కి నెట్టి, గాంధీని చంపిన గాడ్సేను, బ్రిటీషర్లను క్షమాభిక్ష కోరిన సావర్కర్లను ముందుకు తీసుకొస్తున్నారని విమర్శించారు. మోడీఅధికారంలోనికి వచ్చిన 2014 తర్వాతనే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టుగా కొందరు బీజేపీ ఎంపీలు మాట్లాడటాన్ని తప్పుబట్టారు. నరేగా చట్టం తీసుకొచ్చే సమయంలో అప్పటి సీపీఐ(ఎం) ఎంపీ సీతారాం ఏచూరి కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. దురుద్దేశంతో మంచి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోడీ సర్కారు పూనుకోవడాన్ని తప్పుబట్టారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ మాట్లాడుతూ.. నూతన చట్టం కేంద్రం నిధులను తగ్గించి రాష్ట్రాలపై భారాన్ని మోపడం సరిగాదన్నారు. పనిముట్ల కొనుగోలుకు సంబంధించి 75 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని కొత్త చట్టంలో పేర్కొనటం దారుణమన్నారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలనీ, రోజువారీ కూలిని రూ.600కి పెంచాలని డిమాండ్ చేశారు. ఉ పాధి హామీ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీల నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయనీ, మంగళవారం జరిగే కార్యక్రమాలనూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

- మంచిర్యాలలో ముగ్గురు, ఖమ్మంలో ఒకరు మృతి

మంచిర్యాల/ఖమ్మం, డిసెంబర్ 25 (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు పెరిగిపోతూనే ఉన్నాయి. అధిక వేగం, నిర్లక్ష్యమైన డ్రైవింగ్ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకు నమ్మకం లేకుండాపోతున్న పరిస్థితి. అసలు ప్రమాదం ఎక్కడి నుంచి వస్తుందో తెలియడం లేదు. పెద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలతో బయటపడి మృత్యుంజయులుగా ఉన్న వారు ఎందరో ఉండగా.. చిన్న ప్రమాదాలకు ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినా కూడా ఎక్కడో చోట ప్రమాదాలు జరిగి అనేక మంది మరణిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మంచిర్యాల, ఖమ్మంలలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. తాజాగా మంచిర్యాలలో జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. జిల్లాలోని ఇందారం క్రాస్ రోడ్డు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న బొలెరోను వేగంగా దూసుకొచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వరి నాట్లు వేసేందుకు మహారాష్ట్ర నుంచి కరీంనగర్ జిల్లాకు 23 మంది కూలీలు బొలెరోలు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇందారం క్రాస్ వద్ద బొలెరో వాహనం కొద్దిసేపు ఆగింది. ఇంతలో అనుకోని ప్రమాదం వారిని వెంటాడింది. ఓ లారీ అతి వేగంగా దూసుకొచ్చి బొలెరోను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఖమ్మం రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన సోమవారం ఎదులాపురం మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాయిడుపేట బైపాస్ రోడ్డు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న పాముల కేశవులు అనే ద్విచక్ర వాహనదారుడిని ఖమ్మం నుంచి నాయుడు పేట వైపుగా వస్తున్న ఆర్టీసి బస్సు ఢీ కొట్టింది. దింతో తీవ్ర గాయాలపాలైన కేశవులు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యాశాల మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాష్ట్రాలపై భారీ భారం - ఒక విశ్లేషణ

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్) 2005లో ప్రవేశపెట్టబడిన ఈ పథకం, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కనీస 100 రోజుల ఉపాధి హామీ ఇచ్చి, దేశవ్యాప్తంగా లక్షలాది మంది జీవనాధారాన్ని మెరుగుపరిచింది. ఇది డిమాండ్-డ్రివెన్ పథకంగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. అయితే, 2025లో కేంద్ర ప్రభుత్వం దీన్ని రీప్లేస్ చేసి, "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ)" (వీబీ-జీఆర్‌ఏఎమ్‌జీ) బిల్లును పార్లమెంట్‌లో పాస్ చేసింది. ఈ మార్పు, నిధుల వాటాల్లో భారీ మార్పులు తెచ్చి, రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపుతుంది.



గతంలో ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నమూనా స్పష్టంగా కేంద్ర-ప్రధానంగా ఉండేది. వేతనాల (లేబర్ కాంపోనెంట్)కు 100 శాతం నిధులు కేంద్రం భరించేది, మెటీరియల్ , స్కిల్డ్ లేబర్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రాలు భరించేవి. అడ్మినిస్ట్రేటివ్ ఖర్చులకు 6 శాతం వరకు కేంద్రం అందించేది. ఉదాహరణకు, 2024-25లో కేంద్రం ఇండియన్ రూ.86,000 కోట్లు కేటాయించింది, ఇందులో రాష్ట్రాల వాటా చాలా తక్కువగా ఉండేది. ఈ నమూనా, పేద రాష్ట్రాలకు భారం తగ్గించి, ఉపాధి హామీని సమర్థవంతంగా అమలు చేయడానికి సహాయపడింది. అయితే, వీబీ-జీఆర్‌ఏఎమ్‌జీ బిల్లు ఈ నమూనాను పూర్తిగా మార్చి, మొత్తం నిధుల్లో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రాలు భరించాలని నిర్ణయించింది. నార్త్ ఈస్ట్ రాష్ట్రాలకు మాత్రం 90:10 నిష్పత్తి ఉంటుంది. ఈ మార్పు, 2025-26లో మొత్తం అంచనా ఇండియన్ రూ.1,51,282 కోట్లలో కేంద్ర వాటా ఇండియన్ రూ.95,692.31 కోట్లుగా పరిమితం చేస్తుంది. ఇది డిమాండ్-డ్రివెన్ నుంచి సప్లై-డ్రివెన్ మోడల్‌కు మార్పు, ఇక్కడ ఉపాధి బడ్జెట్ లిమిట్స్ పై ఆధారపడుతుంది, 125 రోజుల హామీ ఇచ్చినప్పటికీ.

ఈ మార్పులు రాష్ట్రాలపై పడే భారాన్ని భారీగా పెంచుతాయి. తెలంగాణలో, 2024-25లో ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 12 కోట్ల పనిదినాలకు ఇండియన్ రూ.4,344 కోట్లు ఖర్చు అయ్యాయి, ఇందులో రాష్ట్ర వాటా కేవలం ఇండియన్ రూ.350 కోట్లు. కానీ కొత్త నిబంధనల ప్రకారం, 40 శాతం వాటాగా ఇండియన్ రూ.1,737 కోట్లు భరించాలి, అంటే అదనపు ఇండియన్ రూ.1,200 కోట్లకు పైగా భారం. రాష్ట్రంలో 51.96 లక్షల జాబ్ కార్డులు, 1.06 కోట్ల కూలీలు ఉండగా, పనిదినాలు 2021-22లో 14.25 కోట్ల నుంచి 2025-26లో 7.5 కోట్లకు తగ్గాయి. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో ఆదాయ-వ్యయాల మధ్య అగాధం ఉండగా, అప్పులు 107.52 శాతాన్ని దాటాయి. ఈ అదనపు భారం, రాష్ట్రాన్ని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టుతుంది.

దేశవ్యాప్తంగా చూస్తే, ఈ మార్పులు పేద రాష్ట్రాలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో 2024-25లో ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 86.1 మిలియన్ మంది డిమాండ్ చేసిన ఉపాధి, 75.1 మిలియన్ మందికి అందింది. రాష్ట్ర బడ్జెట్ అల్లోకేషన్ ప్రకారం, 2024-25లో యూపీ(యునైటెడ్ ప్రావిన్సెస్)కు దాదాపు ఇండియన్ రూ.15,000 కోట్లు కేటాయించబడ్డాయి. కానీ 40 శాతం వాటాతో, అదనపు ఇండియన్ రూ.6,000 కోట్లు భరించాలి, ఇది రాష్ట్ర ఫిస్కల్ డెఫిసిట్‌ను 4-5 శాతం పెంచుతుంది. సమానంగా, బిహార్‌లో పనిదినాలు 2023-24లో 10 కోట్లకు పైగా ఉండగా, కొత్త మోడల్‌తో రాష్ట్ర వాటా ఇండియన్ రూ.4,000 కోట్లకు పెరుగుతుంది. బిహార్ వంటి పేద రాష్ట్రాలు, ఇప్పటికే కేంద్ర సహాయంపై ఆధారపడుతున్నాయి, ఈ భారం వల్ల ఉపాధి అమలు ఆలస్యమవుతుంది.

దక్షిణాది రాష్ట్రాల్లో కూడా ప్రభావం తీవ్రం. ఆంధ్రప్రదేశ్‌లో 2024-25లో ఇండియన్ రూ.8,000 కోట్లకు పైగా ఖర్చు అయ్యాయి, ఇందులో రాష్ట్ర వాటా తక్కువ. కానీ వీబీ-జీఆర్‌ఏఎమ్‌జీతో 40 శాతం భరించాలంటే, అదనపు ఇండియన్ రూ.3,200 కోట్లు కావాలి, ఇది రాష్ట్ర బడ్జెట్‌లో 2-3 శాతం ప్రభావం చూపుతుంది. కర్ణాటకలో పనిదినాలు 8 కోట్లకు పైగా ఉండగా, అదనపు భారం ఇండియన్ రూ.2,500 కోట్లు. ఈ మార్పులు, రాష్ట్రాల ఫిస్కల్ స్పేస్‌ను కుదించి, ఇతర సంక్షేమ పథకాలను ప్రభావితం చేస్తాయి. నార్త్ ఈస్ట్ రాష్ట్రాలు మాత్రం 10 శాతం వాటాతో లాభపడతాయి, కానీ మిగతా రాష్ట్రాల్లో అసమానతలు పెరుగుతాయి.

విమర్శనాత్మకంగా చూస్తే, ఈ మార్పులు ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆత్మను దెబ్బతీస్తాయి. గతంలో ఇది రైట్ టు వర్క్‌ను గ్యారంటీ చేసేది, కానీ ఇప్పుడు బడ్జెట్ లిమిట్స్ వల్ల ఉపాధి తగ్గుతుంది. 2024-25లో 44 శాతం బడ్జెట్ ఇప్పటికే ఖర్చు అయింది, కానీ కొత్త మోడల్‌తో రాష్ట్రాలు నిధులు సమకూర్చకపోతే, పథకం అమలు ప్రమాదంలో పడుతుంది. విమర్శకులు, ఇది కేంద్రం బాధ్యతల నుంచి తప్పుకోవడమని, రాష్ట్రాలను శిక్షించడమని అంటున్నారు. ఉదాహరణకు, పంజాబ్‌లో 2024-25లో కేవలం 26 రోజుల ఉపాధి మాత్రమే ఇవ్వబడింది, ఇది ఇప్పటికే తక్కువగా ఉన్న ఉపాధిని మరింత తగ్గిస్తుంది. గ్రామీణ వేతనాలు పెరిగినప్పటికీ (2024-25లో సగటు ఇండియన్ రూ.250-300), భారం వల్ల ఆలస్య చెల్లింపులు పెరుగుతాయి. లిబ్‌టెక్ ఇండియా వంటి సంస్థలు, పేద రాష్ట్రాలు మరింత ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తాయని హెచ్చరిస్తున్నాయి.

మొత్తంగా, దేశవ్యాప్తంగా ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 2024-25లో 2.6 బిలియన్ పనిదినాలు జనరేట్ అయ్యాయి, ఇందులో టాప్ స్టేట్స్ యూపీ, బిహార్, ఆంధ్ర, తెలంగాణ. కానీ వీబీ-జీఆర్‌ఏఎమ్‌జీతో, రాష్ట్రాలు అదనపు ఇండియన్ రూ.50,000 కోట్లకు పైగా భరించాలి, ఇది ఫిస్కల్ డెఫిసిట్‌ను పెంచి, గ్రామీణ అభివృద్ధిని అడ్డుకుంటుంది. ఇది వికసిత్ భారత్ లక్ష్యాలకు విరుద్ధం, ఎందుకంటే పేదల ఉపాధి హామీని బలహీనపరుస్తుంది. కేంద్రం ఈ మార్పులను పునరాలోచించాలి, లేదంటే గ్రామీణ భారత్ మరింత వెనుకబడుతుంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**

## యూరియా బుకింగ్ యాప్
# రైతుల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 20 నుంచి రైతులకు ముఖ్యంగా యూరియా ఎరువుల పంపిణీ కోసం మొబైల్ ఆధారిత ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. విధానపరంగా ఇది పారదర్శకతను పెంచడం, నిల్వల నియంత్రణను కఠినతరం చేయడం, బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోవడం అనే లక్ష్యాలతో రూపొందించిన చర్యగా ప్రభుత్వం చెబుతోంది. కానీ భూమిపై అమలులోకి వచ్చేసరికి ఈ విధానం తెలంగాణ రైతుల సామాజిక ఆర్థిక వాస్తవాలకు ఎంతవరకు సరిపోతుందన్న ప్రశ్న తీవ్రంగా ఉత్పన్నమవుతోంది. వ్యవసాయం ఇప్పటికీ వర్షాధారితంగా, చిన్న సన్నకారు రైతుల ఆధారంగా నడుస్తున్న రాష్ట్రంలో ప్రపంచ స్థాయి డిజిటల్ మోడళ్లను యథాతథంగా రైతులపై రుద్దడం వల్ల ప్రయోజనం కన్నా ఇబ్బందులే ఎక్కువగా కనిపిస్తున్నాయి.



**డిజిటలైజేషన్ అవసరమే అయినా అది రైతుకు తోడుగా ఉండాలి గాని అడ్డుగా మారకూడదు. గ్రామ స్థాయిలో ప్రత్యక్ష సహాయం, ఆఫ్‌లైన్ మార్గాల కొనసాగింపు, సరళమైన బుకింగ్ విధానం ఉంటేనే ఈ ప్రయత్నం సఫలమవుతుంది. రైతును ప్రయోగశాలగా మార్చి విధానాలు అమలు చేయడం దీర్ఘకాలంలో ప్రమాదకరం. క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని రైతు కేంద్రితంగా నిర్ణయాలు తీసుకున్నప్పుడే అభివృద్ధి సార్థకమవుతుంది.**

తెలంగాణ రాష్ట్రంలో తాజా గణాంకాల ప్రకారం సుమారు 63 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయి. వీరిలో దాదాపు 55 లక్షల మంది పట్టా భూదారులు కాగా మిగిలిన వారు కౌలు రైతులుగా వ్యవసాయం చేస్తున్నారు. మొత్తం రైతుల్లో సుమారు 85% మంది చిన్న సన్నకారు రైతులే. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పెద్ద సంఖ్యలో రైతులకు స్మార్ట్ ఫోన్ అందుబాటులో లేదు. అందుబాటులో ఉన్నవారిలో కూడా యాప్ ఆధారిత బుకింగ్, ఓటీపీ ధృవీకరణ, లింకుల వినియోగం, సర్వర్ లోపాల పరిష్కారం వంటి అంశాలపై అవగాహన పరిమితంగా ఉంది. డిజిటల్ ఇండియా నినాదం గ్రామాల్లో పూర్తిగా అమలైందని చెప్పడానికి వాస్తవాలు సహకరించడం లేదు.

ఆన్లైన్ యూరియా బుకింగ్ ప్రక్రియలో ఆధార్ నెంబర్, భూమి పట్టా పాసుబుక్ నెంబర్, సాగు విస్తీర్ణం వివరాలు, మొబైల్ ధృవీకరణ వంటి అనేక దశలు ఉన్నాయి. ఇవన్నీ ఒక విద్యావంతుడైన పట్టణ వినియోగదారుడికి సులభంగా అనిపించవచ్చు. కానీ పొలం పనిలో మునిగిపోయి ఉండే రైతుకు ఇది భారంగా మారుతోంది. ఇంటర్నెట్ సిగ్నల్ లేని గ్రామాల్లో, సర్వర్ డౌన్ అయిన సందర్భాల్లో, యాప్ సరిగా ఓపెన్ కాకపోయే పరిస్థితుల్లో రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. చివరకు డీలర్ వద్దకు వెళ్లినా "ఆన్లైన్ బుక్ చేయాలి" అనే సమాధానమే ఎదురవుతోంది.

ఇంకా తీవ్రంగా ప్రభావితమవుతున్న వర్గం కౌలు రైతులు. పట్టా పాసుబుక్ తమ పేరు మీద లేకపోవడం వల్ల వీరు ఆన్లైన్ విధానంలో పూర్తిగా పక్కకు నెట్టబడుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 15% నుంచి 20% వరకు వ్యవసాయం కౌలు ప్రాతిపదికన సాగుతోంది. ఈ రైతులు సాగు ఖర్చులన్నీ భరిస్తున్నా ఎరువుల విషయంలో అర్హత కోల్పోవడం అన్యాయంగా మారుతోంది. ఇది పంట దిగుబడులపై ప్రభావం చూపడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలహీనపరుస్తుంది.

ప్రభుత్వం ఎరువుల దుర్వినియోగాన్ని అడ్డుకోవాలన్న ఉద్దేశంతో ఈ విధానాన్ని తీసుకువచ్చినా రైతుల దృష్టిలో ఇది ఒక అదనపు అడ్డంకిగా మారింది. ఎరువులు విత్తనాల్లా ముందుగా నిల్వ చేసుకునే వస్తువులు కావు. పంట దశను బట్టి తక్షణ అవసరం ఏర్పడుతుంది. ఆ సమయంలో ఆన్లైన్ బుకింగ్ ఆలస్యం అయితే పంటకు నష్టం తప్పదు. రైతు నష్టాన్ని భరిస్తే దానికి ప్రత్యామ్నాయం ఎవరు ఇస్తారు అనే ప్రశ్నకు సమాధానం కనిపించడం లేదు.

గ్యాస్ బుకింగ్ మాదిరిగా ఒక సింపుల్ విధానం ఉంటే రైతులకు కొంతమేర సౌలభ్యం ఉండేదన్న అభిప్రాయం గ్రామాల్లో వినిపిస్తోంది. కానీ ప్రస్తుతం ఉన్న విధానం మాత్రం రైతును డీలర్ చుట్టూ తిరిగే స్థితి నుంచి మొబైల్ స్క్రీన్ ముందు నిలబడే స్థితికి మాత్రమే మార్చిందన్న విమర్శ ఉంది. ఓపెన్ మార్కెట్లో కూడా ప్రభుత్వ నియంత్రిత ధరకు ఎరువులు సులభంగా లభించే ఏర్పాట్లు లేకపోవడం వల్ల రైతులు పూర్తిగా ఒకే వ్యవస్థపై ఆధారపడాల్సి వస్తోంది. డిజిటలైజేషన్ అవసరం లేదని ఎవరు చెప్పడం లేదు. కానీ అది దశలవారీగా, రైతులకు శిక్షణ ఇచ్చి, ప్రత్యామ్నాయ ఆఫ్‌లైన్ మార్గాలను కొనసాగిస్తూ అమలు చేయాల్సిన అవసరం ఉంది. గ్రామ సచివాలయాలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రాలు ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పనిచేస్తే మాత్రమే రైతుకు నమ్మకం కలుగుతుంది. ప్రస్తుతం అయితే విధానం రూపకల్పనలో రైతు స్వరం వినిపించలేదన్న భావన బలంగా ఉంది.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ ఆన్లైన్ యూరియా బుకింగ్ విధానాన్ని తక్షణమే పునరాలోచించాల్సిన అవసరం ఉంది. రైతు సామర్థ్యానికి అనుగుణంగా విధానాన్ని సులభతరం చేయడం, కౌలు రైతులకు స్పష్టమైన పరిష్కారం చూపడం, ఆఫ్‌లైన్ పంపిణీని కొనసాగించడం వంటి చర్యలు తీసుకోకపోతే ఈ విధానం రైతు ప్రయోజనానికి కాకుండా రైతుపై మరో భారం మాత్రమే అవుతుంది. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు పునాది అయినప్పుడు రైతును కేంద్రంగా పెట్టిన విధానాలే స్థిరమైన ఫలితాలను ఇస్తాయన్న సత్యాన్ని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉంది.

2.మొత్తంగా పరిశీలిస్తే ఎరువుల పంపిణీలో డిజిటల్ విధానం లక్ష్యాలు మంచివైనా భూమిపై అమలులోకి వచ్చిన విధానం తెలంగాణ రైతుల వాస్తవ పరిస్థితులకు సరిపోవడం లేదు. వ్యవసాయం ఇప్పటికీ అనిశ్చిత వర్షాలు, పెరిగిన సాగు ఖర్చులు, మార్కెట్ ఒడిదుడుకుల మధ్య నడుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతుకు మరో సాంకేతిక అడ్డంకిని చేర్చడం అనవసర భారంగా మారుతోంది. స్మార్ట్ ఫోన్ లేని రైతు, ఇంటర్నెట్ అందుబాటులో లేని గ్రామం, డిజిటల్ పరిజ్ఞానం పరిమితమైన వృద్ధ రైతు ఈ విధానంలో పక్కకు నెట్టబడుతున్నారు. ముఖ్యంగా కౌలు రైతుల సమస్యను విస్మరించడం వల్ల ఈ విధానం అసమానతలను పెంచే ప్రమాదం ఉంది. ఎరువులు పంటకు ప్రాణం వంటి సమయంలో ఆలస్యం జరిగితే దాని ప్రభావం దిగుబడులపై నేరుగా పడుతుంది. రైతు నష్టాన్ని భరించే స్థితిలో ప్రభుత్వం ఉండకపోతే విధానంపై నమ్మకం నిలవదు. డిజిటలైజేషన్ అవసరమే అయినా అది రైతుకు తోడుగా ఉండాలి గాని అడ్డుగా మారకూడదు. గ్రామ స్థాయిలో ప్రత్యక్ష సహాయం, ఆఫ్‌లైన్ మార్గాల కొనసాగింపు, సరళమైన బుకింగ్ విధానం ఉంటేనే ఈ ప్రయత్నం సఫలమవుతుంది. రైతును ప్రయోగశాలగా మార్చి విధానాలు అమలు చేయడం దీర్ఘకాలంలో ప్రమాదకరం. క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని రైతు కేంద్రితంగా నిర్ణయాలు తీసుకున్నప్పుడే అభివృద్ధి సార్థకమవుతుంది. ప్రభుత్వం రైతుల స్వరాన్ని వినిపించుకుని ఈ విధానాన్ని మళ్లీ ఆలోచించాల్సిన అవసరం అత్యవసరం.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

## రూపాయి విలువ పతనంపై - బీజేపీ పిట్ట కథలు
# పూర్వపు ఆరోపణలు, ప్రస్తుత వాస్తవాలు

***భారతీయ రూపాయి విలువలో జరుగుతున్న నిరంతర క్షీణత, దానికి సంబంధించి ప్రస్తుత పాలక వర్గం తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, రూపాయి విలువ పతనం పై మోదీ, బీజేపీ నాయకులు వీరావేశంతో చేతులు ఊపుకుంటూ, చేతులు చరుచుకుంటూ ఆర్థిక వాస్తవాలు ఏమిటి అనే విషయాలపై ఒక విమర్శనాత్మక చర్చను లేవనెత్తారు. "ఇప్పుడు వారి సమాధానం ఏమిటి?" అన్న ప్రశ్నతో సమస్యను స్థూలంగా చూసే బదులు, ఈ వ్యాసం దానిని మూడు కోణాల్లో పరిశీలిస్తుంది: గత ప్రతిపక్ష వ్యాఖ్యలు, ప్రస్తుత ఆర్థిక వాస్తవాలు, మరియు సామాన్య పౌరుడి పై ప్రభావం.***

పార్టీ స్థానాల్లో మార్పు: పూర్వపు విమర్శల నుండి ప్రస్తుత రక్షణల వరకు గతంలో ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పుడు, బీజేపీ నేతలు రూపాయి విలువ క్షీణతను దేశ స్వాభిమానానికి దెబ్బగా చిత్రించి, యుపిఏ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. 2013లో, రవి శంకర్ ప్రస్తుత పరిస్థితిని "జాతీయ స్వాభిమానాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నది" అని వర్ణించారు. ప్రకాష్ జవదేకర్ "అసమర్థ నాయకత్వం" దీనికి కారణమని చెప్పారు. పియూష్ గోయల్ "చాలా వేదనాభరితంగా ఉంది" అని ట్వీట్ చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రభుత్వాన్ని రద్దు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. (ఇప్పుడు వెంకయ్య నాయుడు నోరు బీజేపీ చేతకానితనం పై శాశ్వతంగా మూతపడింది) ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీ నేతలు,వారి ఆర్థిక సలహాదారులు వేరే రకమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ ప్రభుత్వం "నిద్ర చెడగొట్టుకోవటం లేదు" అని చెప్పడం, ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ ఈ పతనంపై తనకు ఆందోళనగా లేదని వాగడం ఈ మార్పును స్పష్టం చేస్తాయి.

**రూపాయి పతనం : ఆర్థిక వాస్తవాలు, ప్రభావాలు**

డిసెంబర్ 2025 నాటికి, రూపాయి విలువ డాలరుకు 90.43 కి చేరి జీవితకాల కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఈ క్షీణతకు అనేక కారణాలు ఉన్నాయి.

**రూపాయి పతనానికి ప్రధాన కారణాలు : దుష్ఫలితాలు**

విదేశీ పెట్టుబడుల నిష్క్రమణతో 2025లో భారత ఈక్విటీ మార్కెట్ల నుండి సుమారు 17 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి తీసుకోబడ్డాయి, ఇది రూపాయిపై ఒత్తిడిని పెంచింది.రెండోది వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఉన్న అనిశ్చితి, మరియు అమెరికా భారత ఎగుమతులపై 50 శాతం వరకు సుంకాలు విధించటం వ్యాపార వాతావరణాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది.ప్రపంచ వ్యవస్థలో అమెరికా డాలర్ ప్రపంచవ్యాప్తంగా బలమైన స్థితిలో ఉంది. ఇది అనేక దేశాల కరెన్సీలపై ఒత్తిడిని కలిగిస్తోంది.

**ఆర్థిక ప్రభావం :** రూపాయి క్షీణత వల్ల ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. దిగుమతి ఖర్చు పెరుగుతుంది. దేశం చమురు (85 శాతం), ఎలక్ట్రానిక్స్, ఎరువులు వంటి వస్తువుల కోసం విదేశాలపై ఆధారపడుతోంది. రూపాయి పడిపోవడం వల్ల ఈ దిగుమతుల బిల్లు భారీగా పెరుగుతుంది. విదేశీ విద్యపై కూడా భారం పడుతుంది . 50,000 డాలర్ల ఫీజు, రూ. 80 రేటు వద్ద రూ. 40 లక్షలు అయితే, రూ. 90 రేటు వద్ద అదే రూ. 45 లక్షలకు చేరుతుంది. ద్రవ్యోల్బణ ప్రమాదం పొంచి ఉంది పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి రవాణా ఖర్చు పెరుగుతుంది, దీని వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి అవకాశం ఉంది.

**కొన్నివర్గాలకు మాత్రం సానుకూల ప్రభావాలు :**

రెమిటెన్స్ విషయంలో ప్రవాస భారతీయులు పంపే డబ్బు (రెమిటెన్స్) రూపాయిలో అధికంగా వస్తుంది. 2024లో దేశం సుమారు 137-138 బిలియన్ డాలర్లు స్వీకరించింది.

ఎగుమతిదారులకు రూపాయి విలువ తగ్గడం వల్ల విదేశీ మార్కెట్లలో భారతీయ వస్తువుల ధర తగ్గుతుంది, ఇది ఎగుమతులను ప్రోత్సహించడానికి కొంత మేరకు సహాయపడుతుంది (ఇతర కారకాలు కూడా అనుకూలంగా ఉంటేనే).



ప్రభుత్వం, ఆర్.బీ.ఐ. వైఖరిలో మార్పు రావాలి. "జాగ్రత్తగా పరిశీలన" నుండి "సక్రమ జోక్యం" వరకు ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కొనడంలో ప్రభుత్వం,రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్.బీ.ఐ.) నిర్దిష్ట వైఖరిని అవలంబించాలి. ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యుడు నీలకంఠ మిశ్రా ప్రకారం, ప్రస్తుత క్షీణత "సహించదగిన వేగంలో" ఉన్నందున, ఇది ప్రాథమిక ఆందోళన కలిగించదు. క్షీణత ఈ వేగాన్ని మించి అస్తవ్యస్తంగా మారితేనే ఆర్.బీ.ఐ. జోక్యం చేసుకుంటుందట. ఆర్.బీ.ఐ.యొక్క విధానం చూస్తే 2013 సంక్షోభం సమయంతో పోలిస్తే, ఆర్.బీ.ఐ.వద్ద ప్రస్తుతం 690 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు మాత్రమే ఉన్నాయి. ఈ బలమైన నిల్వల సహాయంతో, ఆర్.బీ.ఐ.మార్కెట్ కదలికలను గమనిస్తూ, సక్రమమైన వ్యవధిలో మాత్రమే జోక్యం చేసుకుంటుందట. ఆయన మాటలు 2013 సంక్షోభ సమయంలోని వైఖరికి విరుద్ధంగా ఉన్నాయి.

చివరిగా.. రాజకీయ విమర్శ నుండి ఆర్థిక సంక్లిష్టతల వైపు రూపాయి విలువ క్షీణత పై చర్చ రాజకీయ పక్షపాతానికి అతీతంగా, దేశం యొక్క ఆర్థిక సంక్లిష్టతలను అర్థం చేసుకోవడానికి ఒక అవకాశంగా మారాలి. గతంలో ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పుడు బీజేపీ నేతలు మోదీతో సహా నాటి ప్రధాని, ఆర్థిక నిపుణుడు డాక్టర్.మన్మోహన్ సింగ్ పై రెచ్చిపోయి చేసిన విమర్శల వీడియోలు ఇప్పుడు బీజేపీ వర్గాలను కలవర పెడుతున్నాయి, ప్రస్తుతం వారే అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి భారీ ఎత్తున అవమానం సోషల్ మీడియా లో నిద్ర లేకుండా చేస్తున్నాయి. మోదీని అడ్డగోలుగా సమర్థించే మాటకారి వెంకయ్య నాయుడుతో వారి నోళ్ళు మూతపడ్డాయి. ఇప్పుడు బీజేపీ వాళ్ళకు అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులను సమర్థించడం లేదా తేలికగా తీసుకోవడం, వాటి ప్రభావం ఎలా ఉంటుందో తెలిసి వస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏది పడితే అది, ఏలా బడితే అలా... అడ్డగోలుగా మాట్లాడిన బీజేపీ నేతలకు రూ.91 కి పడిపోయాక జ్ఞానోదయం అయింది. ఇప్పుడు పొలిటికల్ ఎకానమీ అంటే ఏమిటో...అది అంతర్జాతీయ ఆర్థిక వత్తిడులతో ఒక దేశం ఆర్థిక వ్యవస్థ ఓవర్ నైట్ ఎలా మారుతాయో స్పష్టంగా వారికి అర్థం అయితే .. వారికి నీతి నిజాయితీ ఉంటే మన్మోహన్ సింగ్ ను అకారణంగా గేలి చేసినందుకు పార్లమెంటులో మోదీతో సహా, బీజేపీ నేతలు క్షమాపణలు కోరాలి.

అయితే, ఇప్పుడు మరో ప్రధాన సమస్య ఏమిటంటే, రూపాయి పతనం వల్ల సామాన్యుడి జీవితంపై ఏలాంటి ప్రభావాలు పడతాయి, అలాగే దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం కోసం ప్రస్తుతం ఏలాంటి చర్యలు అవసరం అనే దానిపై దృష్టి సారించాలి.

ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, అమెరికా ద్రవ్య విధానం, వాణిజ్య వివాదాలు వంటి అంశాలు భారతదేశ నియంత్రణకు దాదాపు అతీతంగా ఉన్నాయి. అటువంటి సందర్భాల్లో, రూపాయిని కాపాడటానికి జోక్యం చేసుకోవడం, దానిని సహజంగా క్షీణించనివ్వడం మధ్య సమతుల్యతను కొనసాగించడం ఆర్థిక నిర్వాహకుల ప్రధాన బాధ్యత. ఇది ప్రస్తుతం భారత అధికార పక్షానికి ఒక సవాలుగా ఉంటుంది.

ఇప్పుడు అవసరమైనది రాజకీయ పాయింట్ల స్కోరింగ్ కాదు, సామాన్య పౌరుడిపై పడే ప్రతికూల ప్రభావాలను తగ్గించే విధానాలు అనుసరించాలి. ఎగుమతులను పెంచే చర్యలు, మరియు ఆర్థిక వ్యవస్థ యొక్క మౌలిక సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి పెట్టడం. సమర్థవంతమైన విధానాలు, స్పష్టమైన కమ్యూనికేషన్, అలాగే రాజకీయ పక్షపాతానికి అతీతమైన ఆర్థిక విధాన నిర్ణయాలే భారతీయ రూపాయి యొక్క భవిష్యత్తు, దేశ ఆర్థిక సంకల్పాన్ని నిర్ణయిస్తాయి.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## సాహిత్య తాత్విక సామాజిక రంగాల్లో
# బిఎస్ రాములు కృషి

శతాధిక విభిన్న గ్రంథాలను రచించి స్వయంగా వెలువరించిన ఏకైక తెలంగాణ బహుజన ముద్దుబిడ్డ బి.ఎస్. రాములు. మూడు దశాబ్దాల స్నేహం, పరస్పర భావ వినిమయంతో కలిసి సహజీవనం చేస్తున్న బి.ఎస్. రాములన్న గురించి ఓ పది పైసలంత అర్థం చేసుకుని ఉంటానేమో! ఆ మాత్రమైనా నేను అర్థం చేసుకున్నది దాంట్లో కొంత బిఎస్ విభేదించే అవకాశం కూడా లేకపోలేదు.



బి.ఎస్. సహజ తత్వవేత్త. తన జీవిత కాలంలో ఆయన అనేక విభిన్నమైన జీవితాలు స్వయంగా గడపడమే గాక మరెందరి జీవితాల్లోని బాధలను కష్టాలను తనవిగా చేసుకుని తల్లడిల్లుతారు. విశాలమైన హృదయంలో ఆ వ్యథలను దాచుకుని అక్షరాల కన్నీళ్ళ జలపాతాలను ప్రవహింపచేస్తారు. ఆ అక్షరాల నీటిని దోసిళ్ళతో పట్టుకునేలోపే భారీ ప్రవాహాలు మనల్ని ముంచెత్తుతాయి. గ్రీకు తత్వవేత్తలతోబాటు మరెందరో ప్రాక్ పశ్చిమ దేశాల తత్త్వవేత్తల వాదాలు, భారతీయ వేదోపనిషత్తుల ఉపదేశాలు, చార్వాకుల, ఆదిశంకరాచార్యుల అస్పష్ట తార్కిక చర్చల పరిధులను దాటి జీవితానుభవాల లోతుల్లోంచి వెలువడ్డ సత్యాలనే పునాదిగా చేసుకుని అందరికీ అర్థమయ్యే భాషలో చేరుకోవలసిన గమ్యాలను, సాగిపోవలసిన గమనాలను, పదిలంగా దాచుకోవలసిన జ్ఞాపకాలను మనకందిస్తాడు బి.ఎస్.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అదే తత్వశాస్త్రంలో డిస్టింక్షన్ విద్యార్థినైన నాకు కూడా ఫిలాసఫర్ల కోటిక్స్‌తో అర్థంకాని అనేక సంక్లిష్టతలను బిఎస్ సునాయాసంగా వివరిస్తాడు. జీవితం కన్న గొప్ప విశ్వవిద్యాలయం మరేదీ ఉండదని అధ్యయనానికి అనుభవాలకన్న గొప్ప గ్రంథాలు లేవని తన రచనల ద్వారా మనకు అర్థం చేయిస్తాడు. రచయితల్లో తమకేది తోస్తే అది రాసేవారే ఎక్కువగా ఉంటారు. బి.ఎస్. ఆ గుంపులో లేడు. సమాజానికి ఏది ఎప్పుడు అవసరమో అదే రాస్తాడు. రాసిందు. అలాగే తన కేం చేయాలనిపిస్తే అది చేయడు. సమాజానికి ఎప్పుడు ఏది అత్యవసరమో అక్కడే అతనుంటాడు. నలుగురు కుమారులు దశాబ్దాల నుండి విదేశాల్లో ఉంటున్నా బి.ఎస్.కు ఆ దేశాలకు వెళ్ళి కొంతకాలం ఉండాలన్న కోరిక ఉండదు. విలువలతో కూడిన జీవితమంటే ఏమిటో బోధిస్తాడు. మనిషి ఎలా జీవించకూడదో చెప్తాడు.

నిత్యం తన చుట్టూ ఉన్న సమాజం, దేశంలో ప్రపంచంలో జరిగే పరిణామాలు, ఉద్యమాలు లోతుగా పరిశీలించడం, వాటిపై వరుసగా వ్యాసాలు రాస్తూ తన అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకోవడం తెలంగాణలో శ్రామికుల ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే సూచనలు, అవసరమైన సందర్భంలో నిర్మాణాత్మక విమర్శలు చేయడం బి.ఎస్. నైజం.

చాలా సంవత్సరాల క్రితం నుండి పేరు వింటున్నా తొలిసారి బి.ఎస్.ను చూసింది ఆయన ప్రసంగాన్ని రాపోలు ఆనందభాస్కర్ 1996లో నిర్వహించిన తెలంగాణ ప్రగతి వేదిక సదస్సులోనే నా సంపాదకత్వంలో వెలువడిన తెలంగాణ మహాసభ తొలి బులెటిన్‌లో బి.ఎస్. ప్రగతి వేదికలో చేసిన ప్రసంగాన్ని ప్రచురించాను. ఆనాటి సహచరులు రమణ (జర్నలిస్ట్), మాధవ కృష్ణారెడ్డి బి.ఎస్. ప్రసంగాన్ని టేప్‌రికార్డర్ నుండి అక్షరీకరించారు.

తెలంగాణలో బీసీ ఎస్సీ నాయకత్వం ఎదగాలని తీవ్ర కృషి చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. భావజాల వ్యాప్తికి ఆచార్య జయశంకర్ వలె రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక తరపున రాష్ట్ర వ్యాప్తంగా కృషి చేశారు.

1996లో సికింద్రాబాద్ పద్మారావు నగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర సదస్సులో పాల్గొన్నారు. ఆ రెండ్రోజుల సెమినార్ వ్యాసాలను నేను తెలంగాణ అనే పత్రికలలో ప్రత్యేక సంచికగా వెలువరించాను. అందులో బి.ఎస్. రాములుగారు ఆనాడు మాట్లాడిన లక్ష్యాలు, తెలంగాణ భాష, సూటియైన, పదునైన పదజాలం ఆశ్చర్యం కలిగించింది. ఆనాటి నుండి మూడు దశాబ్దాలుగా మా స్నేహం కొనసాగుతున్నది. వందలాది విషయాలమీద ఎప్పటికప్పుడు రాములన్నను సందేహం వచ్చినప్పుడల్లా అడుగుతుంటాను. తాను ఒక ఎన్‌సైక్లోపీడియా. అనేక విషయాలపట్ల స్పష్టత ఇచ్చి, నాతోపాటు ఎందరినో ముందుకు నడిపారు. సాహిత్యం, ఉద్యమం, తాత్వికత, బహుజన సిద్ధాంతాలు, బౌద్ధం, అంబేద్కరిజం, మానవతావాదం, భారత రాజ్యాంగం, విశిష్టత, తెలంగాణ పాఠ్యపుస్తకాల విశిష్టత మొదలైన ఎన్నో అంశాలపై అనేక సూచనలు చేస్తూ, తెలంగాణ వైతాళికులుగా, మార్గదర్శిగా నిలిచారు. ఇంకా నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు.

1997-2001 మధ్య కాలంలో వివిధ సంఘాలు తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన భావజాల వ్యాప్తి సభలలో అప్పుడప్పుడు బి.ఎస్. రాములు గారి ప్రసంగాలు వినే అవకాశం కలిగింది. ఆ సమయంలో ఆయన దళిత రచయితలు, కళాకారులు, మేధావుల (దరకమే) సంస్థ కార్యకలాపాలలో నిమగ్నమై ఉండేవారు.

తెలంగాణ రాష్ట్ర సమితిని కేసీఆర్‌తో కలిసి కొంతమందిమి 2001లో ఏర్పాటు చేసిన తర్వాత తరచూ బి.ఎస్. కార్యక్రమాలలో పాల్గొనేవారు. అవకాశం వున్నప్పుడు కేసీఆర్‌తో వివిధ అంశాలపై చర్చించేవారు. 2004-06లలో తెలంగాణ కోసం కేసీఆర్, నరేంద్రులు కేంద్రమంత్రులుగా ఉండి చేసిన రాజకీయ లాబీయింగ్ ప్రక్రియ అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి కుతంత్రాల వలన ముందుకు సాగలేదు. వారిద్దరు మంత్రి పదవులకు రాజీనామా చేసి మరోసారిఉద్యమ నిర్మాణం పై దృష్టి పెట్టారు. తెలంగాణ సాధన కోసం ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిలించాలంటే కొన్ని సాంస్కృతిక చిహ్నాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కేసీఆర్ సూచించారు. వీటిలో ముఖ్యమైనది బతుకమ్మ, తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన, అమరవీరుల స్థూపం.

**(తరువాయి భాగం రేపటి సంచికలో..)**

**వి. ప్రకాష్**
**70755 10400**

# ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

- ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ అధికారి హర్షవర్ధన్
- ఆత్మీయ అతిథిగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**పటాన్‌చెరు, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో సహకారంతో, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం 'మోసాలకు పూర్తి విరామం ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పేరిట అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ అంతటా ప్రజల అవగాహనను పెంపొందించడం, సైబర్ నేరాలను నివారించడం లక్ష్యంగా ఆరు వారాల రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసు సూపరింటెండెంట్ హర్షవర్ధన్, ఐపీఎస్, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పు, సైబర్ నేరస్థులు ఉపయోగించే సాధారణ మోసపూరిత పద్ధతులను వివరించారు. ప్రతి ఒక్కరూ సైబర్ మోసానికి గురయ్యే అవకాశాలున్నాయని, మొబైల్ పరికరాలలో హానికరమైన సాఫ్ట్ వేర్ ను సులభంగా ఇన్ స్టాల్ చేయవచ్చున్నారు. ఇది బ్లాక్ మెయిల్, దోపిడీ, డేటా దుర్వినియోగానికి దారితీయొచ్చని ఆయన హెచ్చరించారు. ఆన్ లైన్ గేమింగ్, ఆన్ లైన్ బెట్టింగ్ (ఇది తెలంగాణాలో నిషేధించారు), ఆన్ లైన్ చాటింగ్ లో పాల్గొనేటప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎందుకంటే, ఈ ప్లాట్ ఫారమ్ లు తరచుగా వినియోగదారులను తీవ్రమైన ఆర్థిక, వ్యక్తిగత ప్రమాదాలకు గురిచేస్తాయని హర్షవర్ధన్ తెలియజేశారు. సంగారెడ్డి పోలీసు సూపరింటెడెంట్ పరితోష్ పంకజ్, ఐపీఎస్, గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఓటీపీ మోసం, పెట్టుబడి మోసం, పార్శిల్ మోసం, డిజిటల్ అరెస్టు స్కామ్ లు, హానికరమైన ఏపీకే ఫైల్ ట్రాపులు, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైళ్లతో సహా ప్రజలను ప్రభావితం చేసే వివిధ రకాల ఆన్ లైన్ మోసాల గురించి ఆయన వివరించారు. సైబర్ నేరాలకు దారితీసే సాధారణ తప్పులను ఎత్తిచూపారు. ఈ మోసం బారిన పడినవారు తక్షణమే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930కి కాల్ చేయడం ద్వారా, లేదా మోసం జరిగిన గంటల వ్యవధిలోనే సైబర్ క్రైమ్.గవర్నమెంట్.ఇన్ ఫిర్యాదు చేయడం ద్వారా ఫలితం ఉంటుందని చెప్పారు.

# డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**హయత్‌నగర్, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని విష్ణు నగర్ కాలనీ, సి ఎస్ ఆర్ కాలనీ ఫేస్ 2 లో మార్నింగ్ వాక్ కార్యక్రమం లో భాగంగా కాలనీ వాసుల ఆహ్వానం మేరకు సమస్యలను కాలనీవాసులతో జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విష్ణు నగర్ కాలనీలో దాదాపు అన్ని సి.సి రోడ్లు పూర్తి చేసుకోవడం జరిగిందని వారు అన్నారు. కొన్ని రోడ్లలో ఇళ్ల నిర్మాణం లేకపోవడంతో, ఇప్పుడు కొత్తగా నిర్మించుకున్న ఇళ్ల వద్ద కూడా భూగర్భ డ్రైనేజీ నిర్మించడం జరిగిందని వారు తెలిపారు. తొందరలోనే సి.సి రోడ్లు నిర్మాణం కూడా పూర్తి చేయిస్తామన్నారు. జాతీయ రహదారి నుండి బృందావన్ కాలనీ, విజయనగర్ కాలనీ మీదుగా విష్ణునగర్ కాలనీ నుండి శివం హిల్స్ కాలనీకి చేరుకునే రోడ్డును కూడా తొందరలోనే నిర్మిస్తున్నామని వారు తెలియజేశారు. సి ఎస్ ఆర్ కాలనీలో నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఇంకా కాలనీలో మిగిలి ఉన్న సమస్యలను స్వయంగా కాలనీలో పర్యటించి పర్యవేక్షించడం జరిగిందని వారు అన్నారు. వినతిపత్రం ద్వారా తెలియపరిచిన సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అతి తొందరలో సమస్యలను పరిష్కరిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సిహెచ్.సింహాద్రి చారి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, మధు నాయక్, లింగ స్వామి గౌడ్, రవి గౌడ్, మానియా నాయక్, కృష్ణ రెడ్డి, పక్కెరయ్య, జి.మహేష్, యం.శంకరయ్య, ఉపేందర్, వెంకట్, డి.రవి కుమార్, పెద్దిరాజు, ప్రసాద్, అనంత రెడ్డి, రామ్ రెడ్డి, బ్రహ్మ చారి, శ్రీధర్, రత్నాకర్, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్‌చెరు, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** నియోజకవర్గంలో మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతి కోసం సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్చెరు పట్టణంలోని సాకి చెరువు, తిమ్మక్క చెరువులలో మూడు లక్షల 50 వేల చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షులు గున్నాల నరసింహులు, జిల్లా మత్స్యశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్, గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాయ్ కాడి విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, పృథ్వీరాజ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎట్టయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలకు కొత్త సారథుల ప్రమాణ స్వీకారోత్సవం

- ఐదేళ్లపాటు ప్రజలకు సేవచేసే అవకాశం
- 22 నెలల తర్వాత ప్రత్యేక పాలనకు తెర




**సంగారెడ్డి, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** 22 నెలలుగా సర్పంచులు కావాలని ఎదురుచూసిన ఆశావాలకు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయి బాధ్యతలు కూడా చేపట్టారు. సోమవారం జిల్లాలోని వివిధ గ్రామాల సర్పంచులు ఆయా గ్రామాల పరిధిలో ప్రమాణస్వీకారం చేశారు. మునిపల్లి మండలంలోని బుదేరా సర్పంచ్ గా కోలుకుందా మల్లేశం, మునిపల్లి సర్పంచిగా రాజగోని సౌందర్య, చిన్న చెల్మెడ సర్పంచిగా గాయత్రి, కంకల్ సర్పంచ్ గా అబ్బెంద కవిత, పెద్ద గోపులారం సర్పంచ్ గా మల్లేశం యాదవ్, అల్లాపూర్ సర్పంచిగా నారాయణ యాదవ్, పెద్ద చెల్మెడ సర్పంచిగా రాధాబాయి జోషి, లింగంపల్లి సర్పంచిగా ఇర్ఫాన్ పటేల్, చీలపల్లి సర్పంచిగా విజయలక్ష్మి, హైద్లాపూర్ సర్పంచిగా తలారి రమేష్, తక్కడపల్లి సర్పంచిగా ఆనంద్, ఇబ్రహీంపూర్ సర్పంచ్ గా ల్యాగల అశోక్ తో పాటు వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ... 22 నెలలుగా సర్పంచ్ ఎన్నికల కోసం ఎదురు చూసామని ఇప్పటికీ సర్పంచ్ ఎన్నికలు పూర్తయి బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాలలో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచులు తెలిపారు.

## విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయండి

- జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



**మునిపల్లి, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని కంకోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పాఠశాల సముదాయం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గణిత దినోత్సవం సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసారు. జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పాఠశాల స్థాయిలో పెండింగ్ లో ఉన్న పలు రికార్డులను పూర్తి చేయాలని ఆయన ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భీంసింగ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తుకారం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం



**బెజ్జంకి, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** బెజ్జంకి గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం సోమవారం ఎంపీడీవో ప్రవీణ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బొల్లం శ్రీధర్,ఉపసర్పంచ్ దుమాల మహేష్‌తో పాటు 14 వార్డుల వార్డు సభ్యులు విధివిధానాల ప్రకారం ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బొల్లం శ్రీధర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి,పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.ప్రతి వార్డు సమస్యలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు.ఉపసర్పంచ్ దూమల మహేష్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సర్పంచ్‌తో కలిసి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ప్రమాణస్వీకార కార్యక్రమానికి గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు



**బోడుప్పల్, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శ్రీ చైతన్య స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహభరితంగా మరియు విద్యా ప్రాధాన్యతతో నిర్వహించారు. గణితశాస్త్ర ప్రాముఖ్యతను విద్యార్థుల్లో పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో గణిత మేళా నిర్వహించబడింది. అన్ని తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల గణిత నమూనాలు, చార్టులు మరియు సృజనాత్మక ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు గణిత సూత్రాలు మరియు వాటి దైనందిన జీవన అన్వయాలను స్పష్టంగా వివరించాయి.అన్ని విద్యార్థులు గణిత మేళాలో పాల్గొని తమ ప్రతిభ, సృజనాత్మకత మరియు సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ మేళా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలకు మించి గణితాన్ని అన్వేషించే చక్కటి వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ సామ అశోక్ రెడ్డి, డైరెక్టర్ సామ సాయి అభిషేక్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సామ శోభా రాణి సమక్షంలో అలాగే తల్లిదండ్రుల హాజరుతో ఘనంగా నిర్వహించబడింది. విద్యార్థుల ప్రతిభను చూసి వారు ప్రశంసలు తెలియజేసి, పిల్లలకు ప్రోత్సాహం అందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేసి ప్రోత్సహించడంతో ఈ వేడుక విద్యా మరియు వినోదాత్మకంగా సాగింది. శ్రీనివాస రామానుజన్ సేవలను స్మరిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి మరియు ప్రేమను పెంపొందించింది.

## విద్యార్థులకు గణితం అంటే భయం పోవాలి



**మాగనూర్, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** విద్యార్థులకు గణితం అంటే భయం పోవాలని గణితం ఉపాధ్యాయురాలు పుంజనూర్ సంధ్య విద్యార్థిని విద్యార్థులకు భరోసా కల్పిస్తున్నారు, ,సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతియ గణీత దినోత్సవం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి నీ ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ మురళీధర్ రెడ్డి ఎస్ఎంసి చైర్మన్ ఇందిరమ్మ, ఉపాధ్యాయ బృందం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన గణిత ప్రాజెక్టు నమూనాలు ఆకట్టుకున్నాయి, గణితం ఉపాధ్యాయురాలు పుంజనూర్ సంధ్య మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

## నూతన సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



**ఊర్కొండ, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన ఊర్కొండ మండల పరిధిలోని అన్ని గ్రామాల గెలుపొందిన,ఉప సర్పంచులు వార్డు సభ్యులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొంది నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులను పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు ప్రజలు, అభిమానులు వారికి పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సర్పంచులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమ అభివృద్ధి ధ్యేయంగా నిత్యం వారికి అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో వివిధ గ్రామాల మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బండరవిరాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే లక్ష్యం




**బండరవిరాల, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** బండరవిరాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తానని సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ పేర్కొన్నారు.ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు సోమవారం తమ బాధ్యతలను స్వీకరించారు.అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలోని కొత్తగా ఎన్నికైన బండరవిరాల గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రమాణ స్వీకారాలతో గ్రామ పంచాయతీ సందడిగా మారింది.అనంతరం సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్,ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్లు ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి ప్రత్యేక అధికారుల పాలన నుంచి నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.స్వలాభం కోసం కాకుండా నిరంతరం గ్రామ అభివృద్ధికై పాటుపడతామని,గత సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని బండరావిరాల గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.తమపై ఎంతో నమ్మకంతో గొప్ప అవకాశం కల్పించిన బండరావిరాల గ్రామ పంచాయతీ ప్రజలకు పేరుపేరునా ప్రత్యేక అభినందనలు,కృతజ్ఞతలు తెలియజేశారు.ఆయన గురువు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ నేర్పిన క్రమశిక్షణ,రాజ్యాంగ బద్ధంగా గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల్లో సంక్షేమ పథకాలు అమలుపరచి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అత్యధిక మెజార్టీతో సర్పంచిగా ఎన్నికయ్యారు.సోమవారం పంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ తహసిల్దార్ రమేష్ ఆధ్వర్యంలో సర్పంచిగా డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి,పంచాయతీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ మల్లురవి,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వం అని అన్నారు.పేద ప్రజల అభివృద్ధి కొరకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలుపరచి, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు.మీపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సర్పంచులు నిరంతరం అందుబాటులో ఉండి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేసి ప్రజా సేవకులుగా పేరుపొందాలని సూచించారు.పార్టీలకతీతంగా ప్రజలకు సేవలను అందించాలని తెలిపారు.మండలంలో గెలుపొందిన సర్పంచులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రమాదేవి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు,గ్రామ ప్రజలు,తదితరులు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
23 డిసెంబర్ 2025

# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**• రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. అన్ని కేటగిరీలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 33 లక్షల ఓటర్లను మ్యాపింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయబడిన కేటగిరి ఏ జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని, తద్వారా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పోర్టల్ లో నమోదు చేయబడుతుందని తెలిపారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అన్ని మండలాల తహసిల్దార్లతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ మ్యాపింగ్ ప్రక్రియపై ఇప్పటికే జిల్లాలోని బిఎల్ఓలు, సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటివరకు 45 శాతం మ్యాపింగ్ పూర్తయిందని, ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. 40% కన్నా తక్కువ మ్యాపింగ్ జరిగిన పోలింగ్ స్టేషన్లను గుర్తించి అక్కడ ఎస్ఐఆర్ వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ,ఆర్డీఓ అలివేలు,ఎన్నికల విభాగం అధికారి కరుణాకర్, వివిధ మండలాల తహసిల్దార్ లు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా..

### అప్పాజీ పల్లి సర్పంచ్ నాయన వెంకట్ గౌడ్



**మెదక్, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** ఎన్నికల ముందు గ్రామానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని నూతన సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ ( గజినీ ) స్పష్టం చేశారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజీ పల్లి గ్రామ పంచాయతీ కొత్త పాలక వర్గం సోమవారం కొలువుదిరింది. ప్రత్యే కాధికారి ఎఈ శుష్మ పాలక వర్గం తో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ గజినీ వెంకట్ గౌడ్ మాట్లాడుతూ బిల్లులతో సంబంధం లేకుండా గ్రామం లో అభివృద్ధి కార్యక్రమాలు చెప్పాడుతానన్నారు. నూతన సంవత్సరం లోగా వార్డు లన్నింటిలో ఎల్ ఈ డి బల్బులు పెట్టి స్తానన్నారు.గ్రామాన్ని అన్నింటిలో ముందుంచుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలం నర్సిములు, వార్డు సభ్యులు నర్సిములు, సావిత్రి, రామాంజం, సుశీల, శేకులు,కార్యదర్శి పణిందర్, నాయకులు పహాడ్ పాషా, వీరేశం, సురేష్, యాదగిరి, పాండు,తదితరులు ఉన్నారు.

## గ్రామ అభివృద్ధి కోసం అందరు సర్పంచులు పని చేయాలి

### గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



**శ్రీరంగాపూర్, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండలంలో శ్రీరంగాపూర్ గ్రామపంచాయతీ, తాటిపాముల, మరియు కంభలాపూర్ గ్రామపంచాయతీలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు ప్రమాణస్వీకారములో పాల్గొని శంకర్ గౌడ్ అభినందించారు.శ్రీరంగాపూర్ సర్పంచ్ ముంత మద్దిలేటి, ఉపసర్పంచ్ ఖాజా, తాటిపాముల సర్పంచ్ శ్రీమతి.ముంత శిరీష మద్దిలేటి, ఉపసర్పంచ్ గంధం కుర్మయ్య, కంభలాపూర్ సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డి, ఉపసర్పంచ్ నార్య నాయక్ మరియు వార్డు సభ్యులను పలుస శంకర్ గౌడ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడాదు ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధి కోసం రాజకియాలకు అతితంగా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామ ప్రథమ పౌరులుగా గ్రామానికి మంచి పేరు తిసుకు రావాలన్నారు.మహాత్మాగాంధీ కలలుకన్న స్వరాజ్యం తీసుకుని రావాలన్నారు. సోమవారం నూతన సర్పంచులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగాసర్పంచులు గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కోసం అందరి సహకారముతో అభివృద్ధి చేయాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నిరంతరం అందుబాటులో ఉంటూ అభివృద్ధి పథంలో సాగాలని కోరారు.ఈ ప్రోగ్రాం లో సుదర్శన్ రెడ్డి , ఎంపీ ఓ రాజు, పంచాయతి సెక్రటరీ ఆంజనేయులు, శ్రీరంగాపూర్ పంచాయతీ సెక్రెటరీ సహదేవుడు , తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ క్రికెట్ గ్రౌండ్‌ను ఐపీఎల్ వేదికగా అభివృద్ధి చేస్తాం

**• మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ క్రికెట్ గ్రౌండ్‌ను ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు అనువుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. కాకా వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన అంతర్ జిల్లా టీ20 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జనుంపల్లి అనిరుధ్ రెడ్డి, గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ ఈ వేదికను సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాకా వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ద్వారా యువ క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మంచి ఆలోచనతో ప్రారంభించిన కార్యక్రమాలు ఎప్పుడూ మంచి ఫలితాలు ఇస్తాయని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి ఈ టోర్నమెంట్ గొప్ప అవకాశమని, తాను కూడా క్రీడాకారులకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షులు శివసేన రెడ్డి, హెచ్‌సీఏ, డీసీఏ ప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు



**తూప్రాన్, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాళ్ళకళ్ లో గణిత దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. గణిత ఉపాధ్యాయులు నర్సింగం, నాగిరెడ్డి, మమత ల ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు క్విజ్, గణిత మేళ, స్పీచెస్ తదితర కార్యక్రమాలు నిర్వహిం చ రు. అన్ని రంగాల్లో గణితం అంతర్భాగమని ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ తెలిపారు. గణితం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఏ రంగంలో అయినా నిష్ణాతులుగా తయారవుతారని తెలిపారు. మల్టిప్లికేషన్ టేబుల్, యాంగిల్స్ అండ్ లైన్స్, టేబుల్ ఫ్లవర్స్, ప్రైమ్ నంబర్స్, షేప్స్ పార్క్, వాపార్ట్స్ ఆఫ్ యాంగిల్స్, జామెట్రికల్ పార్క్, కోఆర్డినేట్ పాయింట్స్ ఇన్ గ్రాఫ్ నేరాల్లో తదితర మోడల్స్ బాగా ఆకట్టుకున్నాయి. అనంతరం గెలుపొందిన వారికి వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, స్టెల్లా, స్వరూప రాణి, రత్నశ్రీ, . ముఖిద్, మాలతి తదితరు ఉపాధ్యాయులు ఉన్నారు.

## బాలికలు, మహిళల భద్రత కోసం షీ టీమ్ ప్రత్యేక అవగాహన




**మల్దకల్, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల్ జిల్లాలో బాలికల భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని,జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు,ఐపిఎస్. ఆదేశాల మేరకు గద్వాల్ షీ టీమ్ అవగాహన చేశారు.మల్దకల్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈవ్ టీజింగ్, మహిళలపై వేధింపులు,పబ్లిక్ ప్రదేశాలలోఎదురయ్యే ప్రమాదాలు,వాటిని ఎలా గుర్తించాలి,వాటినుంచి ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై విద్యార్థులకు సవివరంగా వివరించారు.వేధింపులకు గురయ్యే సందర్భంలో విద్యార్థులు ఎటువంటి సంకోచం లేకుండా వెంటనే షీ టీమ్ హెల్ప్‌లైన్ 8712670312 ను సంప్రదించాలని అధికారులు సూచించారు.కాల్ చేసిన వారి వివరాలు కూడా గోప్యంగా ఉంచుతాము అని తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని, ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేసి,కఠిన చర్యలు తీసుకున్నట్లు షీ టీమ్ తెలిపింది.జిల్లా పోలీస్ శాఖ బాలికలు,మహిళల భద్రత, గౌరవ పరిరక్షణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా విస్తరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ఎం.తేజస్విని, కానిస్టేబుల్ శేషన్న,వుమెన్ కానిస్టేబుల్ లోకేశ్వరి,కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణ,అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## బీరంగూడ కమ్యూనిటీ హాల్ ప్రహరీకి అనుమతి ఇవ్వండి



**సంగారెడ్డి, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** అమీన్పూర్ మున్సిపాలిటీలోని బీరంగూడ కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బీరంగూడ గ్రామ ప్రజలు సోమవారం అమీన్పూర్ తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అదెల్లి రవీందర్‌తో పాటు గ్రామ పెద్దలు మాట్లాడుతూ...గుట్ట కమాన్ ప్రాంతంలో ఉన్న బీరంగూడ కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలని తహసిల్దార్ కు వింత పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. కాలిస్థలం ఉండటం వల్ల అనేక రకాలుగా ఇబ్బందులు ఉన్నాయని కావున కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ నిర్మించడం వలన చుట్టూ పరిశుభ్రత ఉండడమే కాకుండా బీరంగూడ ప్రజలకు అనేక రకాలుగా ఉపయోగించు కునేందుకు అవకాశం ఉందన్నారు. కావున ప్రహరీ నిర్మించుకునే విదంగా సహకరించి అనుమతి ఇవ్వాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ నాయకులు అదెల్లి రవీందర్ ,గుట్టమీది చిన్న వీరేష్, పెద్ద వీరేష్ ,ఎడ్ల రాజ, మల్లేష్ ,నక్కల కిష్టయ్య , దండు జ్ఞానేశ్వర్, ఎడ్ల అశోక్ ,సారా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**• హెచ్ఎం వీరస్వామి, సర్పంచ్ రవి**
**• జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా గణిత దినోత్సవం**





**చేర్యాల, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** చేర్యాల మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గణిత శాస్త్ర ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో గణిత దినోత్సవం సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకునూరు ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శనిగరం వీరస్వామి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి నూతన సర్పంచ్ కొమ్ము రవి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నడుస్తూ విద్యార్థులను ఎంతో చైతన్యవంతంగా తీర్చిదిద్దుతూ అనర్గళంగా ఇంగ్లీష్, హిందీ, మాట్లాడుతున్నారని, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వీరస్వామి మాట్లాడుతూ.. గణితం మన దైనందిన జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని, తర్కశక్తి, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తుందని తెలిపారు. గణితాన్ని భయపడకుండా ఆసక్తితో నేర్చుకుంటే భవిష్యత్తులో గొప్ప విజయాలు సాధించవచ్చని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో విద్యార్థులు తయారుచేసిన గణిత నమూనాలు, సూత్రాల ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు గణిత శాస్త్ర ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లవి, పాఠశాల చైర్మన్ సైదా బేగం, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ బుకింగ్ మొబైల్ యాప్‌పై అవగాహన పెంపొందించుకోవాలి



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ఎరువులు విక్రయించే డీలర్లు ఫర్టిలైజర్ బుకింగ్ మొబైల్ యాప్‌పై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డీలర్లకు ఫర్టిలైజర్ బుకింగ్ మొబైల్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో మన జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కొంత ఫర్టిలైజర్ కొరత ఏర్పడడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారనీ, రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాకు ఇలాంటి యాప్లు సహకరిస్తాయని పేర్కొన్నారు. తమ మొబైల్ ఫోన్లో యాప్ను డౌన్లోడ్ చేసుకుని బుకింగ్ లావాదేవీల నిర్వహణపై డీలర్లకు సంబంధిత మండల వ్యవసాయ శాఖ అధికారులు సహకరించాలన్నారు. యాప్ ద్వారా ఎరువుల కొనుగోలులో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే విషయాన్ని వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రతి డీలరు యాప్ ను డౌన్లోడ్ చేసుకుని విజయవంతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, కోపరేటివ్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకల కోసం నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభం



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** అప్పనపల్లి గ్రామంలో సోమవారం రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య,డైరీ అభివృద్ధి,క్రీడలు,యువజన శాఖా మంత్రి వాకిటి శ్రీహరి,మంత్రులు పొన్నం ప్రభాకర్,మహమ్మద్ అజహరుద్దీన్‌లతో కలిసి గొర్రెలు, మేకలకు, నట్టల నివారణ (డీవార్మింగ్) మందులు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ, గొర్రెల కాపరుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతిసారి, సంవత్సరానికి రెండు సార్లు చేపట్టే నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా, ఈ సారి కూడా ప్రభుత్వం రూ. 4.5 కోట్లతో నట్టల నివారణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి అన్నారు. గొర్రెలు, మేకలు వ్యాధుల కారణంగా మృతి చెందినప్పుడు కాపరులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కొత్త బీమా పథకాలను తీసుకువస్తోందని మంత్రి తెలిపారు. పశుపోషణే అనేక కుటుంబాలకు ప్రధాన జీవనాధారం కావడంతో, వాటి రక్షణకు ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందన్నారు. కుక్కల దాడుల నుంచి గొర్రెలు, మేకలను కాపాడేందుకు ప్రభుత్వం తేలికపాటి బలమైన నెట్‌లను కాపరులకు అందజేస్తోందని తెలిపారు. ఇవి ఉపయోగించడానికి సులభంగా ఉండటంతో పాటు రాత్రి సమయంలో కూడా పశు వులకు మెరుగైన రక్షణ కల్పిస్తాయని వివరించారు. అలాగే, గొర్రెల కాపరుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ప్రభుత్వం కాపరి మరణ బీమా పథకాన్ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. పాము కాట్లు లేదా ఇతర ప్రమాదాల వల్ల కాపరులు మరణించినట్లయితే వారి కుటుంబాలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పరిహారం అందించనున్నట్లు మంత్రి ప్రకటించారు. నట్టల నివారణ కార్యక్రమం ద్వారా పశు వుల ఆరోగ్యం మెరుగుపడి, ఉత్పాదకత పెరుగుతుందని, అనవసర మరణాలు తగ్గుతాయని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని, వెటర్నరీ సిబ్బందితో సహకరించాలని కాపరులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బి.సి. సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మధుసూదన్ గౌడ్, అధికారులు,, గొర్రెల కాపరి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విపత్తులపై మోరంచపల్లి వాగులో మాక్ డ్రిల్

- సహాయక చర్యలు చేపట్టడంపై సమన్వయం ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వరదల వంటి విపత్తుల సమయంలో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఏ) ఆదేశాల మేరకు సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి వాగు పరిధిలో వరదల వంటి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై సమగ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షాల కారణంగా వరదలు రావడం, వాగులు ఉప్పొంగడం, ప్రజలు, పశువులు నీటిలో చిక్కుకుపోవడం వంటి విపత్తు పరిస్థితుల్లో ప్రజలను, పశువులను కాపాడేందుకు ముందస్తు అవగహన కార్యక్రమం మాక్ డ్రిల్ ఎంతనానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. వరదల సమయంలో జిల్లా యంత్రాంగం తక్షణమే ఎలా స్పందించాలి, వివిధ శాఖలు సమన్వయంతో సహాయక చర్యలను ఎలా అమలు చేయాలి అనే అంశాలపై ప్రత్యక్షంగా ప్రదర్శించారు. మోరంచపల్లి వాగులో వరద ప్రవాహంలో చిక్కుకున్న వ్యక్తులను, పశువులను సురక్షితంగా రక్షించే విధానాలు, నీటిలో కొట్టుకుపోయిన వారిని గుర్తించి బయటకు తీసుకురావడం, అవసరమైతే పరిసర కాలనీలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాలను మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. అలాగే అత్యవసర సేవలు తదితర అంశాలను వివరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆశోక్ కుమార్, విజయలక్ష్మి, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఆర్డిఓ రవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్, పశు సంవర్ధక శాఖ అధికారి డా కుమార స్వామి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా మధుసూదన్, జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ తరుణి ప్రసాద్, ఈడీఎం శ్రీకాంత్ వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికపరమైన ఆస్తుల సమస్య పరిష్కారం కోసం 3 నెలల పాటు మీ డబ్బు, మీ హక్కు అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ నెల 24న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉమ్మడి శిబిరం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా మీ డబ్బు, మీ హక్కు అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి గత అక్టోబర్ 4న గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఇది అక్టోబర్ 01 నుంచి 2025 డిసెంబర్ 31 వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల వివరాలు ఆర్‌బీఐ ఉద్గమ్ వెబ్‌సైట్ (ht tps://udgam.rbi.org.in) ద్వారా పొందొచ్చని ఆయన సూచించారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని ఎల్డిఎం తిరుపతిని ఆదేశించారు.

**పర్యాటక పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్**

పర్యాటక పోస్టర్ ను సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రదేశాల సమాచారంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకశాఖ 100 ప్రదేశాలను వీకెండ్ డెస్టినేషన్ చేయడానికి ప్రోత్సాహికుల నుండి పర్యాటక ప్రాంతాలను పర్యాటక శాఖ వెబ్సైట్లో అప్లోడ్ చేయడానికి ఈ పోటీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అద్భుతమైన పర్యాటక ప్రాంతాలను ప్రాచుర్యం కల్పించే విధంగా 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలోని పర్యాటక ప్రదేశం స్పష్టంగా కనిపించేలా మూడు ఫోటోలు, 60 సెకండ్ల వీడియో 100 పదాల్లో ప్రత్యేకతను వివరిస్తూ జనవరి 5లోగా గూగుల్ ఫామ్ లో **https://FORMS.GLE/VVJB7NZW-BUZ7WW.JY6** సమర్పించాలని సూచించారు. అందులో హైదరాబాద్ నుంచి కనెక్టివిటీ, వసతి తదితర వివరాలను తెలియజేయాలని సూచించారు. 50, 30, 20 వేల రూపాయలు బహుమతి ఇస్తామన్నారు. 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అంద చేస్తామని, సంక్రాంతి రోజున కైట్ ఫెస్టివల్లో ఈ బహుమతులు ప్రధానం చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పర్యాటక అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**శాయంపేట, డిసెంబర్ 22 (జనంసాక్షి)** : గ్రామీణ అభివృద్ధే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం శాయంపేట మండలంలో ఎమ్మెల్యే పర్యటించారు. శాయంపేట, పత్తిపాక, జోగంపల్లి, పెద్దకోడెపాక గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్, పాలకవర్గం సభ్యులచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలకవర్గం నిత్యం పని చేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య మరియు ఆరోగ్య రంగాల్లో ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పారదర్శకతతో పాలన సాగించాలని నూతన సర్పంచ్‌కు మరియు పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా కృషి చేయాలని కోరారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

# రాజకీయాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు

- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి బాటలు
- గతంలో లేని విధంగా నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రజల సమస్యలే పరిష్కారంగా పనిచేస్తున్నాం
- 7 వ డివిజన్ లో రూ.100 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని..



**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 22 (జనం సాక్షి)** : రాజకీయాలకు అభివృద్ధి విషయంలో తావులేకుండా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం 7వ డివిజన్ లో రూ.100 లక్షలతో సైడ్ డ్రైనేజీ నిర్మాణం,కల్వర్ట్ నిర్మాణం మరియు పబ్లిక్ గార్డెన్ లో చిన్న పిల్లలకు ఆట వసతుల కల్పన లకు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాకాజీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పరిశీలించారు. వర్షాకాలంలో ప్రధానంగా డ్రైన్ ద్వారా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగరంలో అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, యూత్ నాయకులు తోట పవన్ ,మాజీ కార్పొరేటర్ శేఖర్,సోమ నాగేశ్వర్ రావు,బిన్నీ లక్ష్మణ్ వాకర్ అసోక్యుయేషన్ గాంధీ పాల్గొన్నారు.

# ఎస్వీఆర్ స్కూల్‌లో మ్యాథమెటిక్స్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు




**జనగామ ప్రతినిధి, డిసెంబర్ 22(జనంసాక్షి):** రామానుజన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో మ్యాథమెటిక్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన గణిత ప్రదర్శన (ఎగ్జిబిట్) ను పాఠశాల కరస్పాండెంట్ కీర్తి వీరేందర్ గారు, ప్రిన్సిపల్ ప్రభాకర్ గారు మరియు ఉపాధ్యాయ బృందం సందర్శించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. తదనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు గణితానికి సంబంధించిన పాటలు, నృత్యాలు, క్విజ్ పోటీలు తదితర కార్యక్రమాలను ఉత్సాహంగా ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కీర్తి వీరేందర్ గారు మాట్లాడుతూ, నిత్య జీవితంలో లెక్కల ప్రాముఖ్యత, గణిత అధ్యయనం వల్ల పిల్లల్లో లాజికల్ థింకింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలు ఎలా అభివృద్ధి చెందుతాయో వివరించారు. గణితం పిల్లల సమగ్ర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు.



# గణితం జీవితానికి వెలుగునిచ్చే మార్గం

- కరస్పాండెంట్ పంచకం నరసయ్య
- అరవింద పబ్లిక్ స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం

**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గణితమేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో విద్యార్థులు జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత ఉపాధ్యాయురాలు దివ్యశ్రీ నేతృత్వంలో విద్యార్థులు చక్కటి గణిత ఎగ్జిబిట్స్ ను తయారు చేసుకొని వచ్చి ప్రదర్శించి వాటి గురించి వివరించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ఎగ్జిబిట్స్ ను తిలకించి విద్యార్థులను అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నర్సయ్య మాట్లాడుతూ ఆధునిక కాలంలో గణితం లేకుండా జీవితాన్ని ఊహించలేమని, గణితం జీవితానికి వెలుగునిచ్చే మార్గమని తెలిపారు. గణితం కేవలం సంఖ్యలు, సూత్రాలు మాత్రమే కాకుండా ఆలోచన శక్తిని, తార్కికతను, సమస్యల పరిష్కారాన్ని చూపుతోందని సూచించారు. అందుకని విద్యార్థులు గణితంలో భయపడకుండా ఆసక్తిగా నేర్చుకుంటే భవిష్యత్తు బంగారు మయమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె అశ్విని, ఏ నర్మద, అఫ్రీన్, ఏ సుస్మిత, కె గౌతమి, ఎం రమ్య, జి లీనాశ్రీ, జి బాలప్రభ, పి స్రవంతి, కె కస్తూరి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెన్నారావుపేటలో ప్రమాణ స్వీకారం వద్ద రసాభాస!

- కుర్చీలతో కొట్టుకున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్న ఇరు వర్గాలు



**చెన్నారావుపేట, డిసెంబర్ 22 (జనం సాక్షి):** ప్రమాణ స్వీకారం వద్ద కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు కొట్టుకున్న సంఘటన చెన్నారావుపేట గ్రామపంచాయతీ వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఇటీవల జరిగిన మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి కంది శ్వేత రెడ్డి చెన్నారావుపేట గ్రామ సర్పంచ్ గా గెలుపొందారు. ఉప సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ నుండి దొంతి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం కొద్దిసేపట్లో ప్రారంభం కానుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సంబంధించిన తెలంగాణ పాటలు డీజేలో వస్తుండగా ప్రమాణ స్వీకారం వద్ద బిఆర్ఎస్ పార్టీ పాటలు ఎందుకు పెడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు వనపర్తి శోభన్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. అప్పటికే బిఆర్ఎస్ నాయకులు డీజేలో వస్తున్న పాటలను నిలిపివేశారు. అంతలోపే ఇరువురి మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ప్రమాణ స్వీకారం వద్ద ఉన్న కుర్చీలను తీసుకొని ఇరు పార్టీల నాయకులు దాడికి దిగారు. ఈ దాడిలో కాంగ్రెస్ నాయకులు వనపర్తి శోభన్, 10వ బిఆర్ఎస్ వార్డు సభ్యుడు మూడు రమేష్ లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన నాయకులు పోలీస్ స్టేషన్లో వేరువేరుగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో చెన్నారావుపేట గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం మండల ఎన్నికల అధికారి, ఎంపీడీవో వెంకటశివానంద్ ప్రమాణస్వీకారం చేయించి వెళ్ళిపోయారు.



## వరదలు, విపత్తులపై అప్రమత్తత

- నిర్మల్‌లో విజయవంతమైన మాక్ ఎక్సర్‌సైజ్

**నిర్మల్ బ్యూరో, డిసెంబర్ 22 (జనంసాక్షి)** : పట్టణంలోని జిఎన్ఆర్ కాలనీలో సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పర్యవేక్షణలో విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్‌ను విజయవంతంగా నిర్వహించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బందితో పాటు ప్రజల భాగస్వామ్యంతో కృత్రిమ పరిస్థితుల్లో సాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతనంగా ఎన్నికైన సర్పంచులు, పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం


- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్



**మహదేవపూర్ డిసెంబర్ 22 (జనంసాక్షి)** : మహదపూర్ మండలంలో 18 గ్రామపంచాయతీలలో ఎన్నికైన సర్పంచుల వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవం చేసినారు. మండలంలో కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ ఉపసర్పంచ్ వార్డు సభ్యులప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయితప్రకాశ్ రెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోటరాజబాబు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి హాజరైనారు. సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్. పాలకవర్గం ప్రమాణ స్వీకారం అను నేను హసీనా భాను అక్బర్ ఖాన్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైనందున శాసనము ద్వారా భారత రాజ్యాంగం పట్ల నిజమైన నమ్మకంతో నేను స్వీకరించబోతున్న విధిని విజేతగా నమ్మకంగా నిర్వహిస్తానని ప్రమాణ స్వీకారోత్సవం చేసినారు. అనంతరం ఈ సందర్భముగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు పాలకవర్గం ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేయాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహాయ సహకారముతో గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు తాగునీటి పారిశుధ్యం, డ్రైనేజీలు ఆరోగ్య విద్యా రంగాల్లో ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు నిరంతరం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ స్పెషల్ ఆఫీసర్ డిఎల్పిఒ మల్లికార్జున్ రెడ్డి. పంచాయతీ కార్యదర్శి కల్పన. మాజీసింగిల్ విండో చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి. మాజీ దేవస్థానం చైర్మన్ వామరావు. యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తడుకల జగదీష్ చక్రధర్ కడర్ల నాగరాజు రవి చందర్, రాఘవేంద్ర గ్రామస్తులు పాల్గొన్నారు.

## బొంబాయి వదిలి స్వగ్రామానికి వచ్చాను

- టాక్లి గ్రామ అభివృద్ధి నా ధ్యేయం : సర్పంచ్ సోలంకి విష్ణు



**బాసర, డిసెంబర్ 22 (జనంసాక్షి)** : నిర్మల్ జిల్లా బాసర మండలానికి చెందిన టాక్లి గ్రామ సర్పంచిగా సోమవారం పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోలంకె విష్ణు మాట్లాడుతూ నా తల్లి ఆశయం నెరవేర్చడానికి బొంబాయినీ వదిలి నా సొంత గ్రామ అభివృద్ధి చేయడానికి వచ్చాను అని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తన చిన్ననాటి స్నేహితులతో కలిసి సంతోషంతో గ్రామంలో నెలకొన్న సమస్యలన్నింటినీ మీ అందరి సహాయంతో పరిష్కరిస్తానని అన్నారు. తనకంటూ మా అమ్మ దయవల్ల దేవుడి దయవల్ల అన్ని విషయాలలో నాకేమీ తక్కువ లేదు. అయినప్పటికీ తన సొంత ఊరు అభివృద్ధి చేయాలని సంకల్పంతో గ్రామంలో సర్పంచ్ కి పోటీ చేసి మీ అందరి సహాయంతో నన్ను గెలిపించినందుకు తప్పకుండా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీలిచ్చారు.

# సమస్యలను తీర్చేలా పాలకవర్గం పనిచేయాలి

- ప్రజా సమస్యలను పట్టించుకోవాలి
- అందుబాటులో ఉండి పని చేయాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గ్రామ ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా కొత్త సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు మెంబర్లు నిత్యం పని చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం చిట్యాల మండలం చల్లగరిగ, ఒడితల, రేగొండ మండల కేంద్రం, కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట, గణపురం మండలం బుద్దారం, గణపురం, చెల్పూర్, భూపాలపల్లి మండలం మొరంచపల్లి గ్రామాల్లో జరిగిన సర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో కొత్త సర్పంచ్, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలకవర్గం నిత్యం పని చేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పారదర్శకతతో పాలన సాగించాలని నూతన సర్పంచ్‌కు, పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా కృషి చేయాలని కోరారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

# సర్పంచులు ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్ పూర్, డిసెంబర్ 22 (జనంసాక్షి)** : నూతనంగా గెలిచిన సర్పంచులు, పాలక మండలి సభ్యులు గ్రామాలలో ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో సర్పంచ్ మంద పురం రాణి అనిల్ గౌడ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమా నికి మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్గన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడు తూ కొత్తగా ఎన్నికైన సర్పంచులు ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అవినీతి, అక్రమాలకు దూరం గా,నీతి నిజాయితీతో పని చేసినప్పుడే ప్రజల మన్నన లు పొందగలుగుతారని సూచించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకం గా ఉంటూ వారి కష్టసుఖాలలో అండగా నిలవాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, నాయకులు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, తోట వెంకన్న, అజయ్ రెడ్డి, మందపురం ఎల్ల గౌడ్, మునిగల రమేష్, రవి, యాదగిరి, కట్టయ్య , అధికారులు,ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పం చులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## లింగరావుపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

- ప్రజలందరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటా
- నూతన సర్పంచ్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన కాసు శ్రీనివాస్ రెడ్డి



**తలకొండపల్లి, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం లింగరావు పల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసి,పదవి బాధ్యతలు చేపట్టిన కాసు శ్రీనివాస్ రెడ్డి..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా,పార్టీలకు అతీతంగా సేవ చేస్తానని తెలిపారు.ప్రజలందరికీ నిత్యం అందుబాటులో ఉండి నా దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించి ఆదర్శ సేవకునిగా పనిచేస్తానని అన్నారు.గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసి ముందంజలో ఉంచడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి,వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి,గ్రామ ప్రజలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయాల్లో అప్రమత్తత ద్వారా నష్టాలను నివారించొచ్చు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- బూర్గంపహాడ్‌లో భారీ మాక్ డ్రిల్ నిర్వహణ




**బూర్గంపహాడ్, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** అత్యవసర సమయాల్లో అప్రమత్తత ద్వారా నష్టాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలో సోమవారం విపత్తుల సమయంలో సమర్థవంతమైన స్పందన కోసం విస్తృత స్థాయి మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యక్షంగా పాల్గొని, ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఈ ఓ సి) ద్వారా అన్ని శాఖల చర్యలను పర్యవేక్షించారు. మాక్ డ్రిల్‌ను ఫైర్ శాఖ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో అబ్జర్వర్‌గా ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ సుఖేందర్ దత్ పర్యవేక్షణలో నిర్వహించబడింది. క్షేత్ర స్థాయిలో ఈ మాక్ డ్రిల్ బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలోని వరద ప్రభావిత ప్రాంతంలో జరిగింది. ఇందులో ప్రజలను సురక్షితంగా రక్షించడం, లైఫ్ జాకెట్లు, బోట్లు ఉపయోగించి వారిని పునరావాస కేంద్రాలకు తరలించడం, అవసరమైన వైద్య సేవలు, త్రాగునీరు, భోజనం, తాత్కాలిక నివాసం వంటి సేవలను డెమో రూపంలో ప్రదర్శించారు. వివిధ శాఖల అధికారులు సిబ్బందితో కలిసి ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో సేవలను బాధితులకు అందించడం, ఫైర్, ఇరిగేషన్, గజ యితగాళ్ల పాత్రను, వారు చేపట్టే అత్యవసర చర్యలను ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు త్రాగునీరు, భోజనం, అత్యవసర వైద్య సేవలు, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలను డెమో రూపంలో చూపించారు. అలాగే, బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల ద్వారా బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ సిబ్బంది (ఈఎంసి), రెవెన్యూ సిబ్బంది పాల్గొని బాధితులకు అవసరమైన ఏర్పాట్లు, సహాయ సేవలను సమన్వయంతో అందించారు. బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..అత్యవసర సమయంలో అప్రమత్తత ద్వారా నష్టాలను నివారించవచ్చని, యువత, విద్యార్థులు, శాఖల అధికారులు సమన్వయంతో చురుకుగా పాల్గొనాలని చెప్పారు. ఎన్‌సిసి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ అత్యవసర పరిస్థితుల్లో వారు ఏ విధంగా స్పందించాలో, ఎలాంటి చర్యలు చేపడతారో తెలుసుకున్నారు. మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితులలో సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేయగల సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, భవిష్యత్తులో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ఇలాంటి మాక్ డ్రిల్‌లు కీలకమని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో అన్ని బృందాలు సమన్వయంతో పనిచేయాలి, ఆధ్యాత్మిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలి అని తెలిపారు. ప్రతి సంవత్సరం వరదలు సంభవించే బూర్గంపాడు లాంటి ప్రాంతాల్లో ఇటువంటి మాక్ డ్రిల్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో, అధికారుల్లో విశ్వాసం పెరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్, పోలీస్ శాఖ సిబ్బంది, ఎన్ డి ఆర్ ఎఫ్ అధికారి, సీనయ్య, డిడిఆర్ఎఫ్ సిబ్బంది, ఎన్సిసి, ఫైర్, రెవెన్యూ, వైద్యశాఖ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్ల ప్రమాణ స్వీకారం

- ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**మునుగోడు, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** మునుగోడు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్,పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై నూతన సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ లతో పాటు వార్డ్ మెంబర్లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్థికంగా బలపడిన వ్యక్తులు తమ గ్రామాభివృద్ధి కోసం సమయం కేటాయించి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజల మధ్యలో వుండి ప్రజల సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనీ, గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వం తరుపున సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా గెలిపించినందుకు గ్రామ ప్రజలకి రుణపడి వుంటాననీ అన్నారు. గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా అందరినీ కలుపుకొని మునుగోడు గ్రామ పంచాయతీ ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతామని వాగ్దానం చేశారు.పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సూపరిండెంట్ భాస్కర్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో నల్లగొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్,మాజీ డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నార బోయిన రవి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి,పాల్వాయి చెన్నారెడ్డి,పాల్వాయి గోవర్దన్ రెడ్డి,ఎస్ ఆర్ వెంకటేశ్వర్లు,వివిధ శాఖల అధికారులు,మాజీ ప్రజాప్రతినిధులు,యువత, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి త్రివేణి విద్యార్థి ప్రాజెక్టు ఎంపిక



**ఖమ్మం, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** ఈ నెల 20,21 న రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి బాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాల కు చెందిన విద్యార్థులు తయారుచేసిన మూడు ప్రాజెక్టులు ఒకటి ప్రథమ బహుమతిని, రెండు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నవి. ప్రథమ బహుమతి గెలుపొందిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక ఐనది . ప్రథమ బహుమతి పొందిన ప్రాజెక్టు వివరాలు 8వ తరగతికి చెందిన హరి చరణ్ చేసిన క్రాప్ రెసిడ్యూ టు బయో అరోమాటిక్స్ జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక ఐంది . 9 వ తరగతికి చెందిన లోకేష్ సాయి చేసిన రైతా మిత్రా కి మరియు ఉత్తేజ్ చేసిన ఫైర్ ఫైటింగ్ రోబోట్ కి ద్వితీయ బహుమతులు లభించాయి . బహుమతులు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ అధికారిని చైతన్య జైనీ జిల్లా సైన్స్ కోఆర్డినేటలు మరియు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, సీఏసీ నటరాజ్,సెంట్రల్ సైన్స్ ఆఫీసర్ సుబ్బారావు, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్,పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ,ముస్తఫా సైన్స్ ఇంచార్జ్ బాలాజీ ,క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయుని ,ఉపాధ్యాయులు అభినందించారు.

## హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అవార్డులు

**మేళ్లచెరువు, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ డిసెంబర్ 19 నుండి 21 వరకు నోయిడాలోని జి. ఎల్. బజాజ్ ఇన్స్టిట్యూట్లో నిర్వహించిన 39వ ఎన్సీక్యూసీ అవార్డుల సందర్భంలో, స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి వచ్చిన రెండు టీమ్లు ఎక్సెలెంట్ అవార్డులు వచ్చాయని సంస్థ యూనిట్ హెడ్ యన్ శ్రీనివాసరావు తెలిపారు. సంస్థ నుంచి పాల్గొన్నటువంటి టీం మెంబెర్స్ ఈ అవార్డులను అందుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు తమ సంస్థకు వచ్చినందుకు సంస్థ యూనిట్ హెడ్ యన్ శ్రీనివాసరావు, అవార్డు రావడానికి కృషి చేసిన టీమ్ మెంబర్స్ అందరికీ అభినందనలు తెలియజేశారు. ఇటువంటి అవార్డులు భారతదేశంలోని మంచి ప్రతిభను కనపరిచిన పరిశ్రమలకు వస్తాయని ఆయన చెప్పారు.






## రాళ్ళగూడుపల్లిలో బీజేపీ జెండా రెపరెపలు



**మోమిన్‌పేట, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** మోమిన్‌పేట మండలం, రాళ్ళగూడుపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచుల ప్రమాణ స్వీకారోత్సవం నేడు అంగరంగ వైభవంగా జరిగింది. భారతీయ జనతా పార్టీ బిజెపినాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం, గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించింది. నూతన సర్పంచ్‌గా ఎన్నికైన వర్యా మహిపాల్ మరియు ఉప సర్పంచ్‌గా బాలు గౌడ్ గ్రామస్తుల సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మోమిన్‌పేట బీజేపీ మండల అధ్యక్షులు, ఆశి రెడ్డి మరియు ప్రముఖ బీజేపీ యువనాయకులు విజయ్ కుమార్, మరియు బీసీ నాయకులు పి.జి. జైపాల్ హాజరై, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ యువ మండలం అధ్యక్షులు ఆశి రెడ్డీ మాట్లాడుతూ గ్రామ ప్రగతి బీజేపీతోనే సాధ్యమని, రాబోయే రోజుల్లో రాళ్ళగూడుపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ కలలుగన్న 'గ్రామ స్వరాజ్యం' దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ వేడుకలో మాజి సర్పంచ్ శ్రీమతి మాచెడపల్లి సావిత్రమ్మ రాములు గౌడ్ ,గ్రామ పెద్దలు, బీజేపీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మానవత్వం ఉన్నవాళ్ళకి పదవి, పదవి ఉన్నవాళ్ళకు మానవత్వం ఉండాలి




**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** మానవత్వం ఉన్నవాళ్ళకి పదవి, పదవి ఉన్నవాళ్ళకు మానవత్వం ఉండాలని అప్పుడే నిష్కల్మషమైన ప్రజా సేవ చేస్తారని,మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక రెండవ మెజారిటీతో గెలిపించిన నారాయణపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరై, నూతనంగా ఎన్నికైన సర్పంచి, ఉపసర్పంచి,వార్డు మెంబర్లకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.అనంతరం ఏర్పాటుచేసిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. గెలిచిన ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని, పిలుపునిచ్చారు. నారాయణపూర్ లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పూర్తి చేయడానికి నా పూర్తి సహకారం ఉంటుందన్నారు. పాలకవర్గాన్ని ఇంత భారీ మెజారిటీతో గెలిపించిన నారాయణపురం ప్రజలు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## పాపిరెడ్డి నగర్, మదీనాగూడ అక్రమాలపై చర్యలపై 'ప్రజావాణి'లో డిమాండ్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** చందానగర్ సర్కిల్ పాపిరెడ్డి నగర్ పరిధి ప్లాట్ నెంబర్ 1827, చందానగర్ పరిధి సర్వే నెంబర్ 322, 324 లో, సర్వే నంబర్ 48 లో నెలకొని ఉన్న ఆక్రమణలను తక్షణమే నిర్మూలించాల్సిన అవసరం ఉందని కోరుతూ సోమవారం పలువురు ప్రజావాణిలో ఫిర్యాదుతో కూడిన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపిరెడ్డి నగర్ పరిధి ప్లాట్ నెంబర్ 1827 యాజమాన్యం దౌర్జన్యం గా రోడ్డును కబ్జాచేసి ప్రహరీ గోడ నిర్మాణాన్ని చేపట్టి రాకపోకలను పూర్తిగా నిరోధిస్తుండగా మరోవైపు చందానగర్ సర్వేనెంబర్ 322, 324 మరియు సర్వేనెంబర్ 48 లోని గ్రామాల మధ్యలో ఉన్న మిగులు భూమిని విన్ కాన్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం తప్పుడు దృక్పత్రాలను సృష్టించి ఖాళీ స్థలాన్ని, రోడ్డున సైతం కబ్జా చేసి దానిని ప్లాట్లుగా మలిచి అమ్ముకుంటున్నారని తక్షణమే వాటిని నిరోధించాల్సిన అవసరం ఉందని వారు డిసి కి ఫిర్యాదు చేశారు. ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు చోటుచేసుకుంటున్న జిహెచ్ఎంసి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం వారి అవినీతికి నిదర్శనంగా అభివర్ణించారు. తక్షణమే చర్యలు చేపట్టకుంటే తాము ప్రజా పోరాటానికి దిగక తప్పదని పాపిరెడ్డి నగర్ కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ బస్తీవాసులు కొండల్ రెడ్డి, ఎస్పి రెడ్డి, టి. నరసింహ, కుమార్ గుప్తా, ప్రవీణ్ గుప్తా, రాజేష్, కళ్యాణ్, సోను తదితరులు పాల్గొన్నారు.



## రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు గణితంలో ముందుకెళ్లాలి




**బొంరాస్‌పేట, డిసెంబర్ 22 (జనం సాక్షి) :** శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు గణితంలో ముందుకెళ్లాలని మండల విద్యాధికారి హరిలాల్ అన్నారు.సోమవారము శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం గణితంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో భాగంగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, అనిల్ కుమార్,మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకం పేరు మార్పును విరమించుకోవాలి

- ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్




**రామన్నపేట, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ కొత్త బిల్లు తీసుకురావడం వలన వికలాంగుల జీవనోపాధి పై తీవ్ర ప్రభావం చూపుతుందని, కేంద్రం తీసుకువచ్చిన బిల్లు రద్దు అయ్యే వరకు ఉద్యమం చేస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త బిల్లు కు సంబంధించిన పత్రాలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం, భూమిలేని, పేదరికంలో ఉన్న వికలాంగులకు గ్రామీణ ప్రాంతంలో ఉపాధికి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం వచ్చిందని అన్నారు. నిధుల కొరత, పని నిరాకరణ, డిజిటల్ హాజరు వ్యవస్థలు, పని ప్రదేశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడం వలన వికలాంగులలో పని చేసే వారి సంఖ్య తగ్గిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,38,088 మంది వికలాంగులకు ఈ పథకం కింద ఉపాధి కల్పించబడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త బిల్లు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని, గ్రామీణ ప్రాంతంలోని వికలాంగ కార్మికులకు జీవనోపాధిని మరింతగా కోల్పోయేలా చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వికలాంగులను తీవ్రమైన పేదరికంలోకి నెడుతుందని అన్నారు. ఈ బిల్లు 125 రోజుల పనిని అందిస్తుందనే వాదన పూర్తిగా తప్పుదారి పట్టించేదిగాఉందని అన్నారు. నిధుల కొరత కారణంగా సగటు ఉపాధి 50 రోజుల కంటే తక్కువగా ఉందని,వికలాంగులను ఉపాధికి అర్హులైన కార్మికులుగా, సామర్థ్యం ప్రకారం పని చేయడానికి మరియు జీవనోపాధి రక్షణకు చట్టబద్ధంగా గుర్తిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వి బి జి ఆర్ ఏ ఎం జి బిల్లు వికలాంగుల హక్కును బలహీనపరుస్తుందని, గ్రామీణ వికలాంగ కార్మికుల జీవనోపాధి, మనుగడకు ముప్పు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం, 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం స్ఫూర్తికి భిన్నంగా ఉందని అన్నారు. ఇది వివక్ష చూపకపోవడం, సరైన సౌకర్యాలు కల్పించడం, జీవనోపాధిని రక్షించడం చేస్తుందని అన్నారు. ఈ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. కొత్త బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం గాంధీని చంపినా గాడ్సే వారసుల పేరుతో పథకాన్ని తీసుకురావడం సరైంది కాదని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షణ కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి మండల కార్యదర్శి గిరికల లింగస్వామి మండల ఉపాధ్యక్షులు నాగు నరసింహ జిల్లా నాయకులు గొరిగె సోములు జిల్లా నాయకులు భావండ్లపల్లి బాలరాజు, కూనూరు మల్లేష్, బొడ్డుపల్లి అంజయ్య, ఎస్ వెంకటేశం, వరికుప్పల చంద్రయ్య, లవణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విపణి



## భారీ లాభాల్లో సూచీలు..

• మళ్లీ 26వేల ఎగువకు నిఫ్టీ

**ముంబయి:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ బలపడడం, వచ్చే ఏడాది అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు దీనికి తోడయ్యాయి. దీంతో రెండు ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. భారత్-న్యూజిలాండ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. సెన్సెక్స్ ఉదయం 85,145.90 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,929.36) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,601.33 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 638.12 పాయింట్ల లాభంతో 85,567.48 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 206 పాయింట్ల లాభంతో 26,172.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎల్అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్ మాత్రమే నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.20 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4, 411 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# శరవేగంగా ఐఫోన్ తయారీ

## ప్లాంట్‌లో 30,000 మంది నియామకం
## మహిళలకు పెద్దపీట



**న్యూఢిల్లీ:** భారతదేశ తయారీ రంగంలో నియామకాల పర్వం కొనసాగుతోంది. తైవాన్‌కు చెందిన దిగ్గజ సంస్థ ఫాక్స్‌కాన్ బెంగళూరు సమీపంలోని దేవనహళ్లిలో ఏర్పాటు చేసిన తన కొత్త ఐఫోన్ అసెంబ్లీ యూనిట్‌లో రికార్డు స్థాయిలో నియామకాలు చేపట్టింది. కేవలం 8 నుండి 9 నెలల వ్యవధిలోనే దాదాపు 30,000 మంది కార్మికులను నియమించుకోవడం ద్వారా తన కార్యకలాపాలను వేగవంతం చేసింది.

**మహిళలకు పెద్దపీట**

300 ఎకరాల ఈ భారీ సదుపాయంలో మొత్తం శ్రామిక శక్తిలో దాదాపు 80 శాతం మంది మహిళలే. వీరిలో మెజారిటీ ఉద్యోగులు 19-24 సంవత్సరాల వయస్సు కలిగిన వారు, మొదటిసారి ఉద్యోగంలో చేరుతున్న వారే కావడం గమనార్హం. వచ్చే ఏడాది నాటికి ఈ ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకుంటే మొత్తం ఉద్యోగుల సంఖ్య 50,000కు పెరుగుతుందని అంచనా. తద్వారా దేశంలోని ఏ ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థలో లేని విధంగా ఒకే ప్రాంగణంలో అత్యధిక మంది మహిళా కార్మికులు పనిచేస్తున్న ప్లాంట్‌గా ఇది రికార్డు సృష్టించనుంది.

ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ తయారీ ఇక్కడే..
ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో ఐఫోన్ 16 మోడల్‌తో ట్రయల్ రన్ ప్రారంభించిన ఈ ఫ్యాక్టరీ ప్రస్తుతం యాపిల్ అత్యాధునిక మోడల్ ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌ను తయారు చేస్తోంది. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తుల్లో 80 శాతానికి పైగా విదేశాలకు ఎగుమతి కానున్నాయి.

**ప్లాంట్ విశేషాలు**

సుమారు రూ. 20,000 కోట్లు పెట్టుబడి. 2,50,000 చదరపు అడుగుల విస్తీర్ణం. సగటున వేతనం నెలకు రూ. 18,000 (ఉచిత వసతి, సబ్సిడీ భోజనం). ఉద్యోగుల కోసం ఇప్పటికే 6 భారీ వసతి గృహాలు అందుబాటులోకి వచ్చాయి. 'మినీ టౌన్‌షిప్'గా దేవనహళ్లి కేవలం ఫ్యాక్టరీగానే కాకుండా ఈ ప్లాంట్ భవిష్యత్తులో ఒక మినీ టౌన్‌షిప్‌లా మారనుందని కంపెనీ చెప్పింది. ఇందులో నివాస సముదాయాలు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, వినోద సౌకర్యాలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే మహిళా కార్మికులకు ఇది ఎంతో ఆసరాగా నిలుస్తోందని అధికారులు చెబుతున్నారు.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 6.70
వరంగల్ ₹ 6.72

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్
₹ 1,24,800 (22 క్యారెట్లు)
₹ 1,36,150 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,31,000

## పొల్యూషన్ సర్టిఫికేట్ లేకుంటే నో పెట్రోల్!




**భువనేశ్వర్:** పర్యావరణ పరిరక్షణ, పెరుగుతున్న వాహన కాలుష్య నివారణే లక్ష్యంగా ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో చెల్లుబాటు అయ్యే 'పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికేట్'(పీయూసీ) లేని ఏ వాహనానికీ పెట్రోల్ లేదా డీజిల్ విక్రయించకూడదని రాష్ట్ర రవాణా యంత్రాంగం (ఎస్‌టీఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధనను తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఇండియన్ ఆయిల్ భారత్ పెట్రోలియం హిందుస్థాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు రిలయన్స్, షెల్ వంటి ప్రైవేట్ చమురు సంస్థలకు కూడా రవాణా శాఖ లేఖలు రాసింది. ప్రతి ఫ్యుయల్ స్టేషన్ వద్ద వాహనదారుడి పీయూసీ సర్టిఫికేట్‌ను సిబ్బంది భౌతికంగా లేదా డిజిటల్ రూపంలో తనిఖీ చేసిన తర్వాతే ఇంధనం పోయాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధనపై వాహనదారులకు, పెట్రోల్ బంక్ సిబ్బందికి తగినంత అవగాహన కల్పించాలని చమురు సంస్థలను కోరింది. ఒకవేళ సర్టిఫికేట్ లేని వాహనాలకు ఇంధనం సరఫరా చేస్తే సంబంధిత డీలర్లపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఎస్‌టీఏ హెచ్చరించింది. మోటారు వాహనాల చట్టం, 1988లోని సెక్షన్ 190(2), సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్, 1989లోని రూల్ 115 ప్రకారం.. ప్రతి వాహనం నిర్దేశిత ఉద్గార ప్రమాణాలకు లోబడి ఉండాలి. పీయూసీ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోందని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్రమైన స్థాయికి చేరడంతో అక్కడ ఇప్పటికే 'నో పీయూసీ - నో ఫ్యుయల్' విధానాన్ని అమలు చేస్తున్నారు. ఢిల్లీలో ప్రస్తుతం గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ-4) అమల్లో ఉంది. అదే బాటలో ఒడిశా ప్రభుత్వం కూడా ముందుస్తు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టింది.

## ధర ఎక్కువైనా.. 24 గంటల్లో కొనేశారు!



బ్రిటిష్ లగ్జరీ కార్ల బ్రాండ్ నుంచి బీఎండబ్ల్యు ఏజీ కింద భారతదేశంలో లాంచ్ అయిన.. లేటెస్ట్ కారు 'మినీ కూపర్ కన్వర్టిబుల్' వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందనను పొందింది. డిసెంబర్ 12న ఇండియన్ మార్కెట్లో ప్రారంభమైన ఈ మోడల్ మొదటి బ్యాచ్ బుకింగ్స్ 24 గంటల్లో పూర్తయ్యాయి. మినీ కూపర్ కన్వర్టిబుల్ ప్రారంభ ధర రూ. 58.50 లక్షలు (ఎక్స్ షోరూమ్). దీనికి సంస్థ మన దేశానికి సీబీయూ మార్గం ద్వారా దిగుమతి చేసుకుంటుంది. ఈ కారణంగానే దీని ధర కొంత ఎక్కువగా ఉంటుంది. మినీ కూపర్ కన్వర్టిబుల్ ధర సాధారణ కార్ల కంటే కొంత ఎక్కువే అయినప్పటికీ .. కొనుగోలుదారులు మాత్రం వెనక్కి తగ్గకుండా బుక్ చేసుకున్నారు. తరువాత బ్యాచ్ బుకింగ్స్ వచ్చే ఏడాది ప్రారంభంలో ప్రారంభం కానున్నాయి. ప్రీమియం ఫీచర్స్ పొందిన ఈ కారు నాలుగు వేర్వేరు రంగులలో లభిస్తుంది. కొత్త మినీ కూపర్ కన్వర్టిబుల్ సిగ్నేచర్ మినీ సిల్హౌట్ పొందుతుంది. దీని ముందు భాగంలో రౌండ్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, కొత్త రేడియేటర్ గ్రిల్ లేఅవుట్ చూడవచ్చు. ఇది 18-అంగుళాల ఏరోడైనమిక్ డ్యూయల్-టోన్ అల్లాయ్ వీల్స్‌పై నడుస్తుంది. వెనుక భాగంలో, ఇది ఫ్లష్ సర్ఫేస్ స్టైలింగ్‌లో పూర్తయిన ఎల్ఈడీ టెయిల్‌లైట్స్ కనిపిస్తాయి.

## కెనరా బ్యాంక్ కొత్త యాప్..
### ఏఐ ఫీచర్లతో..

డిజిటల్ చెల్లింపులను సురక్షితంగా చేసేందుకు ఉపయోగపడేలా ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ కొత్తగా 'కెనరా ఏఐ1పే' పేమెంట్స్ యాప్‌ని ప్రవేశపెట్టింది. యూపీఐ ప్లాట్‌ఫాం ద్వారా వేగవంతంగా, సురక్షితంగా పేమెంట్స్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని బ్యాంకు తెలిపింది. నెలవారీగా ఖర్చులను విశ్లేషించుకునేందుకు స్పెండ్ అనలిటిక్స్, సులువుగా క్యూఆర్ స్కాన్ చేసేందుకు విడ్జెట్ సదుపాయం, తక్షణ నగదు బదిలీలు.. బిల్లుల చెల్లింపులు మొదలైన వాటికి యూపీఐ ఆటోపేలాంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయని పేర్కొంది. అలాగే, పిన్ నంబరు ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండా చిన్న మొత్తాలను చెల్లించేందుకు వీలుగా యూపీఐ లైట్ ఫీచరు సైతం ఇందులో ఉన్నట్లు వివరించింది. ఇదే యాప్‌లో మల్టీలెవల్భద్రతా వ్యవస్థను కూడా పొందుపరిచినట్లు కెనరా బ్యాంక్ వెల్లడించింది. అనుమానాస్పద లావాదేవీలను తక్షణమే గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేసే విధంగా ఈ యాప్‌ను రూపొందించారు.

# మరాఠా రాజకీయాల్లో కీలక మలుపు



**ముంబై(జనంసాక్షి):** ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో మరాఠా రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రెండు దశాబ్దాలుగా ఎడమొహం, పెడమొహంగా ఉన్న ఠాక్రే సోదరులు చేతులు కలిపేందుకు సిద్ధమయ్యారు. కలిసికట్టుగా ముంబై ఎన్నికల బరిలోనే నిలిచేందుకు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ముందడుగు పడిందని, ఏ క్షణమైనా అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమైతే మున్ముందు ముంబై రాజకీయాలు మరింత రసవత్తరంగా ఉంటాయి. ముంబై రాజకీయాలు అనగానే ముందుగానే ఠాక్రే కుటుంబం గుర్తుకు వస్తుంది. మరాఠా పులిగా పేరొందిన బాల్ ఠాక్రే మహారాష్ట్రలో రాజకీయాలను శాసించారు. ఆయన తర్వాత శివసేన పార్టీ చాలా అటుపోట్లు ఎదుర్కొంది. ప్రస్తుతం రెండు పార్టీలుగా కొనసాగుతోంది. శివసేన పార్టీని ఏక్‌నాథ్ షిండే దక్కించుకోవడంతో బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే.. శివసేన(యూబీటీ) పేరుతో పార్టీని నడుపుతున్నారు. శివసేను చీల్చి బీజేపీతో ఏక్‌నాథ్ షిండే చేతులు కలపడంతో మహారాష్ట్ర రాజకీయాలు ఎన్నో మలుపు తిరిగాయి. ఈ క్రమంతో ఉద్ధవ్ ఠాక్రేపై సానుభూతి పెరిగింది. రెండు దశాబ్దాల వైరాన్ని వీడి రాజ్‌ఠాక్రే తన సోదరుడి చెంతకు వచ్చారు. కష్టకాలంలో సోదరుడికి అండగా నిలిచారు. ముంబై సహా 29 కార్పొరేషన్లకు జనవరి 15న జరగనున్న ఎన్నికల్లో కలిసికట్టుగా బరిలోకి దిగాలని ఠాక్రే సోదరులు నిర్ణయించారు. ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు కూడా జరిపాయి. చర్చలు ఫలించాయని, సీట్ల పంపిణీపై స్పష్టత వచ్చిందని ఇరు పార్టీల నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల్లో.. శరద్‌పవార్ ఎన్సీపీ, కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా తమ రెండు పార్టీల అభ్యర్థులనే పోటీకి దించాలని ఉద్ధవ్, రాజ్ ఠాక్రే నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు పూర్తియిందని, అధికారిక ప్రకటన రావడమే తరువాయి అని తెలుస్తోంది. బీఎంసీలో మొత్తం 227 వార్డులుండగా.. శివసేన (యూబీటీ) 157, మహారాష్ట్ర నవనిర్మాణ సేన 70 స్థానాల్లో పోటీకి చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ శరద్ పవార్ పార్టీకి ఇవ్వాల్సివస్తే ఉద్ధవ్ పార్టీ నుంచి 15 సీట్లు కేటాయిస్తారని చెబుతున్నారు. బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో శివసేన (యూబీటీ), ఎమ్మెన్నెస్ కలిసి పోటీ చేస్తే.. రెండు దశాబ్దాలలో ఠాక్రే వారసులు ప్రత్యర్థులుగా కాకుండా మిత్రులుగా పోటీ చేయడం ఇదే మొదటిసారి అవుతుంది. మహా వికాస్ అఘాడీలో శివసేన(యూబీటీ), శరద్ పవార్ ఎన్సీపీతో కలిసి కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉంది. అయితే బీఎంసీ ఎన్నికల్లో ఠాక్రే సోదరులు చేతులు కలపడంతో కాంగ్రెస్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో హస్తం పార్టీని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదనటుగా శివసేన నాయకులు మాట్లాడుతున్నారు. ఆ పార్టీకి చెందిన అధికార ప్రతినిధి ఆనంద్ దూబే చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించేలా ఉన్నాయి. గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ వరుసగా ఓడిపోతూనే ఉందని, అలాంటి పార్టీని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. తమకు, ఇతర పార్టీలకు సైద్ధాంతిక విభేదాలు ఉన్నందున ఈమేరకు ఆలోచిస్తున్నామని సచిన్ సావంత్ వెల్లడించారు.

**కలిసి సాధిస్తారా?**

గత కొంత కాలంగా ఉద్ధవ్ ఠాక్రేకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆయనకు చేదు అనుభవం ఎదురైంది. 288 మున్సిపల్ కౌన్సిళ్లు, నగర పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని అధికార మహాయుతి ప్రభుత్వం విజయదుందుభి మోగించింది. 207 చోట్ల గెలుపు సాధించి సత్తా చాటింది. విపక్ష మహా వికాస్ అఘాడీ 44 స్థానాలకే పరిమితమైంది. శివసేన(యూబీటీ)కి కేవలం 9 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఈ నేపథ్యంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలంటే బీఎంసీ ఎన్నికల్లో నిరూపించుకోవడం చాలా అవసరం. తమ కుటుంబానికి కంచుకోట అయిన మహారాష్ట్ర రాజధానిలో కలిసికట్టుగా బరిలోకి దిగుతున్న ఠాక్రే సోదరులు ఈసారి ఎలాంటి ఫలితాలు రాబడతారో చూడాలి.




# రష్యన్ జనరల్ హత్య

ఉక్రెయిన్ ప్రమేయం?

**మాస్కో:** రష్యా రాజధాని మాస్కోలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనలో సీనియర్ సైనిక అధికారి, లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్ మృతిచెందారు. రష్యన్ జనరల్ స్టాఫ్ పరిధిలోని 'ఆర్మీ ఆపరేషనల్ ట్రైనింగ్ డైరెక్టరేట్' అధిపతిగా పనిచేస్తున్న సర్వరోవ్, తన వాహనంలో ప్రయాణిస్తుండగా ఈ పేలుడు సంభవించింది. వాహనం కింద అమర్చిన పదార్థం కారణంగానే పేలుడు సంభవించి ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు రష్యా దర్యాప్తు కమిటీ ధృవీకరించింది. ఈ హత్య వెనుక ఉక్రెయిన్ ప్రత్యేక నిగూఢ సేవల ప్రమేయం ఉండవచ్చనే కోణంలో దర్యాప్తు అధికారులు విచారణను ప్రారంభించారు. గతంలోనూ ఇలాంటి దాడులు జరిగిన నేపథ్యంలో, ఇది ఉక్రెయిన్ గూఢచారి సంస్థల పథకమేనని రష్యా అనుమానిస్తోంది. అయితే ఈ ఆరోపణలపై ఉక్రెయిన్ నుంచి అధికారికంగా ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు.

# పదేళ్లపాటు డేటింగ్

ఎట్టకేలకు పెళ్లితో ఒక్కటైన లవ్‌బర్డ్స్

**సియోల్:** దక్షిణ కొరియాకు చెందిన నటి ,మోడల్ 41 ఏళ్ల షిన్ మిన్-ఆహ్ తన చిరకాల ప్రియుడు కిమ్ వూ-బిన్‌ను పెళ్లాడింది. డిసెంబర్ 20న సియోల్‌లోని జంగ్-గులోని ది షిల్లా హోటల్‌లోని రాయల్ హాల్‌లో అంగరంగ వైభవంగా వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. గత పదేళ్లుగా సెలబ్రిటీ కపుల్‌గా పేరుతెచ్చుకున్న వీరిద్దరి వెడ్డింగ్‌కు దక్షిణ కొరియాలోని ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి పలువురు అతిరథ మహారథులు హాజరయ్యారు.



వీరిలో ఖూ ఎ , ఖఆ నాహ్ యుంగ్-సుక్, దర్శకుడు చోయ్ డాంగ్-హూన్, రచయిత కిమ్ యున్-సూక్, కో డూ-సిమ్, లీ బైయుంగ్-హున్, పార్క్ క్యుంగ్-లిమ్, ఉమ్ జంగ్-హ్వా, గాంగ్ హ్యో-జిన్, కిమ్ యుయి-సుంగ్, యూన్ క్యుంగ్-హో, బే సియోంగ్-వూ, ఇమ్ జూ-హ్వాన్, కిమ్ టే-రి, ర్యు జున్-యెయోల్, అన్ బో-హ్యూన్, నామ్ జూ-హ్యూక్, బే జంగ్-నామ్ తదితరులు ఉన్నారు. మిన్-ఆహ్ ఐకానిక్ లెబనీస్ ఫ్యాషన్ హౌస్ ఎల్లీ సాబ్ బ్రైడల్ గౌనును ఎంచుకుంది. స్ప్రింగ్ 2026 బ్రైడల్ కలెక్షన్‌లోని అందమైన తెల్లని గౌనులో అందంగా మెరిసింది. సొగసైన నెట్టెడ్ వీల్ భారీ గౌను ధర రూ. 25.6 లక్షలు. కిమ్ వూ-బిన్ రాల్ఫ్ లారెన్ పర్పుల్ లేబుల్ సూట్‌ను ధరించాడు. ప్రియుడికి కేన్సర్ వచ్చినపుడు మరింత ప్రేమతో షిన్ మిన్-ఆహ్, కిమ్ వూ-బిన్ మొదటిసారి 2015లో ఒక ప్రకటన వాణిజ్య ప్రకటనలో కలుసుకున్నారు. 2015 నుంచి డేటింగ్ ప్రారంభించారు. 2017లో కిమ్ వూ-బిన్‌కు నాసోఫారింజియల్ క్యాన్సర్ సోకినపుడు షిన్ అతనికి సపోర్ట్‌గా నిలిచింది. పరస్పరం గౌరవించుకుంటూ, కరియర్‌లో ఎంతో కీర్తిని, ప్రజాదరణ పొందారు. దాదాపు దశాబ్దం తర్వాత, వివాహ బంధంలోకి అడుగుపెట్టిన వీరికి అభిమానులు శుభాకాంక్షలు అందించారు.

## జర్మనీకి ఇజ్రాయెల్ 'ఆరో' రక్షణ

బెర్లిన్: చారిత్రక శత్రుత్వం నుంచి బలమైన రక్షణ బంధం వైపు జర్మనీ, ఇజ్రాయెల్ దేశాలు అడుగు వేశాయి. హోలోకాస్ట్(రెండో ప్రపంచ యుద్ధంలో జరిగిన మానవ ఊచకోత) ముగిసిన 80 ఏళ్ల తర్వాత, జర్మనీ తన దేశ భద్రత కోసం ఇజ్రాయెల్ తయారు చేసిన 'ఆరో 3' క్షిపణి రక్షణ వ్యవస్థను కొనుగోలు చేసింది. ఇది రెండు దేశాల మధ్య మారిన సంబంధాలకు నిదర్శనంగా నిలిచింది. సుమారు 56 వేల కోట్ల రూపాయల భారీ వ్యయంతో ఈ కొనుగోలు ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్ రక్షణ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఒప్పందంగా రికార్డు సృష్టించింది. దీనిలో భాగంగా మొదటి విడత రక్షణ సామగ్రిని ఇజ్రాయెల్ ఇప్పటికే జర్మనీకి అందజేసింది. దీంతో జర్మనీ ఆకాశానికి పటిష్టమైన రక్షణ కవచం లభించింది.



# బంగ్లాలో అశాంతికి కారణమేంటి?

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. అయితే మహమ్మద్ యూనస్‌కు ఏమాత్రం రాజకీయానుభవం లేకపోవడం బంగ్లాదేశ్‌కు శాపంగా మారిందని మాజీ ప్రధాని షేక్ హసీనా అంటున్నారు. అంతర్జాతీయంగా బంగ్లాదేశ్ ప్రతిష్ట నానాటికీ దిగజారిపోతుందని.. భారత్‌లాంటి మిత్రదేశాలతో సంబంధాలు దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారామె. గతవారం బంగ్లాదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాడికల్ యువ నేత షరీఫ్ ఉస్మాన్ హాది (32)ని ఓ దుండగుడు కాల్చి చంపాడు. తదనంతరం చెలరేగిన ఘర్షణల్లో.. దీపు చంద్ర దాస్ (27) అనే హిందూ యువకుడు అతికిరాతకంగా మూక హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలపై ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా తీవ్రంగా స్పందించారు. ముహమ్మద్ యూనస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వ పాలనను అత్యంత బలహీనంగా ఉందని.. అక్కడ చట్టాలేవీ అమల్లో లేవని అన్నారామె. "అల్లర్లు.. మైనారిటీలపై దాడులు బంగ్లాదేశ్ స్థిరత్వాన్ని దెబ్బ తీస్తాయి. ప్రపంచం దృష్టిలో ప్రతిష్ట దిగజారిపోతుంది. మరీ ముఖ్యంగా భారత్‌లాంటి పొరుగు దేశాలతో సంబంధాలను కూడా బలహీనపరుస్తాయి" అని అభిప్రాయపడ్డారామె. గత కొంతకాలంగా బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు పెరిగిపోతున్నాయని.. భారత్ ఈ పరిస్థితిని అల్లకల్లోలంగా చూస్తోందని అన్నారామె. అయితే.. బంగ్లాదేశ్ అన్ని మతాలను గౌరవించే దేశమని.. కానీ, కొంతమంది మూర్ఖుల వల్లే ఈ పరిస్థితులు నెలకొన్నాయని.. ప్రజాస్వామ్యం తిరిగి స్థాపితమైతే, ఇలాంటి అశాంతి ముగుస్తుందని అభిప్రాయపడ్డారామె. యూనస్ ప్రభుత్వం జమాత్-ఇ-ఇస్లామీపై నిషేధాన్ని ఎత్తివేయడం, తీవ్రవాదులను కేబినెట్‌లో చేర్చుకోవడం. జైళ్లలో ఉన్న ఉగ్రవాదులను విడుదల చేయడం వంటి చర్యలను ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో తీవ్రవాద శక్తులు యూనస్‌ను ఉపయోగించుకుంటున్నాయని.. ఇది భారత్ సహా ప్రతీ దక్షిణాసియా దేశానికి ఆందోళన కలిగించే అంశమని అన్నారామె.

## భారత్-న్యూజిలాండ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

రానున్న ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు కాగలదని, రానున్న 15 ఏళ్లలో న్యూజిలాండ్ నుంచి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశం ఉందని మోదీ, లక్సన్ విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ మేరకు భారత ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది భారత మార్కెట్‌లోకి పాల ఉత్పత్తులు, తాజా పండ్లు, వైన్, ఉన్నిని ప్రధానంగా ఎగుమతి చేయాలని న్యూజిలాండ్ భావిస్తోంది. అయితే న్యూజిలాండ్ నుంచి డిమాండ్ ఉన్నప్పటికీ.. పాల ఉత్పత్తులపై సుంకాలకు ఎలాంటి రాయితీ ఇవ్వలేదు. ఇక, భారత్ నుంచి ఎగుమతులపై ఎలాంటి సుంకాలు ఉండవు. మనదేశంలోని నైపుణ్యం కలిగిన కార్మికులకు అవకాశాలు మెరుగుపడనున్నాయి. అక్కడి సర్వీస్ సెక్టార్‌ను మన సప్లయర్లు అందిపుచ్చుకోవడానికి వీలు కలగనుంది. దుస్తులు, ఫ్యాబ్రిక్స్, జౌళి, ఔషధాలు, శుద్ధ పెట్రోలు, వ్యవసాయ సామగ్రి, ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, వాహనాలు, ఇనుము-ఉక్కు, కాగితం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, రొయ్యలు, బాస్మతి బియ్యం, వ్యవసాయ ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేసే అవకాశం ఉంది.

### ఈ అవినీతి అధికారులను సాగనంపండి...

# ప్రభుత్వానికి సామాజికవేత్త 'మిద్దెల' మొర



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జిహెచ్ఎంసిని జలగల్లా పట్టిపీడిస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసిపి), అతని అనుంగు అనుచరులు అయిన కిందిస్థాయి సిబ్బందిని తక్షణమే సాగనంపాల్సిన అవసరం ఉందని, తద్వారా శేరిలింగంపల్లి ని అక్రమార్కుల నుండి పరిరక్షించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని సామాజికవేత్త, ప్రజా సమస్యల పోరాటయోధుడు మిద్దెల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఉప కమిషనర్ ప్రశాంతికి నేరుగా ఏసిపి పై ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధి శేర్లింగంపల్లి జెవి కాలనీ, గచ్చిబౌలి, కొండాపూర్ డివిజన్లో అక్రమాలు, అక్రమ నిర్మాణాలు పెట్రేగిపోతున్నాయని, కొందరు బిల్డర్లు సైతం బరితెగించి ఏసిపి అండదండలతో ఎంత మేర వీలైతే అంత అక్రమ నిర్మాణాలను చేపడుతూ కోట్లాది రూపాయల సొమ్మును వాటాలుగా పంచేసుకుంటూ శేరిలింగంపల్లి సర్కిల్ ను పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని మిద్దెల మల్లారెడ్డి దుమ్మెత్తి పోశారు. వీరి అవినీతిని చూసి విసుగెత్తిపోయిన ప్రజలు కనీసం ఫిర్యాదులు చేయడం లేదని, అసలు ఉద్యోగ బాధ్యత ఏమాత్రం తెలియని ఏసిపి ఎలా బాధ్యతాయుతమైన హోదాలో కొనసాగుతున్నాడో తమకు అంతు పట్టడం లేదని ఆయన వాపోయారు. వాటాలు సెటిల్ చేసే కింది స్థాయి సిబ్బంది సహకారంతో సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో పూర్తిగా అవినీతి సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేసి ఊహించని స్థాయిలో అక్రమాలను చేపడుతూ కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్మును బొక్కుతున్న ఏసిపి తదితరులు అక్రమార్కులతో అంట కాగుతూ అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారుతున్నారని ఆయన ఆరోపించారు. ఎక్కడ ఫిర్యాదు అందిన అక్కడికి వెళ్తున్న ఏసిపి ప్రభుత్వ పరంగా బాధ్యతాయుతంగా చర్యలు చేపట్టాల్సింది పోయి వారితో మిలాకత్ అయి అందరకాడికి దండుకోవడం రివాజుగా మార్చుకున్నాడని, ఇతని వల్ల శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం పూర్తిగా కలుషితమైపోయిందని మిద్దెల దుయ్యబట్టారు. ఏసిపి వెంకటరమణ, కిందిస్థాయి సిబ్బంది శేరిలింగంపల్లి నుండి వెళ్లిపోతే తప్ప స్థానికంగా అక్రమాలు ఆగే పరిస్థితి లేదని, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సదరు అవినీతి అధికారులపై శాఖా పరమైన కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# భారతదేశం కీర్తిని చాటి చెప్పిన మేధావి

- శ్రీనివాస రామానుజన్
- విద్యార్థులు రామాంజన్ ని ఆదర్శం తీసుకొని గణిత శాస్త్రంలో నైపుణ్యతను పెంచుకోవాలి
- కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు , మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్



**తాండూరు డిసెంబర్ 22(జనంసాక్షి) :** భారత దేశం కీర్తిని చాటి చెప్పిన మేధావి శ్రీనివాస రామానుజన్ అని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు , మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో నిదకృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ లో గణిత శాస్త్రజ్ఞుడు శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహంతో మరియు విద్యా స్ఫూర్తితో జరుపుకున్నారు.స్వాగత ప్రసం గంతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం సరస్వ తీ పూజ , శ్రీ శ్రీనివాస రామానుజ న్కి పూజ లు నిర్వహించి జ్ఞానం, జ్ఞానం , గణిత శ్రేష్ఠత యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ,మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ మరియు డైరెక్టర్ శ్రీ సతీష్ సర్, వారి ఉనికి విద్యార్థులకు , సిబ్బందికి స్ఫూర్తినిచ్చారు.వివిధ సమాచార, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. గొప్ప గణిత శాస్త్రజ్ఞులను వర్ణించే ఫ్యాన్సీ దుస్తుల పోటీశ్రీ శ్రీనివాస రామానుజన్, శ్రీ భాస్కర, శ్రీ ఆర్యభట్ట, శకుంతలా దేవి, శ్రీ నరేంద్ర కర్మాకర్. గణిత శాస్త్ర చరిత్రపై చేసిన జ్ఞానోదయమైన ప్రసంగించారు.శ్రీనివాస రామాంజన్ అతి చిన్న వయసు లోనే అపారమైన మేధస్సుతో ప్రపంచ శిఖరాలపై భారతదేశం కీర్తిని చాటి చెప్పిన మేధావిఅన్నారు. దాదాపుగా 3900 గణిత సమీకరణాలను కనుగొన్నాడని అందుకే మన దేశం ప్రతి సంవత్సరం ఆయన జన్మదినం పురస్కరించుకొని గణిత శాస్త్ర దినోత్సవం గా జరుపుతున్నా మన్నారు. కావున విద్యార్థులందరూ రామాంజన్ ని ఆదర్శం తీసుకొని గణిత శాస్త్రంలో నైపుణ్య తను పెంపొందించుకొని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎదగాలన్నారు.గణితమంటే అంకెల గారడీ కాదు. భయం వీడితే అత్యధిక మార్కులు సొంతం చేసు కోవచ్చ ని సూచించారు .

# రాష్ట్రాన్ని ఆగం పట్టించిన కేసీఆర్.. చంద్రబాబుపై విమర్శలా?

- తెలంగాణ ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టినా సిగ్గురావడం లేదా?
- టిడిపి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వంచ శ్రీనివాసరెడ్డి




**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 22(జనంసాక్షి):** రాష్ట్రం విడిపోయిన తర్వాత 10 సంవత్సరాలు తెలంగాణకు సీఎంగా పనిచేసిన కేసీఆర్ తెలంగాణను ఆగం పట్టించి ఇప్పుడు చంద్రబాబుపై విమర్శలు గుప్పించడం సిగ్గుచేటని టిడిపి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వంచ శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణను అప్పుల కుప్పగా మార్చి ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఫాంహౌస్ పాలనను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఉద్యమం ముసుగు ఇక చెల్లబోదని అన్నారు. కుతంత్రాలు, గజకర్ణ గోకర్ణ మంత్రాలతో కాలం గడపాలని చూసిన కేసీఆర్.. ఆయన కుటుంబం దోచుకున్నదంతా ప్రజలు కక్కిస్తారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ జలదోపిడికి వివాదం చేసిందని కేసీఆర్ దోపిడీ ముసుగు తీసి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. “10 ఏళ్లలో రెండు లక్షల కోట్ల సాగునీటి రంగంపై ఖర్చు చేశామన్నారు. కానీ కృష్ణా నదిపై ఉన్న బీమా నెట్టెంపాడు, కోయిలసాగర్ కల్వకుర్తి పాలమూరు రంగారెడ్డి డిండి ఎస్ఎల్బీసీ ప్రాజెక్టులో ఒక ప్రాజెక్టు అయిన పూర్తి చేసావా కేసీఆర్ అని అడుగుతున్నా. జలవివాదాల గురించి అసెంబ్లీలో చర్చిద్దాం అంటే పిరికిపందల ఎందుకు పారిపోతున్నావు” అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు గోదావరి నీటికి వాడుకోవాలని కృష్ణా నీటిని గోదావరిలో అనుసంధానం చేసినందుకు అప్పుడు సిబిఎన్ను కేసీఆర్ ఎందుకు మెచ్చుకున్నారు ప్రజలకు చెప్పాలన్నారు. బాబు గురించి ఎంత మాట్లాడితే అంత బీఆర్ఎస్ స్థాయి దిగజారిపోతుందని, రాబోయే రోజుల్లో తెలంగాణలో కేసీఆర్ పార్టీకి ఇక పుట్టగతులుండవని జోస్యం చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలను గాలికొదిలేసిన కేసీఆర్కు.. తెలంగాణ ప్రజలు ఇప్పటికే కర్రుకాల్చి వాత పెట్టారని విమర్శించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఉన్నంతవరకు బీఆర్ఎస్ను మళ్లీ అధికారంలోకి రానివ్వబోమని అన్నారు.

## అంకురా హాస్పిటల్స్ గ్రూప్ సీఓఓగా రాహుల్ దత్తా

**హైదరాబాద్ డిసెంబర్ 22(జనంసాక్షి):** మహిళలు, పిల్లలపై ప్రత్యేకత కలిగిన భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ప్రీమియర్ హెల్త్కేర్ గొలుసు అంకురా హాస్పిటల్స్, నేడు రాహుల్ దత్తాను గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. అంకురాలో గతంలో ఆపరేషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్గా ఉన్న దత్తా, కొత్త, ఇప్పటికే ఉన్న మార్కెట్లలో కంపెనీ వేగవంతమైన వృద్ధి మధ్య ఈ విస్తరించిన పాత్రను చేపట్టారు. దాదాపు రెండు దశాబ్దాల ఆరోగ్య సంరక్షణ అనుభవంతో, అతను ఆసుపత్రి కార్యకలాపాలు, మార్కెటింగ్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ఆరోగ్య బీమాను విస్తరించి సమగ్ర దృక్పథాన్ని తీసుకువస్తాడు. ఈ నైపుణ్యం అతన్ని క్లినికల్ ఎక్సలెన్స్ను ఆర్థిక సామర్థ్యంతో అనుసంధానించడానికి వీలు కల్పిస్తుంది, ఎల్లప్పుడూ రోగి-కేంద్రీకృత ఫలితాలకు ప్రాధాన్యత ఇస్తుంది. అంకుర హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాహుల్ దత్తా ఇలా అన్నారు.

మా బృందాలకు అధికారం ఇచ్చే, మేము సేవ చేసే ప్రతి తల్లి, బిడ్డకు సజావుగా, ప్రపంచ స్థాయి అను భవాలను అందించే బలమైన వ్యవస్థలపై దృష్టి సారించి, మా కార్యకలాపాలకు నాయకత్వం వహిం చడం నాకు గౌరవంగా ఉంది అన్నారు.

# విపత్తులపై విజయవంతంగా ముగిసిన మాక్ ఎక్సర్ సైజ్

**నిశితంగా పర్యవేక్షణ జరిపిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ బ్యూరో, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో చేపటాల్సిన తక్షణ చర్య లు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధత ను తెలుసుకునేందుకు వీలుగా సోమవారం నిజామా బాద్ జిల్లాలో చేపట్టిన మాక్ ఎక్సర్ సైజ్ విజయవంతంగా కొనసాగి ంది. జిల్లా పాలనాధికారి టి.వినయ్ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో మూడు చోట్ల ఏకకాలంలో నిర్వహించిన కార్యక్రమాలు విపత్తుల నిర్వహణలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించాయి. విపత్తుల సమయాలలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను మరిపించేలా చేశాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, విపత్తుల సమ యాలలో ఏవిధంగా వ్యవహరించాలన్నది కళ్ళకు కట్టినట్టు ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. డ్రోన్ లు, వాటర్ బోట్ లు, అంబులెన్స్ లు, అగ్నిమాపక శకటాలు, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటిచెబు తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి. ఆయా శాఖల అధికారులతో పాటు ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు. ఈ కార్యక్రమం ప్రాధాన్యతను గుర్తించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తూ, ముందస్తు గానే పక్కా పర్యవేక్షణతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం సత్ఫలితాలు అందించింది. మాక్ ఎక్సర్ సైజ్ నిర్వహణ తీరును పరిశీలించేందుకు హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా విచ్చేసిన అబ్జర్వర్ పి.సురేష్ కుమార్ వాస్తవికతను మరిపించే విధంగా కొనసాగిన సహాయక చర్యలను సంతృప్తి వెలిబుచ్చారు.

# జర్నలిస్టుల సమస్యలకు తక్షణ పరిష్కారం కావాలి

- ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు అమలు చేయాలి
- టిడబ్ల్యూజేఎఫ్
- డిమాండ్లు - అదనపు కలెక్టర్కు వినతిపత్రం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి , డిసెంబర్ 22 (జనంసాక్షి) :** జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భద్రత, విద్యా సౌకర్యాలు కల్పించాలం టూ టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ గళమెత్తింది. ఇటీవల నిర్వహించిన మూడో జిల్లా మహాసభలో ఆమోదించిన తీర్మానాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి అందజేస్తూ, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరింది. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా పనిచేస్తున్న జర్నలిస్టులు కనీస భద్రత లేకుండా జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఎక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, మెడికల్ హెల్త్ కార్డులు వెంటనే అందిం చాలని, అలాగే వారి పిల్లలకు అన్ని విద్యాసంస్థల్లో ఉచిత విద్య కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు పి. మల్లేశ్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న సుమారు 700 మంది జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని తీవ్రంగా విమర్శించారు. జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయి ప్రెస్ క్లబ్ భవనం, ప్రతి నియోజకవర్గంలో ప్రెస్ క్లబ్ల ఏర్పాటు జర్నలిస్టుల అవసరమని స్పష్టం చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై స్పందించేలా ప్రత్యేక రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బానోతు రవి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యతే ఆయుధమని పేర్కొన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ చేపట్టే ఉద్యమాలకు జర్నలిస్టులంతా భుజం కలపాలని పిలుపునిచ్చారు. మహిళా జర్నలిస్టుల భద్రతపై ప్రత్యేకంగా మాట్లాడిన జిల్లా ఉపాధ్యక్షురాలు జి.రోజారాణి, సోషల్ మీడియాలో మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న అసభ్యకర ట్రోలింగ్ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజేంద్ర, బాలు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. రాంబాబు, బి. నరేందర్, జిల్లా సహాయ కార్యదర్శులు సింగం రాజు, ఐ. సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు జి. పాండు గౌడ్, బి. రజినీకాంత్ గౌడ్, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, కే. మహేందర్, పి.వి. దుర్గాప్రసాద్, సహదేవ్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెర్లపల్లిలో పరిశ్రమల అగ్ని ప్రమాద నివారణపై మాక్ డ్రిల్





**అత్యవసర పరిస్థితుల్లో స్పందనపై శాఖల సమన్వయ ప్రదర్శన**

**మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మార్గనిర్దేశకత్వంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పరిశ్రమల ప్రమాదాల నివారణపై సోమవారం విస్తృత స్థాయి మాక్ డ్రిల్ నిర్వహించారు. చెర్లపల్లి ప్రాంతంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్మార్ట్ టెర్మినల్లో సాయంత్రం ఐదు గంటల నుంచి ఈ మాక్ డ్రిల్ కొనసాగింది. ఒక ట్యాంక్ నుంచి మరొక ట్యాంక్కు నూనె పంపింగ్ సమయంలో అధికంగా పొంగిపొర్లి అగ్ని ప్రమాదం సంభవించినట్లు పరిస్థితిని సృష్టించి, ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మధ్య సమన్వయం, సహాయక బృందాల స్పందన వేగం, ప్రజల ప్రాణాలు , ఆస్తులను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ మాక్ డ్రిల్ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించారు. పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో సంభవించే ప్రమాదాల సమయంలో నష్టాన్ని తగ్గించేందుకు ఇటువంటి సాధనాత్మక అభ్యాసాలు ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, అగ్నిమాపక శాఖ, వైద్య శాఖ, పరిశ్రమల భద్రత విభాగం, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ట్రాఫిక్, పౌర సరఫరాల శాఖ, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, రహదారులు-భవనాల శాఖ, జీహెచ్ఎంసీ, లాజిస్టిక్స్ విభాగాలు సమన్వయంతో పాల్గొని ప్రమాద నివారణ చర్యలను ప్రదర్శించారు. అలాగే ప్రజలకు సరైన సమాచారం చేరవేయడానికి సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మీడియా పాయింట్ ఏర్పాటు చేసి, విపత్తుల సమయంలో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ఎప్పుడూ అప్రమత్తంగా ఉండేలా ఇటువంటి మాక్ డ్రిల్లులు కీలకంగా ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

## పల్లెలు అభివృద్ధి చెందుతేనే దేశం అభివృద్ధి చెందుతుంది

**ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 22 (జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాల్లో సోమవారం నూతన సర్పంచ్, పాలకవర్గాల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లలే దేశానికి పట్టు కొమ్మలని, పల్లెలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు పోతే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని,నూతన సర్పంచ్ పాలకవర్గం గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజలు మీపై ఎంతో బాధ్యత పెట్టారన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో నేను ఎంపీపీ,జడ్పిటీసీ గా పనిచేసినని గ్రామాలకు నా వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వస్తున్న నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ఎల్లపుడు అండగా ఉంటమన్నారు. వేములవాడ అర్బన్ మండలంలో ఆయన వెంట ఎంపీడీవో కీర్తన ఎంపీఓ వజీర్,మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి జర్నలిస్టుల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు

- టీయూడబ్ల్యూజే నాయకులు
- చందానగర్లో ఘనంగా శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం




**శేరిలింగంపల్లి, డిసెంబర్ 22(జనంసాక్షి):** శేరిలింగంపల్లి జర్నలిస్టులు ఎదురుచూస్తున్న సొంతింటి కల సకారం దిశగా అడుగులు పడుతున్నాయని టియుడబ్ల్యూజే నాయకులు తెలిపారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని చందానగర్ పీజేఆర్ స్టేడియంలో సోమవారం శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పైళ్ల విట్టల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సగరలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అండదండలతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహకారంతో చందానగర్ లో శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వం 1 ఎకరా స్థలాన్ని కేటాయించిందని అన్నారు. సదరు స్థలంలో జర్నలిస్టులకు సొంతింటి కలను సాకారం చేసేందుకు టియుడబ్ల్యూజే, ప్రెస్ క్లబ్ ల ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లిలో జర్నలిస్టుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా ఈ స్థలం పక్కనే ఉన్న మరో ఎకరా స్థలం మంజూరు కోసం ప్రయత్నిస్తున్నామని, ఇప్పటికే ఈ విషయాన్ని ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగే విధంగా టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ ను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన ఘనత తమదని.. ఎక్కడా లేని విధంగా అక్రిడేషన్ కార్డులను పెంచి వర్కింగ్ జర్నలిస్టులకు గుర్తింపు కార్డులను అందజేశామని అన్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడేషన్ కాలపరిమితి ముగిసి 20 నెలలు గడుస్తున్నా రెన్యువల్ చేయడం లేదని వాపోయారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం టియుడబ్ల్యూజే ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణం కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పదవి అలంకారం కాదు బాధ్యత



**హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 22 (జనంసాక్షి):** పదవి అనేది ధర్పం కోసమో, అలంకారం కోసమో కాదని, పదవి అనేది ఒక బాధ్యత అని ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా, ప్రజలతో మమేకమవుతూ, ప్రభు త్వ సంక్షేమ కార్యక్రమాలను అట్టడుగు స్థాయి ప్రజలకు అందజేయవలసిన అవసరం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఉందని తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ప్రజాప్రతినిధులుగా ప్రమాణం చేస్తున్న సర్పంచులుగా, ఉప సర్పం చ్లుగా, వార్డు సభ్యులుగా విజయం సాధించిన అందరికీ తన అభినందనలు తెలియజేసారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిం చాలని గ్రామ ప్రథమ పౌరుడిగా పౌరురాలిగా ప్రతి ఒక్కరికి కష్ట సుఖాలలో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయా లని సూచించారు.

# అబిడ్స్‌లోని టీజీఎస్సీఓ షాప్‌ను సందర్శించిన మంత్రి సీతక్క

- పలు చీరలను కొనుగోలు చేసిన మంత్రి
- నేతన్నలను ప్రోత్సహించే విధంగా చేనేత చీరలు కొనుగోలు చేయాలి
- మేడారం జాతరలో స్టాల్ ను ఏర్పాటు చేయాలని సూచన



**హైదరాబాద్, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** అబిడ్స్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టీజీఎస్సీఓ) షాప్‌ను మంత్రి సీతక్క సోమవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మంత్రి సీతక్కకు స్వాగతం పలికి, షాప్‌లోని వివిధ విభాగాలను వివరించారు. షాప్‌లో ప్రదర్శనకు ఉంచిన చేనేత కార్మికులు నేసిన చీరలను పరిశీలించిన మంత్రి సీతక్క, వాటి నాణ్యత, రంగులు, డిజైన్లపై ప్రశంసలు కురిపించారు. అనంతరం కొన్ని చేనేత చీరలను స్వయంగా కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, టీజీఎస్సీఓ షాప్‌కు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికులు ఎంతో కష్టపడి, నైపుణ్యంతో, తరతరాలుగా వచ్చిన అనుభవాన్ని ఉపయోగించి అద్భుతమైన డిజైన్లతో చీరలు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ లభిస్తున్న చీరలు సంప్రదాయానికి ప్రతీకగా ఉండటంతో పాటు, ఆధునిక మహిళలకు కూడా నచ్చే విధంగా ఉన్నాయన్నారు. రాబోయే సమక్క-సారలమ్మ జాతరలో భక్తులకు అందుబాటులో ఉండేలా చేనేత చీరలను విక్రయించాలని, అందుకోసం అక్కడ ఒక చిన్న స్టాల్ ఏర్పాటు చేయాలని టీజీఎస్సీఓ ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆ ఉద్దేశంతోనే ఈ రోజు అబిడ్స్‌లోని టీజీఎస్సీఓ షాప్‌ను సందర్శించామన్నారు. ఇక్కడి చీరలు తనకు ఎంతో నచ్చాయని, మంచి రంగులు, ఆకర్షణీయమైన డిజైన్లతో చేనేత వస్త్రాలకు నిజమైన గుర్తింపునిస్తున్నాయని మంత్రి సీతక్క అన్నారు. చేనేత కార్మికుల ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా వారి శ్రమకు, కష్టానికి గౌరవం ఇచ్చిన వారమవుతామని చెప్పారు. ప్రజలంతా టీజీఎస్సీఓ వంటి ప్రభుత్వ ధ్యేయంతో నిర్వహిస్తున్న చేనేత వస్త్రాలయాలను సందర్శించి, పండుగలు, శుభకార్యాల సందర్భంలో ఇక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత కార్మికులను ప్రోత్సహించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# జిహెచ్ఎంసి, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

**సిఐటియు మండల కమిటీ సభ్యులు**




**నిజాంపేట్ డిసెంబర్ 22(జనంసాక్షి):** నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో గల బాచుపల్లి మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్మిక ఉద్యోగులకు కనీస వేతనం 26,000 అమలు చేయాలని సిఐటియు మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వలు తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ముఖ్యంగా కార్మికులకు ప్రమాదమైన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు, మున్సిపల్ కార్మికుల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు మారాలని పనిగంటలు తగ్గించాలని ప్రతి కార్మికునికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని మున్సిపల్ కార్మికులకు కనీస ఉద్యోగ భద్రత, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు, రాష్ట్రంలో కార్మికులు,శ్రామికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు,నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కార్మికులను అందర్నీ నూతనంగా ఏర్పడిన జిహెచ్ఎంసి కార్మికులుగా ఉద్యోగులుగా పరిగణించాలని ఎటువంటి ఇబ్బందులకు గురి చేయొద్దని తెలియజేశారు. జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం ఉద్యోగులకు కార్మికులకు జీతభత్యాలు చెల్లించాలని అన్నారు. రాబోయే రోజుల్లో నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరూ ఐక్యంగా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఉన్నికృష్ణ సిఐటియు బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్, సిఐటియు బాచుపల్లి మండల కోశాధికారి. ఎన్ ఎల్లమ్మ, బాచుపల్లి మండల కమిటీ సభ్యులు ఎం నరసింహ,బాచుపల్లి మండల కమిటీ సభ్యుడు అంజి, మండల కమిటీ సభ్యులు కే లక్ష్మి, సిఐటియు నాయకులు ఎస్. బిక్షపతి, ఎన్ .పోచమ్మ, ఎస్. పోచమ్మ కె. జగన్, శ్రీను. మౌనిక, కార్మికులు పాల్గొన్నారు.

### చేవెళ్ల మాజీ ఎంపీపీ సొంత నిధులతో

# అల్లవాడ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి



**చేవెళ్ల, డిసెంబర్ 22 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేయూతన ఒదించాలని చేవెళ్ల మాజీ ఎంపీపీ విజయలక్ష్మీరమణా రెడ్డి పిలుపునిచ్చారు. చేవెళ్ల మండల పరిధిలోని గుండాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తన సొంత నిధులు రూ.50 వేలతో నిర్మించిన ప్రధాన గేట్‌ను సోమవారం ఉపాధ్యాయులు స్థానిక నాయకులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీర మణారెడ్డి మాట్లాడుతూ...గతంలో కూడా తమ సొంత నిధులు రూ.3.5 లక్షలతో పాఠశాల చుట్టూ ప్రహరి నిర్మాణం చేపట్టినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అందరూ కలిసి కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు మంచి విద్యను పొందుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డి, అల్లవాడ సర్పంచ్ జుట్టు లావణ్య యాదయ్య, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు విజయ, ప్రసన్న, మాణిక్ ప్రభు, రాధిక, శ్రీనివాస్, పద్మమ్మ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు యాలాల కరుణాకర్ రెడ్డి, బి.కృష్ణ, భీం రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, దర్శన్, సత్యానందం, శేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీసీ విద్యార్థులకు

# ఐఈఎల్‌టీఎస్ ఉచిత కోచింగ్

**దరఖాస్తులకు ఆహ్వానం : జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఝాన్సీ రాణి**

**మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 22 (జనంసాక్షి):** విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆశయం ఉన్న వెనుకబడిన తరగతుల (బీసీ) విద్యార్థులకు ప్రభుత్వం కీలక అవకాశం కల్పిస్తోంది. ఐఈఎల్‌టీఎస్ (ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సర్వీస్)-2026కు సంబంధించి ఉచిత కోచింగ్ కార్యక్రమానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీ రాణి తెలిపారు.ఈ ఉచిత ఐఈఎల్‌టీఎస్ కోచింగ్‌కు దరఖాస్తుల స్వీకరణను డిసెంబర్ 21, 2025 నుంచి జనవరి 11, 2026 వరకు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. అర్హులైన బీసీ విద్యార్థులను ఎంపిక చేసి, ఐఈఎల్‌టీఎస్ పరీక్షలో అవసరమైన ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలపై నిపుణుల ద్వారా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన బీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఐఈఎల్‌టీఎస్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించి విదేశీ విద్య అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఝాన్సీ రాణి సూచించారు.

ఈ కోచింగ్ ద్వారా భాషాపరమైన నైపుణ్యాలు పెంపొందడంతో పాటు, అంతర్జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు మార్గం సుగమమవుతుందని ఆమె పేర్కొన్నారు.దరఖాస్తు విధానం, అర్హతలు మరియు ఇతర వివరాల కోసం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె కోరారు.

# ఆదిత్య మెహతా ఫౌండేషన్ పారా అథ్లెట్లు

**ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్‌కు ఎంపిక**




**హైదరాబాద్, డిసెంబర్ 22 (జనంసాక్షి):** భారత దేశంలో పిల్లలకు అందించే అత్యున్నత పౌర పురస్కా రాలలో ఒకటైన ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్‌కు ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్) కు చెందిన పారా అథ్లెట్లు శివాని, జ్యోతి ఎంపికయ్యా రు. ఈ పురస్కారాన్ని న్యూఢిల్లీలో ఈనెల 26వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మద్దికేర గ్రామానికి చెందిన శివాని, హర్యానాకు చెందిన జ్యోతి ఇద్దరూ ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ పొందుతున్న పారా అథ్లెట్లు. పారా క్రీడల్లో అసాధారణ ప్రతిభ, పట్టుదల, నిరంతర శ్రమకు గుర్తింపుగా వీరు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. శివాని పారా అథ్లెటిక్స్‌లో జావెలిన్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో, జ్యోతి డిస్కస్ త్రో, షాట్‌పుట్, జావెలిన్ త్రో విభాగాల్లో విశేష ప్రతిభను కనబరుస్తున్నారు. గత నాలుగేళ్లుగా వీరు చూపిన అంకితభావం, క్రమశిక్షణ, అచంచలమైన సంకల్పశక్తికి ఇది నిదర్శనం. వీరి గ్రాస్‌రూట్ స్థాయి నుంచి పూర్తి శిక్షణకు ఆదిత్య మెహతా ఫౌండేషన్ మద్దతు ఇచ్చింది. రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం పారా క్రీడల్లో వీరి ప్రతిభకు లభించిన అత్యున్నత జాతీయ గుర్తింపుగా చెప్పవచ్చు. ఈ విజయానికి సహకరించిన ఇన్వెస్కో, ఫ్లట్టర్, జీఎంఎంసీఓ, ఆల్కాన్ కు ఆదిత్య మెహతా ఫౌండేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఆదిత్య మెహతా ఫౌండేషన్ పారా అథ్లెట్లకు శిక్షణ, పునరావాసం, పోటీ అవకాశాలు కల్పిస్తుంది.

# చెరువులోనే ప్లాస్టిక్ వ్యర్థాలు



- వరద కాలువ కబ్జాలు
- ఆక్రమణలపై హైడ్రా ప్రజావాణికి 37 ఫిర్యాదులు

**హైదరాబాద్, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** చెరువుల ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టి.. ప్లాస్టిక్ వ్యర్థాలతో జలా శయాలను కలుషితం చేస్తున్నారు. పక్కనే భూమి ఉన్న వారు అప్పటికే ఉన్న లే ఔట్లోకి 50 మీటర్ల మేర చొరబడి రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారు. ఇక రహదారులు, పార్కుల గురించి పట్టించుకోకుండా.. అమ్మేయడం, ఆక్రమించడం వంటి ఫిర్యాదులు ప్రజావాణికి అందుతున్నాయి. దశాబ్దాల క్రితం నుంచి పార్కులు, రహదా రులు, ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాల పరిరక్షణకు పోరాడుతున్న వారు హైడ్రా ప్రజావాణికి హాజరై అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. గొలుసు కట్టు చెరువులు, నాలాల ప్రాముఖ్యతను పట్టించుకోకుండా.. కబ్జాలకు పాల్పడుతు న్నారంటూ వాపోతున్నారు. నాలాలకు బఫర్ జోన్ వదలకపోవడమే కాదు.. వాటిని ఆక్రమించి నిర్మాణాలు చేపడు తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. ఆఖరుకు బస్సులు ఆపేందుకు ఉద్దేశించిన బస్సు స్టాపులను కూడా కబ్జా చేసే స్తున్నారని వాపోయారు. ఇలా సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణికి 37 ఫిర్యాదులందాయి.

వీటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ ఆర్.సుదర్శన్ పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలు అప్పగించారు.

# కుల,మతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తా

**సర్పంచ్ బొల్లారం నివేదిత ఇంద్రసేనారెడ్డి**

**శంకర్ పల్లి, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించి ఓట్లు వేసి గెలిపించారు. .వారికి నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడానికి శాయశక్తుల కృషి చేస్తామని శేరిగూడ నూతన గ్రామ సర్పంచ్ బొల్లారం నివేదిత ఇంద్రసేనారెడ్డి తెలిపారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి గిరిరాజ్ గ్రామ సర్పంచ్ బొల్లారం నివేదిత ఉపసర్పంచ్ మాధవి, వార్డ్ మెంబర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శేరి గూడెం గ్రామపంచాయతీ ఎన్నికలు ఈనెల 14వ తేదీన నిర్వహించారని ఓట్ల లెక్కింపు కూడా అదే రోజు జరిగిందని తెలిపారు.కాగా ఎన్నికలలో అవకతవకలు జరిగాయని,పోలింగ్ అధికారి రిగ్గింగ్ కు పాల్పడిందని ఓడిపోయిన అభ్యర్థులు ఎన్నికల ప్రధాన అధికారికి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో పాటు చేవెళ్ల లోని జిల్లా కోర్టు, హైకోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే.కాగా ఎన్నికలలో పోలింగ్ నిర్వహించే అధికారులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నియమించడం జరగదని అధికారులే ఎన్నికల అధికారులను నియమిస్తారని ఆమె తన కు బంధువు అని తనకు అనుకూలంగా ఓట్లు వేసిందని ఓడిపోయిన అభ్యర్థులు ఆరోపించడం అవాస్తవమని పేర్కొన్నారు. పోలింగ్ రోజున ఎన్నికలు నిర్వహించే సమయంలో పోలింగ్ అధికారి సిబ్బందితో పాటు ఏజెంట్లు కూడా ఉంటారని ఒకవేళ రిగ్గింగ్ జరిగితే ఏజెంట్లు అభ్యంతరం ఎందుకు చెప్పలేదని ఆమె ప్రశ్నించారు.పోలింగ్ అధికారిగా వచ్చిన అధికారి తమకు బంధువు కాబట్టి తమ గెలుపుకు ఆమెని కారణమని తమ గెలుపును జీర్ణించుకోలేని ఓడిపోయిన అభ్యర్థులు తమపై అనవసరమైన ఆరోపణలు చేస్తూ పత్రికలలో ఇష్టమైన విధంగా వార్తలు రాయించుకోవడం అభ్యంతరకరంగా ఉందని పేర్కొ న్నారు.తాము ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తులను కామని, గతంలో తన భర్త ఉపసర్పంచ్ గా ప్రజలకు సేవ చేశాడని, ప్రస్తుతం తమ గ్రామం జనరల్ మహిళకు కేటాయించడంతో తాను సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశానని ఆమె తెలిపారు. పత్రికల వారు కూడా నిజాలు వ్రాయాలని , పోలింగ్ అధికా రిగా పాల్గొన్న వ్యక్తి తమకు బంధువు అనే నెపంతో ఆరోపణలు చేస్తూ నిందలు తనపై మోపుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో తాను సర్పంచ్ గా గెలిచానని ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు.



ఓడిపోయిన అభ్యర్థులు తన గెలు పును జీర్ణించుకోలేక తనపై అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని ఆరోపణలు అవాస్తమని ఆమె ఖండించారు.వారు కోర్టును ఆశ్రయించినందున కోర్టు ఆదేశాల మేరకు తాను వ్యవహరి స్తానని స్పష్టం చేశారు.పోలింగ్ అధికారిగా పాల్గొన్న వ్యక్తి గదిలో ఏడవ వార్డు, ఎనిమిదో వార్డు మెంబర్లు వారి మద్దతు దారులు గెలిచారని ఆమె స్పష్టం చేశారు.గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా చేయడంతో పాటు ఇరిగేషన్ శాఖకు చెందిన భూమి, లావుని పట్టాలు కూడా వారు కబ్జా చేశారని వారి కబ్జా వివరాలు కూడా త్వరలో అధికారులకు ఫిర్యాదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాను కోరుతానని స్పష్టం చేశారు.

# బడాబాబుల ఆక్రమణలకు హైడ్రా చెక్

- నెక్నాంపూర్‌లో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
- రూ. 2500 వేల కోట్ల విలువైన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

**హైదరాబాద్, డిసెంబర్ 22 (జనంసాక్షి) :** ఐటీ కేంద్రంగా.. అత్యంత ఖరీదైన నెక్నాంపూర్ ప్రాంతంలో 23.16 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా సోమవారం కాపాడింది. రూ.2500 కోట్లకు పైగా విలువ ఉన్న భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. ఈ ఆక్రమణల వెనుక బడాబాబుల కుట్రలను హైడ్రా భగ్నం చేసింది. సామాన్యులను ముందు పెట్టి.. భూమిని సొంతం చేసుకునిరూ. కోట్లకు పడగలెత్తేందుకు బడాబాబులు చేసిన ప్రయత్నాలకు హైడ్రా చెక్ పెట్టింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం, నెక్నాంపూర్ విలేజ్ సర్వే నంబరు 20లో ఉన్న 23.16 ఎకరాల భూమి ఆక్రమణలకు గురి అవుతోందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు.. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో హైడ్రా లోతైన విచారణ చేపట్టింది. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్న తర్వాత ఆక్రమణలను హైడ్రా తొలగించింది. కొన్ని కట్టడాలను ఇప్పటికే నేలమట్టం చేయగా.. సోమవారం మరి కొన్ని ప్రహరీలతో పాటు షెడ్డులను తొలగించి వెనువెంటనే 23.16 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను నెలకొల్పింది.




**బడాబాబుల ఆక్రమణలకు చెక్..**

ప్రభుత్వ భూమి ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోయి, సామాన్యులను ముందుంచి కబ్జాల పర్వాన్ని నడిపించిన బడాబాబుల ఆగడాలకు హైడ్రా చెక్ పెట్టింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం పూర్తిగా ప్రభుత్వ భూమి అయినప్పటికీ.. పాకాల పోచయ్య దగ్గర భూమిని కొన్నట్టు మహ్మద్ ఇబ్రహీం అనే వ్యక్తి తప్పుడు రికార్డులను సృష్టించారు. ఇలా కొన్నామని చెప్పిన భూమికి సంబంధించి పాసు బుక్కులు ఇప్పించాలని కోర్టును ఆశ్రయించడం జరిగింది. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూమిగా నిర్ధారించి ఇదే విషయాన్ని కోర్టుకు తెలియజేశారు. ఎలానూ తన వద్ద కొన్నట్టు మహ్మద్ ఇబ్రహీం నకిలీ రికార్డు సృష్టించడంతో.. పోచయ్య కుటుంబం కూడా హక్కులకోసం పోరాడడం ఇక్కడ గమనార్హం. ఈ తంతుపై మహ్మద్ ఇబ్రహీంపై రెవెన్యూ అధికారులు నార్సింగ్ పోలీసు స్టేషన్లో కేసు కూడా నమోదు చేశారు. 1975లో ఈ భూమిని పోచయ్య దగ్గర నుంచి కొన్నట్టు మహ్మద్ ఇబ్రహీం తప్పుడు పత్రాలు సృష్టిస్తే.. 2019లో పాకాల పోచయ్య కుటుంబ సభ్యులు అదే భూమి తమదం టూ పోరాటం మొదలు పెట్టడం కొసమెరుపు.

**ఊపిరి పీల్చుకున్న స్థానికులు**

వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ కొట్టేద్దామని బడాబాబులు చేసిన ప్రయత్నాలకు హైడ్రా చెక్ పెట్టింది. సామాన్యులను ముందు పెట్టి బడాబాబులు చేసే కబ్జా ప్రయత్నాలకు హైడ్రా భగ్నం చేసింది. అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. నగర ప్రణాళిక నిబంధనల ప్రకారం.. ప్రణాళికాబద్ధ అభివృద్ధితో పాటు ఓపెన్ స్పేస్, గ్రీన్ జోన్లుగా ఈ స్థలాలను అభివృద్ధి చేయాలని స్థాని కులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా వంటి పటిష్టమైన వ్యవస్థను తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు.

# మీ గ్రామానికి మీరే కథనాయకులు

- నాయకుడిగా కాకుండా సేవకుడిగా ప్రజలకు అందుబాటులో ఉండాలి
- దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు
- గత ప్రభుత్వంలో సర్పంచ్లు చేసిన పనులకు బిల్లులు రాలేదు
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు డిసెంబర్ 22 (జనంసాక్షి):** మీ గ్రామానికి మీరే కథనాయ కులని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాండూ ర్ మండలం కరణ్ కోట్ గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్, ఉప సర్పంచ్ బసప్ప , గౌతపూర్ సర్పంచ్ సుజన మహేష్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి నుండి గ్రామ పంచాయతీ పగ్గాలు సర్పంచ్ చేతుల్లోకి, కథన రంగంలో కథానాయకులు మీరే అన్నారు.సర్పంచ్ అనేది పదవి కాదు, భాధ్యత అన్నారు.నాయకుడిగా కాకుండా సేవకుడిగా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామంలో ఎంతో మంది ఉన్న సర్పంచ్ గా అవకాశం ఒక్కరికి మాత్రమే వస్తుంది. వచ్చిన అవకాశం మీరు గ్రామ ప్రజల కోసం పని చేయాలని సూచించారు.దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు అంటారు. దీన్నిబట్టే చూస్తే గ్రామపాలన ఎంత ముఖ్యమైనదో మనం అర్థం చేసుకోవాలన్నారు.ఇలాంటి గ్రామాల్లో సుపరిపాలన అందించే భాధ్యత గ్రామ ప్రథమ పౌరుడిగా మీపై ఉందన్నారు.ప్రజల ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా పని చేయాలన్నారు.నేటి నుండి గ్రామ ప్రజలందరూ మీ కుటుంబ సభ్యులే.గ్రామంలో ఎవ్వరికి ఏ ఆపద వచ్చిన, కష్టం వచ్చిన అందరికి మొదటగా గుర్తుకు వచ్చేది గ్రామ సర్పంచ్ గా మీరేనని తెలిపారు.గ్రామ సర్పంచ్ గామీ వీధులు, భాధ్యతలు ప్రతి సర్పంచ్ తప్పకుండా తెలుసుకోవాలన్నారు.గత ప్రభుత్వంలో సర్పంచ్లు చేసిన పనులకు బిల్లులు రాలేదని విమర్శించారు.గత రెండు సంవత్సరాల నుండి గ్రామాలల్లో పాలకవర్గం లేక పాలనకుంటూ పడట్టం వాస్తవంఅన్నారు.ప్రజా ప్రభుత్వంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు అదృష్టవంతులు అన్నారు.గత రెండేళ్లుగా నిలిచిపోయిన ఆర్థిక సంఘం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు విడుదల చేయబోతుందన్నారు.సర్పంచ్ అభ్యర్థిగా మీరు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ దశల వారిగా అమలు చేసేట్లు ప్రణాళికలు సిద్దం చేసుకోవాని సూచిం చారు.గ్రామా అభివృద్ధికై మీరు సర్పంచ్ గా యువజన సంఘాలు, ఉద్యోగస్థులు, మేధవి వర్గంతో పాటు పలువురి సూచనలు తీసుకోవాలన్నారు.సర్పంచ్ గా మీ పనితనం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడానికి పునాది కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్ మహారాజ్ , డీసీసీ అధ్యక్షుడు ధారసింగ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగప్ప , నర్సిరెడ్డి , ఉత్తమ్ చంద్ , తాండూరు ఎంపీడీవో , ఎంఆర్ఓ , మండల నాయకులు, రెండు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
23 డిసెంబర్ 2025

# సంక్షేమ శాఖలలో స్కాలర్ షిప్ బకాయిలు రూ.365.75 కోట్లు విడుదల

- గత ప్రభుత్వం కాలం నుంచి పెండింగ్ లో ఉన్న బకాయిలు అన్ని ఒకేసారి విడుదల
- విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రజా ప్రభుత్వం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్ (జనంసాక్షి) : సంక్షేమ శాఖలలో పెండింగ్ లో ఉన్న బకాయిలు అన్ని ఒకేసారి విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న బిల్లుల బకాయిలు క్లియర్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా ప్రజా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. విద్య విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు. కేవలం విద్యతోనే సమాజంలో సమూల మార్పులు వస్తాయని అన్నారు. బకాయిలకు విషయానికి వస్తే.. బీసీ, ఎస్సీ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలకు సంబంధించిన రూ.365.75 కోట్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం మేరకు సోమవారం సాయంత్రం ఆర్థక శాఖ అధికారుల విడుదల చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజాభవన్ లో ఆర్థిక, సంక్షేమ శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం భట్ట విక్రమార్క సమీక్షా సమీవేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన రూ.21.62 కోట్లు, ఎస్సీ సంక్షేమ శాఖకు సంబంధించి రూ.191.63 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి రూ.152.59 కోట్లు విడుదలయ్యాయి. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్

- ఆస్తిపన్ను చెల్లింపులో 90శాతం వడ్డీ రాయితీ




హైదరాబాద్, డిసెంబరు 22 (జనంసాక్షి) : భాగ్యనగరవాసులకు జీహెచ్ఎంసీ కమిషనర్ తీపి కబురు అందించారు. దీర్ఘకాలంగా ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారికి ఊరటనిస్తూ 'వన్ టైమ్ సెటిల్మెంట్' పథకాన్ని ప్రకటించారు. ఈ స్కీమ్ కింద పాత బకాయిలపై పేరుకుపోయిన వడ్డీలో ఏకంగా 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. చాలా కాలంగా ఆస్తి పన్ను చెల్లించని ఆస్తులపై భారీగా వడ్డీ పేరుకు పోయింది. పన్ను చెల్లింపుదారుల విజ్ఞప్తి మేరకు, 2025?26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ రాయితీని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఈ పథకం ప్రకారం.. పన్ను చెల్లింపుదారుడు తన అసలు పన్ను మొత్తాన్ని చెల్లిస్తూ, దానిపై ఉన్న వడ్డీలో కేవలం 10 శాతాన్ని మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 90 శాతం వడ్డీని కార్పొరేషన్ పూర్తిగా మాఫీ చేస్తుంది. ఈ వన్ టైమ్ సెటిల్మెంట్ స్కీమ్ కేవలం ప్రైవేట్ వ్యక్తులకు మాత్రమే కాకుండా, ప్రభుత్వ ఆస్తులకు కూడా వర్తిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయ పరిధితో పాటు, ఇటీవల గ్రేటర్ హైదరాబాద్‌లో కలిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు మరియు గ్రామ పంచాయతీల పరిధిలోని ఆస్తులన్నింటికీ ఈ రాయితీ వర్తిస్తుంది. పన్ను బకాయిలు ఉన్న యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పథకం ద్వారా అటు ప్రజలకు వడ్డీ భారం తగ్గుతుందని, ఇటు జీహెచ్ఎంసీకి భారీగా ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా సంబంధిత సర్కిల్ కార్యాలయాల్లో పన్ను చెల్లించి ఈ 90 వడ్డీ మాఫీని పొందవచ్చు.

## విద్యుత్ ఉద్యోగులకు 17.651 శాతం డీఏ

హైదరాబాద్, డిసెంబరు 22 (జనంసాక్షి) : విద్యుత్ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. 17.651 శాతం డీఏను ఖరారు చేసింది. 2025 , జూలై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు కానుంది. డీఏ పెంపు ప్రతిపాదనలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆమోదం తెలిపారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉద్యోగులందరికీ డీఏ వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మొత్తం 71,387 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు లబ్ది చేకూరనుంది. అంతేకాకుండా విద్యుత్ సంస్థలపై నెలకు 9.39 కోట్ల రూపాయల అదనపు ఆర్థిక భారం పడనుంది.

## ఒంటరి మహిళపై అత్యాచార యత్నం

- బీహార్‌కు చెందిన ఇద్దరు యువకుల అరెస్ట్

మహబూబాబాద్, డిసెంబరు 22 (జనంసాక్షి) : మహిళ ఒంటరిగా కనిపిస్తే చాలు... కామాంధులు రెచ్చిపోతున్నారు. వయసుతో సంబంధం లేకుండా వారిపై దారుణానికి పాల్పడుతున్నారు. ఎన్ని కఠిన శిక్షలు అమలు చేస్తున్నా కూడా ఇలాంటి అకృత్యాలు ఆగడం లేదు. నిత్యం ఎక్కడో చోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా, మహబూబాబాద్‌లో దారుణం చోటు చేసుకుంది. రైస్ మిల్లులో పని చేస్తున్న మహిళపై బీహార్‌కు చెందిన యువకులు అసభ్యకరంగా ప్రవర్తించారు. ఇనుగుర్తి మండల పరిధిలోని ఓ రైస్ మిల్లులో దారుణం చోటు చేసుకుంది. ఓ మహిళ రైస్ మిల్లులో పని చేస్తుంటుంది. అయితే ఇటీవల ఆ మహిళ మిల్లులో పని చేస్తుండగా.. బీహార్‌కు చెందిన ఇద్దరు యువకులు ఆమెపై కన్నేశారు. ఒంటరిగా ఉన్న సమయంలో రైస్ మిల్‌లోకి చొరబడి ఆమెపై అత్యాచార యత్నం చేశారు. దీంతో ఒక్కసారిగా షాకైన ఆ మహిళ తీవ్రంగా ప్రతిఘటించింది. ఎలాగోలా వారి నుంచి తప్పించుకుని స్థానికులకు విషయం తెలియజేసింది. స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

## జనవరి 13 నుంచి కైట్ ఫెస్టివల్

- ఫెస్టివల్ ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష
- పునరుద్దరించిన చెరువుల వద్ద ఉత్సవాలకు సూచన



హైదరాబాద్, డిసెంబర్ 22 (జనంసాక్షి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో వచ్చే నెల 13వ తేదీ నుంచి కైట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. దీని ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ వాతావరణానికి తగిన విధంగా హైదరాబాద్ నగరపు సాంస్కృతిక వైభవం ప్రతిబింబించేలా కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కైట్ ఫెస్టివల్ కు ప్రత్యేక గుర్తింపు, విస్తృత ప్రచారం కల్పించేలా సరైన పేరు, ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన లోగోను రూపొందించాలని సంబంధిత శాఖలను ఆయన ఆదేశించారు. హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువుల వద్ద ఈ కైట్ ఫెస్టివల్ ను నిర్వహించాలని గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షను సిఎస్ తెలిపారు. దీని ద్వారా నగరంలోని నీటి వనరుల పునరుద్ధరణలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యమని ఆయన అన్నారు. గుర్తించిన ప్రదేశాల్లో కైట్ ఫెస్టివల్ కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించి సమన్వయం చేయడానికి జిహెచ్ఎంసి హెచ్ఎండిఎ , హైడ్రా తరపున ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన ఆదేశించారు. జనవరి మొదటి వారం నుంచి మంత్రులు పునరుద్ధరించబడిన చెరువులను సందర్శించి ఏర్పాట్లను సమీక్షిస్తారని ఆయన తెలిపారు. మావేశంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ నగరవ్యాప్తంగా హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువులపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. నీటి నిల్వ సామర్థ్యం పెంపు, పర్యావరణ స్థిరత్వం , ప్రజాప్రయోజనాల కోసం చేపట్టిన పునరుద్ధరణ పనులను వివరించారు.



## డీజీపీ కార్యాలయంలో కాకాకు ఘన నివాళులు

హైదరాబాద్ (జనంసాక్షి) : మాజీ కేంద్ర మంత్రి దివంగత జి.వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం డిజిపి కార్యాలయంలో ఆయనకు ఘన నివాళు లర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఇన్చార్జ్ డిజిపి మహేష్ ఎం. భగవత్ పాల్గొని, వెంకటస్వామి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ ఈ నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అధికారిక లాంఛనాలతో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏఐజి రమణ కుమార్ తో పాటు డిజిపి కార్యాలయ పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పంచాయతీలు దేశానికి ఆదర్శం

- ఆ ఘనత తొలి సిఎం కెసిఆర్‌దే
- నెమ్మికల్ గ్రామ సర్పంచ్ ప్రమాణస్వీకారం
- కార్యక్రమంలో మాజీమంత్రి జగదీశ్ రెడ్డి వ్యాఖ్య



సూర్యాపేట, డిసెంబర్ 25 (జనంసాక్షి) : తెలంగాణ గ్రామపంచాయతీలు యావత్ దేశానికే ఆదర్శమని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. ఆ ఘనత ముమ్మాటికీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దే అని అన్నారు. గత ఉమ్మడి పాలనలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని గ్రామాలు.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని గ్రామాల రూపురేఖలు మార్చుకున్నామని గుర్తుచేశారు. సూర్యాపేట నియోజకవర్గం లోని ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్ గ్రామ సర్పంచ్ ప్రమాణస్వీకారం వేడుకకు జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లను సత్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో పదేండ్లు ఎనలేని అభివృద్ధి సాధించుకున్నామని తెలిపారు. దేశంలోనే అభివృద్ధి చెందిన గ్రామాల్లో మొదటి పది తెలంగాణ గ్రామాలే ఉన్నాయని.. మొదటి 20 గ్రామాల వారీగా చూసిన 19 స్థానాలను తెలంగాణ గ్రామాలే కైవసం చేసుకున్నాయని పేర్కొన్నారు. అంతటి ఘన చరిత్ర కేసీఆర్ పాలనకే సాధ్యమైందని పేర్కొన్నారు. ప్లలె ప్రకృతి వనాలతో పచ్చదనం పెంచుకున్నామని.. వాటి సంరక్షణకై ప్రతి గ్రామంలో వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసుకున్నామని జగదీశ్ రెడ్డి తెలిపారు. మిషన్ భగీరథ ట్యాంకుల ద్వారా మంచినీటి సమస్య తీర్చామని, గ్రామానికో ట్రాక్టర్, వైకుంఠధామాలు, రోడ్లు ఇలా గ్రామానికి కావలసిన సౌకర్యాలు అన్ని పూర్తి చేసుకున్నామని పేర్కొన్నారు. ఇన్ని సౌకర్యాలు ఉన్న గ్రామాలు దేశంలోనే మరెక్కడా లేవని.. అందుకే మన తెలంగాణ గ్రామాలు అభివృద్ధిలో నెంబర్ వన్ గా నిలిచాయని స్పష్టం చేశారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు తప్ప.. గ్రామాలను ఐక్యతతో అభివృద్ధి చేసుకుందామని జగదీశ్ రెడ్డి సూచించారు. ఇదే కేసీఆర్ నేర్పిన అభివృద్ధి మంత్రం.. ఈ మార్గంలోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. అంతా ఐక్యతతో కలిసి గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడపాలని పిలుపునిచ్చారు

## పవన్, ఎన్టీఆర్‌ల పిటిషన్లపై విచారణ

- ఫోటోల మార్ఫింగ్‌పై ఢిల్లీ కోర్టు ఆదేశం




న్యూఢిల్లీ, డిసెంబరు 22 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ దాఖలు చేసిన వ్యక్తిత్వ హక్కుల పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టుసోమవారం విచారణ చేపట్టింది. జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా ధర్మాసనం ఈ వ్యవహారాన్ని పరిశీలించింది. సామాజిక మాధ్యమాల్లో తమ ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య అవసరాలకు వినియోగించడం, తప్పుడు ప్రచారం చేయడం వల్ల తమ వ్యక్తిత్వ హక్కులకు భంగం వాటిల్లుతోందని ఎన్టీఆర్, పవన్ కల్యాణ్ పిటిషన్లలో పేర్కొన్నారు. వీరిద్దరి తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ వాదనలు వినిపించారు. మార్ఫింగ్ ఫొటోలు, అవమానకర పోస్టులు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. కేసుల్లో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, గూగుల్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే కొన్ని లింకులను తొలగించినట్లు ప్రతివాదులు కోర్టుకు వివరించారు. అయితే తొలగించిన లింకులపై ఆదేశాలు జారీ చేయడానికి ముందు సంబంధిత ఖాతాదారులకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. లింకులు అభిమానుల ఖాతాల నుంచి వచ్చినవని ఇన్‌స్టాగ్రామ్ నిరాకరణతో స్పష్టంగా పేర్కొనాలని హైకోర్టు సూచించింది. గూగుల్ తమ వినియోగదారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని లేదా ఖాతాలను నిలిపివేయాలని ఆదేశించింది. సంబంధిత లాగిన్ వివరాలను మూడు వారాల్లో అందించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను మే 12వ తేదీకి వాయిదా వేసింది.

## జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనపై జోక్యం చేసుకోలేం

హైదరాబాద్, డిసెంబరు 22 (జనంసాక్షి) : జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీలో డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఎంసీహెచ్ఆర్డీలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమర్పించిన నివేదిక ఆధారంగా వార్డుల పునర్విభజన చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. ఆ నివేదికను బయటపెట్టలేదని, అభ్యంతరాల స్వీకరణకు తగినంత గడువు ఇవ్వలేదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదించారు. చట్టపరిధిలోనే డీలిమిటేషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ప్రభుత్వం తరఫు న్యాయవాది బుధవారమే కోర్టుకు వివరించారు. సమాచారం ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచామని, ఇప్పటివరకు అందిన 3,100 అభ్యంతరాలు పరిష్కరిస్తున్నామన్నారు.

## నిందితుడిని పట్టుకోబోగా కత్తితో దాడి

### రెండు రౌండ్ల కాల్పులు జరిపిన సిఐ

అనంతపురం, డిసెంబరు 22 (జనంసాక్షి) : అనంతపురంలో సీఐపై కత్తితో దాడి చేసిన దేవరకొండ అజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో నిందితుడు అజయ్.. రాజా అనే యువకుడిపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుతో సోమ వారం ఉదయం ఆకుతోటపల్లి సమీపంలో ఇద్దరు కానిస్టేబుళ్లు ఆటో డ్రైవర్‌తో కలిసి నిందితుడు అజయ్‌ను పట్టుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అతడు పోలీసులపైనా దాడికి తెగబడ్డాడు. పోలీసులు తప్పించుకోగా ఆటో డ్రైవర్ బాబాకు గాయాలయ్యాయి. దీంతో రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లగా.. అతడిపైనా నిందితు డు దాడి చేశాడు. దీంతో సీఐ ఎడమ భుజంపై గాయమైంది. ఈ క్రమంలో నిందితుడి మోకాలిపై సీఐ రెండు రౌండ్లు కాల్పులు జరిపారు.

## రన్‌వైపై కూర్చుని పరీక్ష

- ఒడిషా ఘటనపై సోషల్ మీడియాలో వైరల్



భువనేశ్వర్, డిసెంబర్22 (జనంసాక్షి) : ప్రభుత్వ ఉద్యోగం కోసం వేలాది మంది అభ్యర్థులు ఎయిర్‌పోర్ట్ రన్‌వే పై నేలపై కూర్చుని పరీక్ష రాశారు. రన్‌వేపై పరీక్షా అని ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఇటీవల ఒడిశాలో జరిగిన ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హోంగార్డు ఉద్యోగం కోసం అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు ఒడిశా ప్రభుత్వం సంబల్‌పూర్ జిల్లాలోని జమర్‌పాలి రన్‌వేను కేటాయించారు. డెస్కులు, మ్యాట్‌లు వంటి కనీస సౌకర్యాలు లేకుండా 8,000మందికి పైగా అభ్యర్థులు రన్‌వేపై కూర్చుని పరీక్ష రాశారు. అభ్యర్థులను పర్యవేక్షించేందుకు డ్రోన్‌లను వినియోగించడం గమనార్హం. వివరాల ప్రకారం.. సబల్‌పూర్ జిల్లాలోని 24 పోలీస్‌స్టేషన్‌లలో హోంగార్డు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు కనీస అర్హత 5వ తరగతి ఉత్తీర్ణత. కేవలం 187 పోస్టుల కోసం జిల్లా వ్యాప్తంగా 8,000మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎంబిఎ, ఎంసిఎ, గ్రాడ్యుయేట్లు, ఇంజనీర్లు, డిప్లమో, ఐఐటి శిక్షణ పొందిన అభ్యర్థులతో పాటు కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పొందిన వారు కూడా ఉన్నారు. అభ్యర్థులను ఉదయం 6.00గంటలకు రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే ఉదయం 9.00 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడ్డారు. ఉదయం 10.30గంటలకు ప్రశ్నాపత్రాలను పంపిణీ చేయబడ్డాయి. 50మార్కుల ప్రశ్నాపత్రంలో 20 మార్కులకు పేరా రైటింగ్, 30 మార్కులకు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఉన్నాయి. ముగ్గురు అదనపు సూపరింటెండెంట్లు, 24మంది ఇన్స్పెక్టర్లు, 86మంది సబ్‌ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లతో పాటు వందమందికి పైగా హోమ్ గార్డులు, ట్రాఫిక్ సిబ్బందిని అభ్యర్థులను పర్యవేక్షించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగ సమస్యకు ఈ ఘటన నిదర్శనమని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉపాధి కల్పనలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని మండిపడ్డాయి.

## గుండెపోటు కాదు.. భార్య హత్య

- భర్తను హత్య చేసి గుండెపోటుగా చిత్రీకరణ
- పోస్ట్ మార్టమ్ రిపోర్ట్‌తో బయటపడ్డ వ్యవహారం



మేడ్చల్, డిసెంబరు 22 (జనంసాక్షి) : మేడ్చల్ జిల్లా మేడిపల్లి బృందావన్ కాలనీలోని ఓ ప్లే స్కూల్‌లో డిసెంబర్ 12న అశోక్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తన భర్త గుండెపోటుతో మరణించాడని భార్య చెప్పడంతో అంతా అదే నిజమని అనుకున్నారు. అయితే పోస్టుమార్టంలో రిపోర్టులో హత్య చేసినట్లు తెలిసింది. దీంతో మృతుడి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకుని లోతుగా విచారించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల కథనం మేరకు.. అశోక్, పూర్ణిమ దంపతులకు 11 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. సంతోషంగా సాగుతున్న వీరి కుటుంబంలో భార్య కారణంగా సమస్యలు వచ్చిపడ్డాయి. పూర్ణిమ ఇంటి పక్కనే అద్దెకు ఉంటున్న మహేష్ అనే యువకుడితో పూర్ణిమకు ఏర్పడిన పరిచయం.. చివరకు వివాహేతర సంబంధానికి దారి తీసింది. భర్త లేని సమయంలో పూర్ణిమ, మహేష్ కలుసుకునేవారు. అయితే ఇటీవల ఓ రోజు వారి వివాహేతర సంబంధం భర్తకు తెలిసింది. పద్ధతి మార్చుకోవాలంటూ భార్యను పలుమార్లు హెచ్చరించాడు. అయినా పూర్ణిమ తన పద్ధతి మార్చుకోలేదు. ÷రిళిజూ భర్త మందలిస్తుండడంతో చివరకు పూర్ణిమ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ప్రియుడితో కలిసి తన భర్త హత్యకు ప్లాన్ చేసింది. చివరకు ఇద్దరూ కలిసి హత్యకు కుట్ర పన్నారు. ఇద్దరూ కలిసి భర్త మెడకు 3 చున్నీలు బిగించి హత్య చేశారు. తర్వాత మృతదేహాన్ని బెడ్ రూమ్‌లో పడుకోబెట్టారు. తన భర్తకు గుండెపోటు వచ్చి పడిపోయాడని, అశోక్ సోదరికి ఫోన్ చేసి చెప్పింది. సోదరి వచ్చి చూసే సరికి అశోక్.. బెడ్ పై అచేతనంగా పడి ఉన్నాడు. అయితే శరీరంపై దెబ్బలు ఉండటంతో అశోక్ సోదరి ప్రశ్నించింది. బాత్ రూమ్‌లో కింద పడ్డాడు అని పూర్ణిమ కప్పిపుచ్చింది. తర్వాత అశోక్ మృతదేహానికి పోస్ట్ మార్టం జరగకుండా.. పూర్ణిమ అడ్డుకునే ప్రయత్నం చేసింది. మహేష్ కూడా ఆస్పత్రి వద్దకు వచ్చి.. పోస్ట్ మార్టం వద్దు అని అశోక్ కుటుంబ సభ్యులకు చెప్పే ప్రయత్నం చేశాడు. అయితే పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో వైద్యులు హత్యగా తేల్చారు. పోలీసులు పూర్ణిమను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దశదిన కర్మ జరిగే వరకు పది రోజుల పాటు పూర్ణిమ ఎలాంటి అనుమానం రాకుండా నటించింది. అయితే ఈ 10 రోజుల్లో మహేష్‌తో అనేక సార్లు చాట్ చేసింది. అలాగే మూడు రోజుల క్రితం మహేష్‌తో కలిసి షాపింగ్‌కి కూడా వెళ్లినట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370